ఆంధ్రమహిళ



JANUARY '55 ANDHRA MAHILA ANNAS 8

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ మద్రాసు

మహిళా విద్యాలయము : హిందీ. కాశీ విశ్వవిద్యాలయపు ఎడ్మిషన్, ఇంటర్మీడియెట్. ఎస్.ఎస్.ఎల్.సి., పరీక్షలు.

పారిశ్రామిక విద్యాలయము (గవర్నమెంటుచే రికగ్నైజ్ చేయబడినది) : కుట్టు. ఎంబ్రాయిడరీ. [illegible]. అల్లికలు. నూలు వడకుట. చేనేత. అచ్చుకూర్పు, ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ. పేద విద్యార్థినులకు ఉచితము.

వస్త్రములపై అద్దకపుపని మిషనుకుట్టు, మిషను అల్లిక, చేనేత- బుక్ బైండిగు, ఎంబ్రాయిడరీ. : కేంద్ర ప్రభుత్వ పునరావాసశాఖవారిచే ఆంధ్రమహిళా సభ పారిశ్రామిక భవనములు. 7-వ [illegible] రోడ్డులో నడుపబడుచున్నవి.

టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ : స్త్రీలకు టైపు. —గవర్నమెంట్ పరీక్షలకు శిక్షణ.

మహిళా మందిరము : స్త్రీవిద్యార్థినులకు వసతిగృహము

ఆంధ్ర మహిళ : స్త్రీలలో విద్యావ్యాప్తికై, స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాసపత్రిక.


నిర్మలాదేవి గ్రంథాలయము : సభ్యురాండ్ర, విద్యార్థినుల ఉపయోగార్థము సేకరించిన తెలుగు. హిందీ. ఆంగ్ల గ్రంథ సముదాయము.

నర్సింగ్ హోమ్ : స్త్రీ. శిశువుల. సంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల— అడయారులో నిర్మించబడినది. భారత ప్రభుత్వ ఆరోగ్యశాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్స్‌ఎయిడ్—మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడుచున్నది.

ముద్రణశాఖ : ఆంధ్ర మహిళా సభవారిచే స్వంతంగా స్థాపించబడినది. విద్యార్థినులకు అచ్చుకూర్పు, బైండింగు, ప్రూఫ్ రీడింగు, మొదలైనవి వుచితంగా నేర్పబడును.

క్రీడా, క్లబ్బుశాఖలు.

సభ్యురాండ్రుగా జేరి, యీ జాతీయ సంస్థను పోషించండి.



ఆంధ్ర మహిళా సభ నర్సింగ్‌హోమ్‌లో కొత్తగా నిర్మింప బడుచున్న "చిల్డ్రెన్స్ వార్డు"కు

శ్రీమతి ఇందిరాగాంధీ

బుధవారము 19 - 1 - 55 తేదీనాడు ప్రారంభోత్సవము చేయుదురు.

శ్రీమతి మణిబెన్ పటేల్

ప్రారంభోత్సవమున కధ్యక్షత వహించెదరు.

తాము తప్పక దయచేయ ప్రార్థితులు.



ఆంధ్రమహిళ

సంపుటి 11 :: జనవరి '55 :: సంచిక 9

ఇంకా వెల్‌ఫేర్, బాలానందం, పాకకళ, గ్రంథసమీక్ష తదితర విషయములు.

సంవత్సరచందా :: :: ఆరు రూపాయలు.

సంపాదకురాలు : లక్ష్మీరఘురామ్

వ్యవస్థాపకురాలు : శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంయుక్త సంపాదకురాలు : కె. సుగుణమణి

ముద్రణ : ఆంధ్ర మహిళా ప్రెస్.

ఆంధ్రమహిళ

సంపుటి 11 :: జనవరి 55 :: సంచిక 9

పాడి పంటలు

మన ఆంధ్రదేశములో కోతలు ఆరంభించారు. ఈసారి పరిపంట సంతృప్తికరముగానే వున్నదంటున్నారు రైతులు. కాని మొన్న వ్యవసాయ శాఖవారి పంటలోత్సవము చేసుకొనుచున్న సందర్భములో శ్రీ రాజేంద్రప్రసాద్ మొదలగువారు మన రైతులు అధునిక పద్ధతులు అలవరచుకొని ఇంకా బాగా వ్యవసాయము చేయించి పంట ఎక్కువ పండేటట్లు చేయవలెనని చెప్పారు.

మన దేశమునకు పాడిపంటలే జీవకర్ర. అటువంటప్పుడు ఈ రెండింటి విషయమున ఎక్కువ శ్రద్ధ తీసికొనవలసి యున్నది.

పంట-వ్యవసాయముతోపాటు, పాడి విషయమున శ్రద్ధ తీసికొనవలసియున్నది. పాడిమీదనే మనదేశ ఆరోగ్య ధనసంపదలు చాలవరకు ఆధారపడియున్నవి. ఈపాడి విషయమున శ్రద్ధతీసికొనుట స్త్రీలు, గృహిణులవంతే అని నేను వేరుగ చెప్పవలసిన పనిలేదు. ఇంటిలో పాడిచక్కగా. చేసికొనుట ఒకపెద్దపనియే. కాని అదికష్టమని గాని. నామోషియనిగాని చేయకుండుట గర్హనీయము. కష్టేఫలి. చక్కగా ఇంటిలో తృప్తికరముగా పాలు పెరుగులు, వెన్న నేతులు. ఇంటిప్రాంగణములో ఆవుదూడలు గంతులువేస్తూ దూకుతూవుంటే ఆగృహానికి ఎంత అందం చూచుటకెంత ఆనందము.

వ్యవసాయము వలెనే - పాడివిషయములో కూడ ఎక్కువ శ్రద్ధతీసికొనవలసిన అవసరమున్నది. ఆవులు, పశువులకు పెట్టు ఆహారము నందేమి, వాటిని పెంచుట యందేమి, వాటివైద్య విధానమందేమి అవసరమున్నప్పుడెల్ల అధునాతనపు అలవాట్లు అలవరచుకొన వలసియున్నది. మనదేశములో పాడిపశువులు ఎక్కువ ఆరోగ్యకరముగ లేవు. అందుచేతనే తగినన్ని పాలును ఇచ్చుటలేదు. ఇట్టిపరిస్థితులకనేక కారణములున్నను ఈ విషయమున ప్రభుత్వము తగినశ్రద్ధతీసికొని తగినసహాయము చేయగలరని మనమాశించ వచ్చునేమో! పల్లెలో కేంద్రములు, పశు వైద్యశాలలూ ఇంకా చాలా ఎక్కువగా కావలసియున్నవి. గ్రామ సీమలలోని ప్రజలుత్సాహవంతులై పాడియందు తగిన శ్రద్ధ తీసికొనిన ప్రభుత్వము సహాయము చేయక తప్పుతుందా!

సంకల్పం

మన సంకల్పాలే మనచర్యలకు హేతుభూతాలౌతాయి; మనజీవిత విధానాన్ని నిర్ణయిస్తాయి. మనం ఎరిగీ ఎరుగక మాట్లాడే ప్రతీ మాటకూ, తెలిసీ తెలియకుండా గావించే ప్రతీచర్యకూ వెనుక మూలాంకురం సంకల్పమే. సంకల్పాలు విత్తనాల వంటివి. ఏ విత్తనం చల్లితే ఆ పంటే పండుతుంది. ఎలాంటి సంకల్పాలు మనబుర్రలో పుడుతుంటే మనంఅలాంటి వారమేఔతాం. యద్భావంతద్భవతి అన్నారు. పెద్దలు ఎప్పుడూ సత్సంకల్పాలే తలపెట్టమన్నారు.

రేపు మనం ఫలానా చోటుకు వెళ్ళాలి అన్నసంకల్పం ముందు పుడుతుంది. అదే మర్నాడు మనల్ని అక్కడకు తీసుకుపోతుంది. రేపు ఫలానా పనిచెయ్యాలి అనుకుంటాం—అలాగేచేస్తాం. అంటే ఏమిటి? ఇప్పటి సంకల్పాలే రేపటి చర్యగానూ, ఫలితాలుగానూ పరిణామం చెందుతున్నాయన్న మాటేగద.

ఐతే "బుద్ధికర్మానుసారిణీ" అన్నారుగదాయని, "అంతా మనకర్మం ప్రకారం జరుగుతుంది" అని నిస్పృహచెంది, కాళ్ళు ఆపజామకు కూర్చుంటే మానవుని కున్న ఘనత ఏదీ? కొంత మానవప్రయత్నం ఉండాలి; ఉంటే దైవసహాయం అదే లభిస్తుంది ఉదాహరణ "అత్రోవను వెళ్ళకు. పెద్దపులి ఉన్నద"ని ఒకరన్నారనుకుందాం. "కర్మ ఉంటే ఎలాగచస్తాం" అని కేవలంకర్మసిద్ధాంతాన్ని నమ్మి పులినోటబడి "కర్మం" అంటే ఎవరేమనగలరు? అతడుశక్తి కొలది ప్రయత్నించి. మరోత్రోవను పోదానికి యత్నించి. అప్పటికీ దానినోటబడితే "కర్మం" అని అప్పుడంటే, ఏమోనని అంతా అనుకోవచ్చు. "అవశ్యమనుభోక్తవ్యం కృతంకర్మ శుభాశుభం" అనిచెప్పిన పెద్దలే, సత్కర్మవలన దుష్కర్మఫలం కొంత తగ్గించుకోవచ్చునని. ఇంకా సామర్థ్యం ఉంటే "జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం" అన్నట్లు పూర్తిగా కర్మనే దగ్ధంగావించగల సమర్థత మానవుని కుందని చెప్పారు. సంకల్ప బలిమివల్ల ఆత్మవిశ్వాసం అబ్బుతుంది. మహా సముద్రాల్ని పిల్లకాలువగా దాటించ గలిగింది "విశ్వాసం;" విశ్వాసం సాధించలేనిది లేదు.

ఒకవ్యక్తియొక్క సంకల్ప బలిమిగొప్పదైతే అది తననూ, తోటివారినీ, ప్రపంచాన్నికూడ మార్చేసే ప్రభావంకలిగి ఉంటుంది. అలాంటి సంకల్ప సిద్ధులు అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఉంటూనే వుంటారు. "రామపాద సాగరం" "ఆంధ్రరాష్ట్రం" అన్నవి ముందు కొందరి బుర్రల్లో పుట్టిన ఊహలు మాత్రమే. ఐనా అవి క్రమంగా సాకారం దాల్చి, ప్రజాభ్యుదయానికి లోక కళ్యాణానికి దోహదమౌతాయి. వీటిని సంకల్పాలనండి, పగటికలలనండి, అలాంటి పకటికలలు గాంచేవారే మనకుకావాలి. గాంధీ మహాత్ముడి సంకల్ప బలిమి, ప్రపంచ చరిత్రనే మార్చివేసింది. అతణ్ణి గన్నతల్లి ఎలాంటి పగటి కలలు గన్నదో ఎవరు చెప్పగలరు? మనజాతీయ వీరులు, వీరనారీమణులూ జైళ్ళలోగన్న పగటి కలల ఫలితమే మనమంతా యిప్పుడు అనుభవిస్తున్న స్వాతంత్ర్యం అంటే, అతిశయోక్తి ఎలా అవుతుంది? సంకల్పం గొప్పదైనప్పుడు అది రేడియో ప్రసారం కంటే సూక్ష్మంగా ప్రసారంచెంది అనేక బుర్రల్లో నాటుకొని పని చేస్తుంది. అంతా వేదికలెక్కి ఉపన్యాసాలే యివ్వనక్కరలేదు, పేపర్లలో పేరు పడనక్కరలేదు, శారదామాత లాంటి వారి జీవితాలూ, సంకల్పాలూ ఎందరెందర్ని తమకు తెలియకుండానే మార్చి, తీర్చి, దిద్దుతున్నాయో ఎవరు చెప్పగలరు? పటుతర సంకల్పాలున్నవారు జైలులో గాదు, మహారణ్యాలలోగాదు, గుహాంతరాలలో నివసించినప్పటికీ, వారి సంకల్పాలు రాతిగోడల్ని దూసుకుపోయి శతాబ్దాలపాటు ప్రపంచాన్నే స్పందింప జేస్తాయి. సత్సంకల్పం యొక్క శక్తి అలాంటిది. రామకృష్ణ వివేకానందుల అమోఘ సంకల్పాలు అలాంటివి గనుకనే ఇంత ఇంతాం తరాలు ఉద్ధృతములుగా మారిపోతున్నాయి. ఈ పరిణామం ఆటంబాంబుల అట్టహాసం వంటిదా? కాదు. అంతకంటెను పటుతరమైనది; అయినా, కనులకు కనబడకుండను, చెవులకు వినపడకుండను, రోజా పుష్పరాసులను వికసింపజేసే చల్లని మందమారుతము నిశ్శబ్దంగా పని చేస్తున్నది.

తమయొక్క తమకుటుంబాల యొక్క తమతోటివారి యొక్క ప్రపంచంయొక్క శాంతిక్షేమాలు, జీవితాభ్యుదయ సార్థక్యాలు కోరేవారు మనలో ఇప్పుడు కావాలి అందరూ అలాంటి సంకల్పాలనే మననంచేయాలి. భారత ప్రధాని శాంతి సంకల్పాలు ఆనాటి కానాడు బలం చేకూర్చుకొని, దేశదేశాల వాతావరణాన్ని మార్చడం మనం

ప్రత్యక్షంగా చూస్తున్నాంగదా. మనకోసమూ, లోకంకోసమూ. అంతా ఎప్పుడూ మంచి ఆలోచనలు అలవర్చుకోవాలి. సత్సంకల్పాలకు సజ్జన సాంగత్యం, సద్గ్రంథ పఠన, సదుద్దేశాల మననం. పెద్దల ఆదర్శం మనకు గొప్పగా తోడ్పడుతాయి.

ప్రస్తుత పరిస్థితి చూడండి: మనలో అనేకులకు కడుపు నిండా తిండి, బుద్ధి వికసించడానికి విద్య, తల దాచుకొందుకు కొంపవగైరా సుఖజీవనానికి వలసిన ముఖ్యావసరాలు యుక్తసరిగా నైనలేవు. మా దేశం గొప్పది, మహోజ్వలచరిత్ర గలది, మేము గొప్పవారం అనుకుంటున్న మనకళ్ళెదుట, "అన్నీ ఉన్న దేశంలోనే అన్నీ కరువుగా" ఉంటుంటే చూస్తూ ఎలా ఊరుకోగలం? అందుచేత అంతా ఆలోచించండి. ఈ విషమ సమస్య పరిష్కారాన్ని గురించి బాగా ఆలోచించండి. ఆబాలగోపాలానికి, ప్రజలకు- ప్రభుత్వానికి, స్త్రీలకు — పురుషులకు అందరికీ ప్రస్తుతం యిదే తలంపు. పదిమంది శ్రేయస్సు దృష్టిలో నుంచుకొని, మానవులు మానవమాత్రులుగానైనా జీవించి, జీవితానందం కొంత చవిచూచి, జీవిత సార్థక్యం కొంత సాధించేటట్లు చేయడం ఎలాగు అన్న ఆలోచన అందరికీ తట్టాలి. ఐహికాముష్మిక సుఖజీవనాలకు సులభ పంథాలు నిర్మించడం ఎలాగు అని అన్వేషణ సాగాలి.

ఇలాంటి సంకల్పం కలిగిన్నాడు, ఇక పిచ్చిపిచ్చి పార్టీలకు తావుండదు. పిచ్చి తగాయిదాలు దూరంగా నెట్టివేయబడతాయి, అహంనశిస్తుంది, స్వార్థం రూపుమాసిపోతుంది, పదిమంది శ్రేయస్సే ప్రధానంగా పెట్టుకొని అంతా వ్యవహరిస్తారు. ఆ సంకల్పమే అన్నీ చేయిస్తుంది. ఐక్యత అదే తెస్తుంది. ఆంధ్రులయొక్క, ఆంధ్రేతరులయొక్క, దేశంయొక్క, లోకంయొక్క శ్రేయస్సును సాధించే సంకల్పాలే, పకటికలలే మనకందరికీ యిప్పుడు కావలసింది. పెద్దలు తలపెట్టిన రామరాజ్య స్థాపనయెట్లా అన్నదే ఈ రోజుల్లో అందరి సంకల్పమూను.

కె. సు.

ఆంధ్ర మహిళాసభ

సర్వసభ్య సమావేశము

ఆంధ్ర మహిళాసభ సర్వ సభ్యసమావేశము ది 15-1-1955 సరిగా 4 గం॥లకు లజ్‌చర్చ్ రోడ్డులోని సభాభవనములో జరుగును. శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గారు అధ్యక్షత వహించెదరు.

విషయములు :

1. గత సర్వసభ్య సమావేశపు వివరములు
2. వివిధ శాఖల కార్యక్రమ నివేదికలు
3. వివిధ శాఖల ఆమోఖర్చులు
5. ఇతర విషయములు

సభ్యురాండ్రు దయచేయ ప్రార్థితులు.

తె. తిమ్మాబాయి
ర. రంగనాయకమ్మ
కార్యదర్శులు.

ప్రసిద్ధ దంపతులు - గాంధీ దంపతులు

శ్రీమతి గాదేపల్లి సుందరీశంకరం

పురాణ కాలంనుంచి నేటి కాలం వరకూ పుణ్యభూమి యైన ఈ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన దంపతులు వుంటూనే వచ్చారు. ఏ దాంపత్యమైనా ప్రసిద్ధి కెక్కాలీ అంటే లోక కల్యాణంకోసం ఆ దంపతులిరువురు పాటు పడి ప్రజాసేవ చేయాలి. సతీపతులిరువురిలో సతి పతి ననుసరించడం గాని, పతి సతి ననుసరించడం గాని జరిగితేనేగాని ఆ దంపతులు తలపెట్టిన యే మహాకార్యమైనా విజయ వంతము కానేరదు. అన్ని విధముల దంపతులిరువురి మధ్యా యేకాభిప్రాయమో, యిరువురిమధ్యా గౌరవాభిమానములో వుండి తీరాలి. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి— ఆకర్షించుకోవాలి— యిరువురికి పరమార్థ దృష్టి వుండి ప్రజాసేవ చేయాలి.

ఆ శంకరుని కోసం పార్వతీదేవి అహోరాత్రములు, తదేక దీక్షతో మండువేసవిని, పంచాగ్నిహోత్ర మధ్యంలో కొన్నాళ్ళు, వర్ష కాలమున కుత్తుక బంటి జలములోవుండి కొన్నాళ్ళు, ఆకులు, అలములు భక్షించి కొన్నాళ్ళు, అవి కూడ విసర్జించి నిరాహార దీక్షతో కొన్నాళ్ళు, ఘోర తపస్సు చేసి ఆ పరమేశ్వరునికి ప్రేమ పాత్రురాలైంది. ఈశ్వరుడు కూడా తనకు ఆమెయందుగల గాఢానురాగాన్ని వ్యక్తపరచడానికి కాబోలు, తన అర్ధ శరీరాన్నే యామె కిచ్చి అర్ధాంగినిగా చేసుకున్నాడు. ఈవిధంగా పార్వతీ పరమేశ్వరుల దాంపత్యము ప్రసిద్ధి కెక్కితే.— ఏరికోరి శ్రీరామచంద్రుని పెండ్లాడి పదునాలుగేండ్లు వనవాసము చేసి, అడుగడుక్కీ శ్రీరామచంద్రుని అగ్ని పరీక్షలకు గురియై తట్టుకొనుచు, పుట్టినది లగాయతు గిట్టేవరకూ కష్టములేయనుభవించిన సీతామహాదేవి శ్రీరామచంద్రునితో ప్రసిద్ధి కెక్కినది. శ్రీరామచంద్రుడునూ, రాక్షసుడైన రావణుడు సీతామహాదేవిని లంకకు తీసుకునిపోగా దిశలూ కొండలూ గుహలూ మార్మ్రోగేటట్లు ఆలో లక్ష్మణా యని విలపించాడు పాపం— వానర సహాయంతోనే వారధి నిర్మించి రావణుని సంహరించి తన ప్రేమరాశియైన సీతాదేవిని తెచ్చుకొన్నాడుగదా శ్రీరామచంద్రుడు— ఇట్లు ఈ భారతావనిలో, నలదమయంతులు, చంద్రమతి హరిశ్చంద్రులు, సావిత్రి సత్యవంతులు ప్రసిద్ధి కెక్కి ఆదర్శ దంపతులైనట్లే మోహనదాస్ కరమ్ చంద్ గాంధీ, ఆయన సతీమణి కస్తూరీ బాయిల దాంపత్యము కూడా ఆ చంద్ర తారార్కముగ చిరస్థాయిగా వుండిపోయింది. మన భారత చరిత్రలో వారి దాంపత్య విశేషాలు సువర్ణాక్షరాలతో లిఖింపబడగలవనటంలో సందేహంలేదు. ఆ సేతుహిమాచల పర్యంతమే కాకుండా ప్రపంచమంతటిలోనూ ఆదర్శ దంపతులైన ఈ గాంధీ దంపతులను యెరుగనివారుండరు. అతి సనాతనమైన సుప్రసిద్ధ కుటుంబంలో పోరుబందరులో జన్మించారు ఈ పుణ్య దంపతులు. వివాహం జరిగింది అతి బాల్యంలోనే— ఉభయులకీ వయస్సులో అట్టే తేడా కూడా లేదట. ఆయనకు 15 ఉంటే ఈవిడకు 8 ది కాబోలు వయస్సు— అయితేనేమి? వారి దాంపత్యము శుక్లపక్ష చంద్రునివలె దినదినప్రవర్ధమానంగా వృద్ధిచెంది వారిద్దరి మధ్యగల గాఢానురాగలత దట్టముగా అల్లుకొని, అవని కంతకీ ఆదర్శప్రాయులైన దంపతులుగా ప్రసిద్ధి కెక్కారు. ఈ దంపతులను తలుచుకుంటే వళ్ళు పులకరించక మానదు.

విద్య నిమిత్తం గాంధీజీ చాలకాలం లండనులో వున్నాడు. స్వదేశానికి తిరిగి వచ్చిన కొద్ది రోజులకే పత్నీ సమేతుడై ప్రాక్టీసు కోసమని దక్షిణాఫ్రికాకు యిరువురూ ప్రయాణమై వెళ్ళడం జరిగింది— అక్కడ గల భారతీయుల కడగండ్లను చూసి గాంధీ మహాత్ముని హృదయం తపించి పోయింది— అది సహించలేక పోయాడు— అక్కడ సహాయ నిరాకరణోద్యమం సత్యాగ్రహోద్యమాలు ప్రారంభించాడు కస్తూరిబాసతీమతల్లి కూడా భర్తకి చేదోడు వాదోడై వేలకొలది ప్రజలకు అన్నపూర్ణవలె అన్నము పెట్టి పోషించింది. ఆ ప్రజలందరికీ తన భర్తకంటె కూడ తానే ముందుగా మాతృదేవియై గౌరవం పొందింది— అక్కడి వుద్యమాల్లో కృతకృత్యులైన తరువాత ఆ పుణ్యదంపతులిరువురూ స్వదేశమైన భారత దేశానికి తిరిగి వచ్చారు. ఆకలి మంటలతో దాస్య శృంఖలాలతో పరప్రభుత్వ యినుప పాదాలక్రింద నలిగి పోతూవున్న తమ మాతృభూమిని చూచి తపించి పోయారు స్వదేశానికి స్వాతంత్ర్యము సంపాదించి పెట్టుటకు ఆ దంపతులు పడిన కష్టములు వర్ణనాతీతము. కస్తూరీబాయి సతి, భర్తతో సమస్తమైన రాజకీయ సంబధమైన బాధలనూ అనుభవించి తుదకు భర్త ఒడిలోనే ప్రాణములు వదలి వీర పత్నీత్వము సిద్ధింప జే

కొన్నది. భర్తయైన గాంధీమహాత్ముడు తనకిష్టములేని పనులు యెన్ని చెప్పినను పతి యనుసరణమే పరమానందమను దృష్టితో, జీవితాంతము వరకూ భర్త కోరిక ప్రకారమే తానునూ ప్రవర్తించి కైరా జిల్లాలలో ఓం ప్రథమంగా తలపెట్టిన సహాయ నిరాకరణోద్యములోనేమి, 1930 నాటి ఉప్పు సత్యాగ్రహోద్యమంలో నేమి భర్తృవాక్య పరిపాలన గావించి ప్రజాసేవ చేసి పరమ సాధ్వి యనిపించుకొంది. ఆ భార్యాభర్తల నడుమగల అంతరంగిక విషయాలు, ఒకటి రెండు గమనిస్తే ఆ దంపతులలో ఒకరిపై యొకరికి గల ఆదరాభిమానాలు అర్థమవుతాయి.

ఒకప్పుడు ఏ ఖర్చుకైనా వుంటుందని కస్తూరీబాయి నాల్గు రూపాయలు దాచుకొన్నదట. అది గాంధీ మహాత్ముడు చూచి, కోపించి, మూడు మాసములు ఆమెతో మాట్లాడనని కఠిన శిక్ష విధించాడట. పాపం ఆమె ఆ మూడు మాసములు నిరాహార దీక్షతో పరోక్షంగానే పతిసేవ చేస్తూ కాలక్షేపం చేసిందిట ఆ పరమ సాధ్వి.

ఓసారి మహాత్ముడు అతిథులతో భోజనానికి కూర్చుండగా, ఆమె సన్నని వస్త్రమేదో కట్టుకొని వడ్డిస్తున్నదట. అది చూచి మహాత్ముడు మహోగ్రుడై 'ఇది యే'మని ప్రశ్నించాడుట. ఖద్దరు చీర ముతగగావుంది- అందుచేత యీ సన్నచీర వుంటే కట్టుకున్నాను' అని అన్నదట. దాంతో మహాత్ముడన్నదేమో తెలుసా— ఆ సన్నటిచీర కట్టుకుని నీవు వడ్డించుటకంటే నగ్న వస్త్రవై వడ్డించుట మేలని కోపగించి మందలించాడుట. అంత కఠినముగా భర్త ప్రతిచిన్న విషయంలోనూ ప్రవర్తించినా, ఆమె పత్యనుసరణమే పరమార్థముగా భావించి అంతటి కఠిన హృదయుడైన మహాత్మునితో కాపురం చేసి వన్నెకెక్కింది. మహాత్మునియందు ఆమెకుగల అనురాగానికి తార్కాణంగా ఒక్క విషయం చెబితేవాలును. గాంధీగారు రాజకీయ ప్రసంగాల్లో వుండిపోయి తిండికూడా మరచిపోయేవాడుట. అప్పుడు యీమె కాలాతిక్రమణానికి ఓర్వలేక తాను స్వయంగా ఆహారాన్ని భర్త దగ్గరకు తెచ్చి తన చేతులతో నోటికందిచేదట. అప్పుడు గాంధీగారు విసుగుకొంటే ఆమె, చంటిపిల్లవానిని తల్లి బుజ్జగించిన విధముగా ప్రాధేయపడితే, ఆమె ప్రార్థనలు అక్కడే కూర్చునివున్న యితరులు గమనించి మహాత్ముని వేడుకొని ఆమె అందించిన యాహారాన్ని తినునట్లుగా చేసేవారట. ఈమె తన భర్త విషయంలో 'కార్యేషు దాసీ కరణేషు మంత్రీ భోజ్యేషు మాతా' అను వాక్యములను అక్షరాలా ఆచరణలో పెట్టిన పరమసాధ్వి. మహాత్ముడు నడిపించిన మహోద్యమాలన్నింటికీ వాస్తవానికి కార్యాచరణ చేసిన కార్యదర్శి కస్తూరీ బాయీయే అనటంలో ఆశ్చర్యంలేదు. ఈమె ఆయనతో వహించిన దీక్షా ఫలితములే, ఆయనకీ, దేశానికీ విజయకారణాలయ్యాయి అనటం అతిశయోక్తి కాదనుకొంటాను. మనస్సుతోనూ, క్రియతోనూ వాక్కుతోను యెల్లవేళలా భర్త యొక్కమాట, చర్య, తనవిగా భావించి, పూనుకొనినిర్వహించిన మహాపతివ్రత. అయితే ఇటువంటిభార్యపై ఆ మహాత్మునికి ఎంతటిప్రేమాతిశయాలున్నాయో ఆ పుణ్యదంపతులను చూచినవారికి యెప్పుడూ గోచరమౌతూనే యుండేది. చివరకు అవసానకాలంలో ఆమె ప్రాణోత్క్రమణ సమయంలో అంతటి స్థితప్రజ్ఞుడైన గాంధీమహాత్ముడు కూడా దుఃఖంతో స్థంభీభూతుడవటం చూస్తే ఆయనకెంత ప్రేమాభిమాన గౌరవములు తన భార్యయెడ గలదో, ఆనాడు అక్కడే యుండిన సరోజినీదేవి వెల్లడించింది. దివంగతులైన యీ ప్రసిద్ధ దంపతులు పురాణ దంపతులైన త్రిమూర్తులలో ఒకరై యుండవచ్చునని నిస్సందేహముగా చెప్పవచ్చును. ఇటువంటి నిస్వార్థమైన సేవా, త్యాగమయజీవితాన్ని గడపిన ఈ దంపతులు మన భారతదేశానికే కాక సకల ప్రపంచానికీ ఆదర్శ దంపతులైనారు. కనుకనే పురాణ దంపతులకు వలెనే శిలా విగ్రహములూ, స్మారక మందిరములూ కూడా నిర్మించి భక్తి శ్రద్ధలతో పూజా పునస్కారాలు జరుగుతూనే వుంటాయి—





కత్తి నాట్యం

(చైనీయుల జాతీయ నాట్యం)

పూర్వం చైనా దేశస్థులు, ఇరువైపులా పదునున్న ఖడ్గాన్ని, ఆత్మరక్షణార్థం ఉపయోగించేవారు. దాన్ని ఉపయోగించే విధానం నేర్చుకోవడంలో ఆవ్యక్తి పటుతరమైన ఋజువర్తనాన్నీ, గౌరవనీయమైన ఆత్మనూ పొందుతాడని వారనుకుంటారు.



రాజకీయాలు

శ్రీ గోళ్ళమూడి రామచంద్రరావు.

1954 నవంబర్ నాలుగోవారం మొదలుకుని డిసెంబర్ మూడోవారం వరకూ జాతీయ, అంతర్జాతీయ రంగాల్లో నడిచిన ప్రముఖ సంఘటనలు ఈవిధంగా ఉన్నవి: ఆంధ్రలో ఎన్నికలు ఫిబ్రవరి 11 నుంచి 27 వరకు జరుగుతవని గవర్నర్ ప్రకటించటం, నందికొండ ప్రాజక్టుకు కేంద్ర ప్రభుత్వం కొన్ని షరతులతో అంగీకరించటం, భారతదేశ ఆర్థిక వ్యవస్థను సోషలిస్టు పద్ధతిలోకి మార్చటానికి లోక్‌సభ ఆమోదించటం, ఇండియాలో యుగోస్లావ్ నాయకుడు టిటో, చైనాలో బర్మా ప్రధాని నూ పర్యటించటం, ఐక్యరాజ్యసమితి కార్యదర్శి హామర్‌షెల్ప్ పెకింగ్ వెళ్ళే ఏర్పాటు జరగటం.

* * *

ఆంధ్రలో కొత్త శాసనసభకు ఫిబ్రవరి 11 నుంచి 27 వరకూ, మొత్తం 5 రోజులపాటు, 196 మంది సభ్యుల్ని ఎన్నుకునేందుకు ఎన్నికలు జరుగుతవని ప్రకటించబడ్డది. వీటిలో ఎన్నుకోబడే శాసనసభ కాలపరిమితి 5 సం॥ల పాటు ఉంటుంది. అంటే ఈతడవ పార్లమెంటు ఎన్నికలతోపాటుగా శాసనసభ ఎన్నికలు జరగవన్నమాట.

ఈతడవ ఆంధ్రలో కమ్యూనిస్టులకూ, కాంగ్రెసుకూ బలాబలాలను తేల్చివేసే అతిప్రధాన పోరాటం జరగబోతున్నదనీ, దీని ప్రభావం యావద్భారత దేశంమీదనూ ప్రసరించగలవనీ సర్వత్రాభావించ బడుతున్నది. తన భవిష్యత్తు అంతా ఈ ఎన్నికలమీదనే ఆధారపడిఉన్నదని కాంగ్రెస్ భావిస్తున్నది. అందుకోసమే, కాంగ్రెస్ ఇతర పార్టీలతో ఒడంబడికలు చేసుకొనదనీ, కాంగ్రెస్‌తో సహకరించదలచుకునేవాళ్ళు కాంగ్రెస్‌లో చేరిపోవటమన్నది ఒక్కటే మార్గమనీ అర్భాటాలు చేసిన కాంగ్రెస్‌నాయకులు, దురహంకారాన్ని దిగమింగుకుని మిగిలిన కమ్యూనిస్టేతరపక్షాలతో డెమాక్రటిక్ ఫ్రంట్ ఒకటి ఏర్పాటు చేయటానికి అంగీకరించారు. కాంగ్రెస్, కృషికార్‌లోక్, ప్రజాపార్టీలు కలిసి ఉమ్మడిగా అభ్యర్థుల్ని ఎంచుకుని, కలిసి పనిచేయటానికి నిశ్చయించుకున్నారు. ఈకలయిక ఎన్నికల్లోనేకాకుండా, శాసనసభలోనే ఉండాలని నిశ్చయించున్నారు.

ఈఫ్రంట్ మెజారిటీ సంపాదించి ప్రభుత్వం స్థాపించ కలిగితే బలపడుతుందనీ, ఓడిపోతే అవిభక్త మద్రాసులోని యునైటెడ్ డెమాక్రటిక్ ఫ్రంట్, హైదరాబాదులోని పీపుల్స్ డెమాక్రటిక్ ఫ్రంట్, తిరువాన్కూరుకొచ్చిలోని యునైటెడ్ లెఫ్టిస్ట్ ఫ్రంట్‌ల మోస్తరువిచ్ఛిన్నం అవుతుందనీ, వెనకటి చరిత్రనుబట్టి చెప్పవచ్చు.

ప్రభుత్వం ఏర్పరిచిన తరవాతకూడా ఈవర్గాలకు చీలికరావటం అంతకష్టమయిన విషయం కాదని, గత శాసనసభ పరిస్థితులే నిరూపిస్తున్నవి. కాంగ్రెసును అధికారంలోకి రాకుండా చేయాలని ఇతరపక్షాలు ఇంతకు ముందు చేసిన ప్రయత్నాలు ఎంతనెగ్గినవో, కమ్యూనిస్టుల్ని అధికారంలోకి రాకుండాచేయాలని ఈఫ్రంట్ చేస్తున్న ప్రయత్నాలకూ, వాళ్ళకు ఉండే ఐక్యతకూ, అంతకన్నా ఎక్కువ అవకాశాలు ఉండటం అనుమానాస్పదం.

ఎన్నికలనిర్వహణలో అతిరథుడు మహారథుడు అని పేరుమోగిన ఎస్. కె. పాటిల్‌గారు కాంగ్రెస్ తరఫున ప్రచారం జరిపిస్తారు. భారతదేశంలో ఉన్న కమ్యూనిస్టు ప్రముఖులుయావన్మందీ, ఆంధ్రలో తమ పార్టీకి అండగా నిలబడుతున్నారు. అధికారాన్ని వశపరుచుకోవాలన్న సంకల్పంతో యావన్మంది ప్రముఖ ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులూ ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్నారు.

ఈ కమ్యూనిస్టేతర ఫ్రంటులో ప్రజాసోషలిస్టుపార్టీ చేరలేదు. రాష్ట్రపక్ష పి. వి. జి. రాజుగారు కాసుహార

పద్ధతిని నిరసించారు. అయితే అధ్యక్షుడు కొమ్మారెడ్డి సూర్యనారాయణ, ఎన్నికల నిర్వహణాధికారి నడింపల్లి నరసింహారావుగార్లు సంప్రదింపులకోసం ఢిల్లీకివెళ్ళారు. అఖిలభారత పి. ఎస్. పి. అధ్యక్షుడు నరేంద్రదేవతో నెహ్రూ ఈవిషయమై సంప్రదించినట్లు తెలుస్తున్నది.

ఆంధ్ర ప్రభుత్వాన్ని పడదోసిన విశ్వాసరాహిత్య తీర్మానాన్ని ప్రతిపాదించినట్టి కృషికార్‌లోక్ ప్రముఖుడు లచ్చన్నగారు ఈ ఫ్రంట్ స్థాపనకుముందు పి.ఎస్.పి.తో ఒక ఎన్నికలమైత్రి కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందాన్ని గౌరవించేందుకు 16 స్థానాలను ఫ్రంట్ వదిలిపెడుతుందని తెలుస్తున్నది.

మొత్తానికి ఈ ఫ్రంట్ స్థాపనవల్ల రెండు అంశాలు తేలుతున్నవి.

1. ఆంధ్రలో ప్రధాన రాజకీయ పక్షంగా కమ్యూనిస్టు పార్టీ తయారుకావటం.

2. అతి స్వల్ప వివాదాలవల్లనో, విభేదాలవల్లనో కాంగ్రెస్‌నుంచి బయటికి వచ్చి ఏర్పడ్డ చిల్లరపార్టీలకు, కాంగ్రెసుతో తేడా ఏమీలేదని నిరూపణకావటం.

*   *   *

నందికొండ ప్రాజక్టును కొన్ని షరతులమీద ప్రథమ పంచవర్ష ప్రణాళికలో జేర్చటానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించింది. భూమి అభివృద్ధిపన్నును విధించటం, నీటితీరువను పెంచటం, భూమిశిస్తును వెనకటి పద్ధతుల్లోనే వసూలు చేయటం. సాగుక్రిందలేని భూముల్ని అమ్మి డబ్బు సేకరించటం మొదలైన అంశాల ద్వారా ప్రాజక్టు ఆర్థికప్రాతిపదికను ఆంధ్ర ప్రభుత్వం స్పష్టపరచాలనీ, దానికి శాసనరూపమయిన హామీ ఇవ్వాలనీ. తమనిపుణులు ప్రాజక్టుకు చేసే మార్పులకు అంగీకరించాలనీ కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ షరతులను ఇంతవరకూ దేశ మొత్తంమీద కోసీ, చెంబల్ ప్రాజక్టులకు మాత్రమే విధించినట్లు కేంద్ర మంత్రి హాఫీవెల్లడించారు. ఈ షరతుల విషయమై చర్యతీసుకునే అధికారం ఆంధ్ర గవర్నరుకు ఇవ్వబడ్డది. కొత్తమంత్రి వర్గం ఏర్పడ్డ తరవాతనే ఆంధ్రలో కొత్త ప్రాజక్టుల నిర్మాణమని కేంద్ర డిప్యూటీ మంత్రి దాతార్ డిసెంబర్ 18న పార్లమెంటులో చేసిన ప్రకటన ఏమయిందో తెలియదు. ప్రాజక్టుఎప్పుడు మొదలయ్యేదీకూడా తెలియదు.

కేంద్ర షరతులన్నిటికీ ఆంధ్ర కాంగ్రెస్ అంగీకరించింది. కమ్యూనిస్టు నాయకులు మాత్రం వీటని తీవ్రంగా విమర్శిస్తూ, బంజర్లపంపిణీ, భూమిసంస్కరణలు మొదలైనవాటికి ఇవి అడ్డం రావీయలేదని, ప్రజలసహకారంతో ప్రాజక్టును తాము చాలా చౌకగా నిర్మించగలమనీ చెపుతున్నారు.

ఆంధ్రా డెమాక్రటిక్ ఫ్రంట్ నాయకులు ఈసంస్కరణలన్నిటికీ తిలోదకాలిస్తే, మద్యనిషేధం ఒక్కటీ వారిని గెలిపించకలుగుతుందా ?

కేంద్ర ప్రభుత్వం షరతులు విధించటానికి కారణం ఆంధ్ర మంత్రివర్గం బంజర్లపంపిణీ, చిన్న రైతులకు శిస్తు రద్దుచేస్తూ తలపెట్టిన చర్యలే.

*   *   *

తిరుకొచ్చిలో కమ్యూనిస్టుల్ని అధికారంలోకి రాకుండా చేయటానికని కాంగ్రెస్ ప్రజాసోషలిస్టు మంత్రి వర్గానికి ఇస్తున్నసహకారం ఈనెలలో ఉపసంహరించుకోబడ్డది. ముఖ్యాంశాలమీద తమ సలహా తీసుకుంటామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి తానుపిళ్ళె పాటించక పోవటం, కాంగ్రెసును అన్నివిధాలా దెబ్బతీయటమే తమలక్ష్యంగా పి. ఎస్. పి. నాయకులు వ్యవహరించటం మూలంగా తామీచర్య తీసుకోవలసివచ్చిందని కాంగ్రెస్ పార్టీ వాదిస్తున్నది. పి.ఎస్.పి. నాయకులు కాంగ్రెసుకు మంగళం పాడించటానికి ప్రయత్నిస్తున్నారనీ, వాళ్ళు ప్రారంభించే ప్రాజక్టులూ, చేయించే పనులూ, కాంగ్రెసేతర సభ్యులు ఎన్నికయిన ప్రాంతాల్లోనేననీ, ఏ సంఘంలోనూ తమకు ప్రాతినిధ్యం లేకుండా ప్రభుత్వం చేస్తున్నదనీ, స్థానికసంస్థలోకూడా తమను అధికారంలోకి రాకుండా చేసేందుకు పి.ఎస్.పి. ప్రయత్నిస్తున్నదనీ కాంగ్రెస్ ఆరోపించింది. దేశంలో ప్రతి ఒక్క రాష్ట్రంలోనూ కాంగ్రెస్ మంత్రి వర్గాలను గురించి ప్రతికూలపక్షాలు చెసె విమర్శలు ఇవే.

కాంగ్రెస్ తన తోడ్పాటును ఉపసంహరించుకొన్నందుకు కారణం తిరిగీ అధికారాపేక్ష కలగటమేనని పి. ఎస్. పి. నాయకులు ఆరోపిస్తున్నారు. కిందటి శాసన

సభలో తిరువాన్కూర్ తమిళ కాంగ్రెస్ విడిపోవటాన పడిపోయిన కాంగ్రెసు పార్టీ ఇప్పుడు తిరిగి వాళ్ళ సహకారంతో ప్రభుత్వం స్థాపించాలని ఆశపడుతున్నదనీ. దానికి తమిళ కాంగ్రెస్ సుముఖంగానే ఉన్నదనీ తెలుస్తున్నది. ఈ కమ్యూనిస్టేతర పక్షాల మైత్రిని చూసిన మీదట, ఆంధ్ర పి. ఎస్. పి. నాయకులు కాంగ్రెస్ ఫ్రంటులో జేరేందుకు వెనకాడుతున్నారు.

* * *

దేశ ఆర్థిక వ్యవస్థను క్రమేపీ సోషలిస్టు పద్ధతిలోకి మార్చాలని లోకసభ తీర్మానించింది. 1948 సం॥ లో ప్రభుత్వం ప్రతిపాదించిన పారిశ్రామిక విధానం సోషలిజాన్నే ఉద్దేశించిందని పండితనెహ్రూ చెప్పినదానికి కృపలానీ ప్రభృతులు విమర్శిస్తూ, అదె సోషలిజం అయితే, అదేదో విపరీతమయిన సోషలిజమే అయిఉండాలని అన్నారు. రెండో పంచవర్ష ప్రణాళికలో ప్రైవేటు నిర్వహణ కిందఉన్న పరిశ్రమలకన్నా, ప్రభుత్వ నిర్వహణ కిందికి వచ్చే పరిశ్రమలు ఎక్కువ ఉండగలవనీ, అయితే ప్రైవేటు పరిశ్రమలన్నిటినీ జాతీయం చేయటం మాత్రం జరగదనీ నెహ్రూ అన్నారు.

ఈ పద్ధతిన గుడ్డల మిల్లులనూ, జనపనార మిల్లుల్నూ, మాకంపెనీలను 2 ॥సం॥ల వరకూ ముట్టుకోకుండా ప్రభుత్వం ఉంచే, నిరుద్యోగ సమస్యను పరిష్కరించటం అసాధ్యమని, వీటన్నిటినీ ప్రభుత్వం వశపరుచుకోవాలనీ కాంగ్రెస్ సభ్యుడు గాడ్గిల్‌గారు సూచించారు. విదేశీకంపెనీల వ్యవహారాలపై విచారణ జరిపించాలని జోషిం అల్వా అన్నారు.

వాణిజ్య మంత్రి కృష్ణమాచారిగారు మాట్లాడుతూ అందరికీ పని లంభించాలంటే జీవన స్థాయిని తగ్గించుకోవలసి వుంటుందని హెచ్చరించారు. అంటే జీతాల, కూలీల తగ్గింపుకు ఇది సూచనఏమో।

* * *

రాజ్యసభ ఈ నెలలో హిందూ వివాహాల, విడాకుల ల్లును కొన్ని సవరణలతో ఆమోదించింది.— అందులో ముఖ్యాంశాలివి:— 1. వివాహానికి కనీస వయస్సు స్త్రీలకు 5, పురుషులకు 18 (దీనిని రాజ్యసభలోని స్త్రీ సభ్యులే ట్టిగా కోరారు) 2. ఎవరికయినా ఒక్కరిని మించి భార్యలు ఉంటే. వాళ్ళు భర్తనుండి విడాకులు కోరవచ్చును. 3. విడాకుల్లో కొన్ని సందర్భాల్లో భార్యే భర్తకు మనోవర్తి ఇవ్వవలసి వుంటుంది.

ఈ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంలో కొందరు సభ్యురాండ్రు స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేనిదే ఇది నిరర్థకమనీ, దీనికన్నా ముందుగా హిందూవారసత్వం బిల్లును, స్త్రీలకు ఆస్తి హక్కుల బిల్లునూ ప్రతిపాదించి ఉండవలసిందని అన్నారు.

* * *

ఐక్యరాజ్య సమితి 8 వ సర్వసభ్య సమావేశం ఈ నెలలోనే పూర్తి అయింది. ఈ సమావేశంలో అది మొరాకో సైప్రస్ మొదలైన వలసల విషయంలో పాలకవర్గాలకు అనుకూలంగా చర్చలను వాయిదావేయించింది. అమెరికా చెప్పుచేతల్లో నడిచి, చైనా విషయంలో మరొక తప్పటడుగు వేసింది. 11 మంది అమెరికన్ వైమానికులు. ఇద్దరు పౌరులు చైనాలో గూఢచారి చర్యలు జరిపినందుకని చెప్పి శిక్షింపబడ్డారు. ఆ వైమానికులు కొరియా యుద్ధంలో పాల్గొన్న వాళ్ళనీ. వాళ్ళను శిక్షించటం కొరియా యుద్ధ విరమణ ఒప్పందానికి విరుద్ధమనీ ఐక్యరాజ్య సమితి తీర్మానించింది. తీర్మానం చేసేందుకు ముందు చైనావాదాన్ని వినలేదు.

ఈ విషయమై సౌమ్యంగా పరిష్కరించుకునే ఉద్దేశంతో సమితి కార్యదర్శి హామర్ షెల్డ్ పెంకింగ్‌కు రాదలచినట్లు తెలియజేయగా. చైనా ప్రధాని అంగీకరించారు. జనవరి మొదటి వారంలో ఆయన పెంకింగ్ వెడతారు. చైనా సౌమ్య వైఖరివల్లనూ, సమితి కార్యదర్శి అక్కడికి వెళ్ళటం వల్లనూ, సమితిలో చైనా ప్రాతినిధ్య సమస్య పరిష్కారం అయ్యే అవకాశం లేకపోలేదు.


* * *

జర్మనీని సాయుధం చేయటానికి పశ్చిమ రాజ్యాలు చేస్తున్న ప్రయత్నాలను రష్యా తీవ్రంగా ప్రతిఘటిస్తున్నది. ఆప్రయత్నాలను విరమించకపోతే, తను లోగడ చేసుకున్న మైత్రి వప్పందాలను రద్దు చేస్తానని బ్రిటన్ ఫ్రాన్స్‌లకు హెచ్చరికచేసింది. తూర్పు యూరప్ దేశాలను సమావేశపరిచి, మరొక రక్షణవ్యవస్థను ఏర్పాటు చేస్తున్నది.

ఈనెలలోనే యుగోస్లావ్ అధ్యక్షుడు మార్షల్ టిటో ఇండియాలోనూ, బర్మాప్రధాని నూ చైనాలోనూ పర్యటించారు. ఉభయులుకూడా, ఇండియా, చైనాలు ప్రతిపాదించిన శాంతియుత సహజీవనం పట్ల విశ్వాసం వెల్లడించారు. చైనా శాంతి వాంఛ పట్ల నూ విశ్వాసం వెళ్ళడించగా, రష్యా, తూర్పుయూరప్ దేశాలు స్నేహంగా ఉండగోరుతున్నందుకు టిటో సంతృప్తి వెల్లడించారు. ఫార్మోజా సమస్యా పరిష్కారానికి తాను మధ్యవర్తిత్వం చేయటానికి సిద్ధంగా ఉన్నానని నూ ప్రకటించారు. ఫార్మోజా చైనాలో అంతర్భాగమేనని ఉద్ఘాటించారు.

* * *

డిసెంబర్ 11నుంచీ జరుగవలసిన బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా వేయబడ్డది. జీతాల హెచ్చింపుకోసం పశ్చిమ బెంగాల్ పోలీసులు నిరశన దీక్ష చేయగా వెయ్యిమంది అరెస్టు కావడం, దరిమిలా సమ్మెవిరమణ జరిగినవి. బొంబాయిరేవు నావికులు, సమ్మెచేయగా, యుద్ధకాలంలో జారీ అయిన అత్యవసర సిబ్బంది చట్టం అమలు చేస్తామని ప్రభుత్వం హెచ్చరించటం వల్ల, అది ఆగిపోయింది.



ఇటీవల శ్రీమతి ఇందిరాగాంధీ పెకింగ్ వెళ్ళినప్పుడు అఖిలచైనా డిమాక్రాటిక్ విమెన్సు ఫెడరేషన్‌వారు ఆమె గౌరవార్థం ఏర్పరచిన టీపార్టీ దృశ్యం. ఫొటోలో (ఎడమవైపున) కాంగ్–కీ– చింగ్ (మధ్యను లై–ఛై– చియుంగ్, అఖిలచైనా డిమాక్రాటిక్ విమెన్సు ఫెడరేషన్ స్టాండిగ్ కమిటీ సభ్యులు, వారి అతిధి శ్రీమతి ఇందిరాగాంధీ ఉన్నారు.

అబల బోస్

శ్రీమతి కె. రామలక్ష్మి

సాధారణంగా మనం చూస్తూవుటాం. జగద్విఖ్యాతులైన మహామహుల ధర్మపత్నులు తగినంత వెలుగులోకి రారు. అంతేకాదు. వారిపట్ల ప్రపంచంకూడా ఎక్కువ శ్రద్ధాశక్తులు కనపరచదు. విఖ్యాతుని భార్యగా రాణించగల శక్తి గలస్త్రీకూడా గాంభీర్యం కలదే అయివుండాలి, లేకుంటే ఆతనికి భార్యగా రాణించడం కష్టం అతను శాస్త్రజ్ఞుడు కానివ్వండి. రాజకీయవేత్త కానీయండి. కవి కానివ్వండి. చిత్రకారుడు కానివ్వండి, ఎవరికేనా సరే, కష్టసుఖాలు పంచుకొని, తనలో గుప్తంగా వున్న శక్తులను రగుల్కొల్పి జ్వలింప చేయడానికి తగిన సహచరి లేకుంటే, తానందుకోదలచుకొన్న ఉన్నతోన్నత శిఖరాల నందుకోలేడు. భారతీయ ఋషులు యీ విషయాన్ని ఎప్పుడో ఒప్పుకున్నారు. గురువుగారి భార్యకూడా గురువుగారి వలెనే పూజింపబడింది, ఆరాధింపబడింది. శాస్త్రీయ ప్రపంచమూ భారతీయులూ కూడా సర్ జె. స. బోస్‌ని ఆధునిక యుగంలో గురువుగా గుర్తించారు. కాని, ఒక ఆదర్శ గృహిణిగా, ఒక వ్యక్తిత్వం గల మహిళగా శ్రీమతి అబల బోస్‌ని ప్రపంచం గుర్తించ వలసినంతగా గుర్తించలేదు. నిజానికి యీ ప్రపంచానికి ఒక జె. సి. బోస్‌ని అందివ్వగల ఘనత అబలబోస్‌దే. భారతదేశంలో ధన్యవంతులైన మహిళలలో అబల బోస్ ప్రప్రథముడు. బెంగాల్ సాంఘిక సంస్కరణల ప్రారంభదశలో ఒకబలవత్తర శక్తిగా పనిచేసింది అబలబోస్.

పుట్టిన పుట్టుక, స్వతహాగా గల మనస్తత్వం, తెచ్చుకొన్న సంస్కృతి—అబలని ఆమె నెరవేర్ప వలసిన మహత్తర కార్యాలకి సంసిద్ధురాలను చేశాయి.

తండ్రి కీర్తిశేషులు, శ్రీ దుర్గా మోహన్‌దాస్ బ్రహ్మసమాజ సభ్యులలో ప్రముఖుడు, కలకత్తాలో పేరుమోసిన లాయరు, స్త్రీ విద్య విషయంలో ప్రముఖపాత్ర వహించి ఆడపిల్లల చదువుకోసం పోరాడిన వీరుడు. బాలికల పాఠశాల ప్రారంభకులలో ఒకడు. ఈ స్కూలు ఎంతో ఉచ్ఛదశలోకి వచ్చింది. అబలకి తండ్రి అంటే అపరిమితమైన అభిమానమే కాకుండా, గర్వంకూడా. తల్లి తండ్రి తానే అయి కుమార్తెని పెంచిన దుర్గా మోహన్‌దాస్‌కి అబల తగిన కూతురని పించుకొంది. విజ్ఞాన శాస్త్రం అంటే అభిమానంచేత అబలని ఆదోవే పట్టించాడు, నాలుగు సంవత్సరాలపాటు మద్రాసు మెడికల్ కాలేజీలో చదువు సాగించింది. ఆఖరు సంవత్సరంలో, విషజ్వరం పీడించడంవల్ల చేసేదేమీలేక చదువు ముగించి తిరిగి యింటికి వచ్చేసింది. కాని యీ శాస్త్రీయ విజ్ఞానం ఆమెలో శాస్త్రజ్ఞులంటే అభిమానాన్ని రేకెత్తించింది. అప్పుడే ఇంగ్లండు నుండి తిరిగి వచ్చిన జగదీశ్ చంద్రబోస్‌ని కలుసుకొని అతనితో సాన్నిహిత్యాన్ని, కోరికని పెంపొందించుకొంది. జగదీశ్ చంద్రబోస్ అబలకంటె వివాహం నాటికి ఆరు సంవత్సరాలుపెద్ద. వీరి వివాహం, అనేక విధాలయిన సాంఘికసంస్కరణలకి ప్రతిరూపం. అబలకి యిరవై రెండు సంవత్సరాలు, ప్రొఫెసర్ బోస్‌కి ఇరవై ఎనిమిది, అబల ఐశ్వర్యవంతుల యింట్లో అదృష్టపు ఒడిలో పెరిగింది. జగదీశ్ చంద్రబోస్, కుటుంబం ఆర్థికంగా అష్టకష్టాలూ పడే కుటుంబం. అతన్ని అన్నివిధాలా అప్పులు పీడించేవి. ఈ కష్టాలన్నీ పంచుకోడానికి తన సౌఖ్యాలన్నీ మరచిపోటానికి కూడా అబల వెనుతీయలేదంటే, ఆమె ఉక్కులాంటి నైతికబలం, సౌశీల్యం వెల్లడవుతుంది. వివాహమైన తొలిరోజులు అన్నివిధాలా పరీక్షాదినాలు. చిన్న అద్దె యింటికోసం, యూనివర్సిటీకి ఎంతో దూరంలో కాపురం వుండేవారు. వారంలో ఎక్కువగంటలు ఏకాంతంలో గడపవలసి వచ్చేది అబల. అయినా ఆమె బాధపడలేదు. సెలవు దినాల్లో కోల్పోయిన అమూల్యమైన ఘడియలని తిరిగి సృష్టించుకొనేవారు,

జీవిత చిత్రణ

ఇద్దరూ కలిసి. తక్షశిల, నలందా. కాశ్మీరు, అజంతా మొదలైన చారిత్రాత్మక స్థలాలని చూచుకొంటూ. ప్రకృతికీ. దేశచరిత్రకీ అతి సన్నిహితంగా వుంటూ కాలం గడిపేవారు. జగదీశ్ చంద్రబోస్ సాయంత్రం షికారుకి కొంచెం బద్ధకించినా వూరుకొనేదికాదు అబల. నయానో భయానో బయటకు తీసుకు వేళ్ళేదట. అతని కనురెప్పగావుంటూ. అతని ఆహారం విషయంలో, ఎంతో జాగ్రత్తగా వుంటూ, యిల్లు సరిదిద్దుకు వస్తూండేది. ఎప్పుడూ పరిశుభ్రమైన దుస్తులలో ప్రశాంతంగా వుంటూండేవాడు బోస్. నిజానికి, ఆతనికి కళ్ళూ చెవులూ చేతులూ అబలే. తనులేకుంటే, ఒక్కడూ తనని తనే సరిదిద్దుకోలేడని ఒప్పుకొనేది అబల. అతను ప్రపంచయాత్రలు చేస్తుంటే మొదట్లో తనకి ఏమాత్రం యిష్టంలేకున్నా. తరువాత ఆయిష్టాన్ని అలవరచుకొని, తానూ వెళ్ళింది. ఈ యాత్రలు ఎంతో ఆనందాన్ని యిచ్చాయని చెప్తూ, మార్గరెట్ కజిన్సు సతితో "వివిధ దేశస్థులని కలుసుకోవడం మాట్లాడడం మనదృక్పథాని కెంతో వైశాల్యం యిస్తుంది. అంతేకాదు, యింత వైవిధ్యం కల వారందరి పైపై భేదాలమాట ప్రక్కకు నెట్టితే. అందరి అంతరాంతరాలలోని మానవత్వం ఒకటే అని తెలుసు కోడంకూడా ఎంతో బాగుంటుంది." అంది అబల. ప్రపంచంలో విఖ్యాతులైన అందరు శాస్త్ర కారులనీ కలుసుకొని, వారితో అభిమాన పూరితమైన స్నేహాలని పెంపొందించు కొంది అబల యూరపులో అమెరికాలో ఎన్నో కుటుంబాలు ఆమెకు అతి సన్నిహితు లయ్యారు.

అబలను మొదటి సారి చూడగానే కలిగే భావన ఒక్కటే. "స్వేచ్ఛాజీవి. మాతృమూర్తి; లోకజ్ఞానం కలది" అన్నదే ఆ భావన. తనకు పిల్లలు లేకున్నా మేనల్లుళ్ళూ. మేనకోడళ్ళూ అబల అంటే తల్లికంటే ఎక్కువగా చూసుకొంటారు. రిసెర్చి యిన్‌స్టిట్యూట్ లోని విద్యార్థులందరికీ మాతృదేవే అబల. ఇంతే కాకుండా కష్టించి పనిచేసే. బ్రహ్మసమాజ్ గరల్స్ స్కూలు సెక్రటరీగానూ, నారీ శిక్షాసమితి అధ్వర్యాన నడిచే యింకో ఆరు బడుల కార్యదర్శిగానూ. పనిచేస్తూ, దరిదాపు 500 మంది పిల్లలకి మాతృమూర్తి అబల. విషయాలు పని చేయడంలో, ఆర్గనైజింగులో గల తన నేర్పునంతా వినియోగించి ఆనేక యువతులకీ తల్లులకీ చదువు సంధ్యలకి తల్లి అయింది అబల. స్త్రీ విద్య పట్ల ఆమె ఉత్కంఠ చాలా సంవత్సరాల క్రితమే బయలుదేరింది. బెంగాల్‌లో స్త్రీ స్వేచ్ఛా విద్యల పట్ల బయలుదేరిన సంస్కరణాభిలాషకి అబల ఆమె యిద్దరు స్నేహితులూ నడుము కట్టేరు, ఈ ముగురూ, తగిన శిక్షణ తీసుకొండుకూ. దేశ సేవకై నారీ శేవకై, సర్వం ధారపోయడానికి ప్రమాణం స్వీకరించారు. చాలా రోజులపాటు తన అధ్వర్యాన వున్న స్కూళ్ళకి ప్రభుత్వ సహాయం స్వీకరించ నిరాకరించింది. కాని, ప్రభుత్వం ఖర్చు చేయదలిచిన సొమ్ము ప్రజదేఅనీ తను ఖర్చు చేయదలచు కొన్నదీ ప్రజలకే అనీ ఆలోచించి, ప్రభుత్వ సహాయాన్ని తీసుకొంది. అప్పటికీ స్కూలుకి ఆమే ఆమె అక్కలూ అన్నలూ నలభై వేలరూపాయిలు యిచ్చారు.

అబల దేశభక్తి పరాయిణత ఆమె యిల్లు చూసిన ప్రతివారికీ తెలుస్తుంది. విదేశ వస్తువులే ఆయింట్లో కనిపించవు. అలాగని శాస్త్రీయ సంబంధమైన పనిముట్లు ఆమె కాదనలేదు. పని తక్కువా, సులభం చేసే అనేకమైన పనిముట్లని వాడుకలోకి తెచ్చుకొంది. భారతీయ సౌకుమార్యాన్నీ పాశ్చాత్య సౌఖ్యాలనీ అబల తెలివితేటలతో సమన్వయపరుచుకోకల్గింది.

అబల జీవితంలో మిన్నగా ఎంచే స్నేహం సిస్టర్ నివేదిత తోటిది. నివేదిత అనేకమార్లు అబల యింటవుం ఆమె ఆతిధ్యాన్ని అనుభవించింది. అబలదృష్టిలో నివే తోటి స్నేహం అపూర్వమైనది.

స్త్రీ హక్కుల డిబేట్లు జరిగే రోజులలో (19 బెంగాల్ లెజిస్‌లేటివ్‌కౌన్సిల్, ఆడవాళ్ళగేలరీలో ప్రతిదిన అబలబోస్‌ని చూడగలిగేవారట. రాజకీయాలకి స్త్రీలపై ఆంక్షలుండడం అన్యాయం అనీ, అన్నిటా సమాన హక్కులు వుండాలనీ పోరేవారిలో అబల ప్రముఖురాలు. పౌరహక్కుల విషయంలో మాంటెగును కలుసుకొన్న ప్రముఖులలో అబలబోస్ ఒకతె. ఈమె మేనల్లుడు ఎస్. ఎమ్. బోస్ బెంగాల్ కౌన్సిల్‌లో సఫ్రేజ్ రి ల్యూషన్ ప్రతిపాదించాడు. అది ఓడిపోవటం అ కెంతో బాధ కల్గించింది. బెంగాల్‌లో సఫ్రేజ్ పోరాట ప్రముఖ పాత్ర వహించిన బంగీయ నారీసమాజ్ కమిటీ మెంబర్లలో ఒకతెగా వుండి అబల ఎనలేని సేవ చేసింది. మహిళాలోకం యీ సంగతి ఎప్పటికి మరిచిపోదు.

వితంతువులకీ, నైతిక పథాన్నుంచి తొలగిన స్త్రీలకీ కేంద్రాలూ, వసతిగృహాలూ విస్తృతంగా కావాలని. ఆమె ఒక ప్రణాళికని తయారు చేసింది. బొంబాయి ప్రాంతాలకి రమాబాయి రనడె స్థాపించిన అనేక సంస్థలు ఎంత ఉపయోగపడ్డాయో, కలకత్తా ప్రాంతాలకి యివీ అలాగే. వీటిని ప్రోత్సహిస్తూ ఒక బెంగాలీ దాత, శ్రీమతి హరిమతి దత్తా, పదివేలు విరాళం యిచ్చింది.

భర్త బాగోగులకీ, యింటికీ తన శక్తినీ నేర్పునూ వినియోగిస్తూ కూడా, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మధ్య పెరిగిన భారతనారి దేశానికీ, ప్రపంచానికీ కూడా అమూల్యమైన సేవ చేయకలదన్న విషయం శ్రీమతి అబలబోస్ విశదం చేసింది. 1900 లోనే స్వామి వివేకానంద యీ విషయాలన్నీ ఆమెలో గుర్తించకలిగాడు. పారిస్ ఇంటర్నేషనల్ కాంగ్రెసును గురించి, 1900 లోనే ఉత్తరం వ్రాస్తూ "ఈ కాంగ్రెసులో తమతమ దేశ ప్రతిభలనీ ప్రతిపత్తినీ చాటడానికి అనేకులు సమావేశం అయారు. నిజమైన సేవకులకి యిక్కడ ఘనత కలుగుతుంది. అదే ఘనత వారివారి దేశాలలో ప్రతిబింబిత మవుతుంది. నేను పుట్టిన దేశాన్నుంచి వచ్చిన వ్యక్తి ఏది? ఈ మానవ సముద్రం మధ్య ఒక చిన్న స్వరూపం లేచి నిల్చుంది. ఈ స్వరూపం పల్కిన ప్రతిమాటా, ప్రేక్షకులని స్తంభింప చేసింది. అలాగే. ఆనందోత్సాహంతో అతని మాతృదేశం పులకరిస్తుంది. ఈ ఏకైక వీరుణ్ణి దీవించు; ఈ ఏకైక వీరుని అందచందమైన నారీమూర్తిని దీవించు" అంటాడు. అబలబోస్ జీవితంలో అంతటి ఉత్తమ స్థానాన్ని ఆక్రమించుకోకల్గింది.

అబల భారత స్త్రీమూర్తులకి ఏకైక ప్రతినిధి. అధునాతన యుగంలో అపరమైత్రేయిగా తన భర్తతో పాటు యీ ప్రపంచారణ్యంలో సంచరిస్తూ, విభిన్నత్వాన్ని చెందివున్న మానవత్వంనుండి, కించిత్ దైవత్వాన్నే ఆస్వాదిస్తూ, అన్వేషిస్తూ, అందిస్తూ కాలం గడిపింది అబలబోస్.

అబలబోస్ జీవితం ఆడవాళ్ళకి ఒక గుణపాఠం. స్త్రీ తలచుకొంటే సాధించలేనిదంటూ వుండదన్న దానికి నిదర్శనం. అబల అబల కాదు సబలే అని నిరూపించుకొన్నది. జీవితంలో యిదమిద్ధంగా ఏదీ నిశ్చయించుకోలేక, చేదోడు వాదోడు లేక, చీకట్లో కొట్టుమిట్టాడే వారికి అబలబోస్ జీవితం ఒక వెలుగుచుక్క, వెలుగుబాట. ఆధునిక వనితాలోకానికి అబల ఒక ధ్రువతార.



— వేల్పు బువ్వ —

శ్రీ బాలాంత్రపు వేంకటరావు

సీ. రవ్వంపు పనిసరిగన్నపాల్కడలి మీఁ
గడలలో నొకపువ్వు గన్నువిచ్చె —
కనువిప్పు సెజ్జల నుసురించుటూయెల
గోములో నొక చందమామనవ్వె —
నగవుత్రొక్కుదునోయగవురేకలపువ్వుఁ
దోఁటలో నొకరేకు తొంగిచూచె —
చూపురాతలవెన్నెలతొక్కుంపుగేల్లమ్మ
టోయిలో శ్రావదాన్నె తొలకరించె —
దొన్నెలో నున్న దమృతంపువెన్నబువ్వ,
మనుగడకుఁ జాపురానీనిమందుబువ్వ,
కొమయలుగ వెల్లు లరిగించుకొన్నబువ్వ,
వెంటదివెన్నుండుపంచిన "వేల్పుబువ్వ" —



సంక్రాంతి వేడుకలు

సంక్రాంతి

శ్రీ పి. ఎస్. గోపాల్

మకర సంక్రాంతి పండుగ
మదినెంతో హాయినిండగ।
విరిసీ విరియని తెల్లనిమల్లె మొగ్గలు
కురిసీ కురియని పూవుల తేనెజల్లులు।
విహరించే మధుపానికి పన్నీటి జల్లు।
భళిరా ఇది అంతా ఒక సంక్రాంతికె చెల్లు।

మధుమాసపు సరంభం
విధిగా ఈనాడే
ప్రారంభం ఔతుందని
సారంగం పాడె

విరిసిన వెన్నెల వానలో।
కురిసే అమృతంపు సోనలు।
మురిసే జవరాళ్ళ రాళ్ళపారాణులు।
ముత్యాల. రతనాల రంగవల్లులు।
మదికెంతో సంతోషం।
హృదినెంతో ఉల్లాసం।
అందమైన సంక్రాంతి నేడేనోయీ
ఆనందాలను తేలే దీనాడేనోయీ।

అలుకతోడ పలుకని మా అల్లుడుగారు।
చిలుకల్లతో పలుకని మా పిల్లలతీరు।
అదిఅంతా ఒకలోకం
మదినెంతో ఆనందం।   ॥మకరసంక్రాంతి॥

కొంటెమరదలొస్తే మా అల్లుడాటకట్టు
కావస్తే చూడచ్చు కాకిమీద ఒట్టు
బుంగమూతి బావగారు కూరుచున్నారు
బంగరువాచీ ఇస్తే చెంగున లేస్తారు।
నే చెప్తే వింటారు।

అలుకమాని కులుకుతారు—
చిలుకబావగారు.
మా— పిలకబావగారు.
పకాపకా నవ్వుతారు। పదం పాడుతారు॥
॥మకర సంక్రాంతి॥

★ మేమొక స్కూలు కట్టేం ★

శ్రీమతి ఫ్రిడ బెడి.

ఇప్పుడు కూడా నేనా స్కూలు మానసిక దృష్టిలో చూడగలను. అప్పుడు 1948-49 సం॥ శీతాకాలం. కాశ్మీరులో మంచు (snow) సాధారణంగా డిశంబరు ఆఖరుకాలంలో పడి. బన్నిహాల్ కనుమను ఒక్కొక్క సారి ఒక మాసం, చలి విపరీతంగా వుండే కాలాల్లో అంతకంటె ఎక్కువ మాసాలు మూసేస్తుంది. 1948 జనవరిలో మామూలు శీతాకాలం ప్రవేశించింది. ఆమంచు పొడుం గొట్టడం నిషాట్ తోటల వెనుకనుంచి ప్రారంభించి శ్రీనగర్ రోడ్లూ, కాలిబాటలవరకు జరిగింది.

శ్రీనగర్ ప్రఖ్యాతిజెందిన కాశ్మీరులోయకు ముఖ్య పట్టణం, కేంద్రస్థానంలో ఉంది కట్టుకథలోలాగ తామర పూల మయమైన డాల్ చెరువువరకు, జీలం నది వరకు వ్యాపించియున్న మధ్య మధ్య నున్న అసంఖ్యాకాలైన జలాశయాలతో, ప్రాచ్య వెన్నిస్‌లా గుంటుంది. ఈ జలాశయాల్లో అనేక మంది పడవల్ని నడుపుతూంటారు. కొందరు, బహుశా బీదలు, ఆహార దినుసులు, నిత్యోపయోగమైన వస్తువులు మొదలు వ్యవసాయానికి కావలసిన నున్ను వరకు వీటిల్లో రవాణా చేస్తుంటారు. ఇతరులు, మామూలుగా కొంచం గొప్పవారైనవారు, తమ బోట్ల లోనే నివసిస్తూ, ప్రశాంతమైన తటాక జలాల్లో లంగర్లు వేసుకొని కాపురాలు చేస్తుంటారు.

ఈ నివాసయోగ్యమైన బోట్లు, పేద్దనోవాన్ ఆర్కు ల్లాగ ఉంటాయి. హోటళ్ళలో ఉండేవాటికంటే ఆడంబరాలైన కుర్చీలు, సోఫాలు వగైరా సామగ్రితో కూడిన పడక గదలు, పదిమంది కూర్చునే గదులూ కలిగిఉండి, వేసవి కాలంలో వేలాది ప్రజల్ని ఆకర్షిస్తూంటాయి. ఇండియాలో వాళ్ళు [illegible] వేసంగుల్లో ప్రజలు (ఎడారుల్లో ఒయేసిస్సుల్లాగ) కొండలమీద చల్లదనానికి చేరుకుంటారు. పర్వతాలతోను, మొగలాయీల తోటలతోను చుట్టుముట్టబడియున్న జలాశయాల్లోని కట్టుకథల్లోని బోట్లులాగునున్న పడవల్లో తేలుతూ ఆనందించడం కంటె ఆహ్లాదకరమైనదేముంటుంది?

ఏళ్ళ తరబడిగా చూడవచ్చే ప్రయాణీకులకు ఇలాంటి బోట్లు అద్దెకీయడం జీవనోపాధిగా పెట్టుకొని ప్రజలు ఆ శీతాకాలంలో గట్టి యిక్కట్లలో పడ్డారు. 1946 వేసంగిని ప్రఖ్యాతి నందిన "క్విట్ కాశ్మీర్" (కాశ్మీరు విడిచి పొండి) అన్న ఉద్యమం ప్రారంభమైంది. అల్లకల్లోలంగానున్న వేలీ వాతావరణంలోకి ఆసంవత్సరం బహుస్వల్ప ప్రయాణీకులు వచ్చేరు. 1947 లో ఇండియా విభజింపబడి పాకీస్తాన్ ఏర్పడింది. వెనువెంటనే కాశ్మీరు మీదికి వచ్చిన కొండ జాతుల దండయాత్ర ప్రారంభమైంది. అందుచేత మళ్ళీ ఆ వేసవికూడ— ప్రభుత్వంమారి, స్థిరపరిస్థితులులేని ఈ ప్రాంతాలకు ప్రయాణీకులులేక పడవలవారు పర్వత ప్రాంతాలలో దారుణంగా ఉం[illegible] శీతల బాధల్లో పడిపోయారు— తమ కుటుంబా వలసిన తిండిలేదు— భార్య బిడ్డలకు తగినన్ని గు లేవు— రెండేళ్ళు పాత గుడ్డలతోటి కాలక్షేపం చేశ[illegible]

ఇలాంటి పరిస్థితుల్లో— ఈ పడవల వారికీ, [illegible] కుటుంబాలకూ ప్రయాణీకులు రాకపోవడం వల్ల లేకుండాపోయి యిక్కట్లను లోనైన కూలినాలి జన[illegible] సహాయం చేయడానికి బొంబాయిలో నున్న కొ[illegible] మిత్రులు కొందరు విరాళాలు పోగుచేయడం ప్రార[illegible]చారు. ఇలాగ పోగుచేసిన 50 వేల రూ॥లు పడవ కు[illegible]బాలకు వీలైనంత సహకారి గావడానికి సద్వలసివచ్చి[illegible] దీనితోబాటు బట్టలు, వూలుగుడ్డలు బహు ఉదారత లండన్ రెడ్‌క్రాస్ సొసైటీవారు, తమలో సేవనే[illegible]డంలో పేరెన్నికగన్న మేక్లీన్ సతీగారితో పంపి[illegible] మాకు తోడ్పడ్డారు.

డబ్బు అందరికీ సర్దుబాటు చేయడం ఎలాగ అన్నదే సమస్య. డబ్బు దానం స్వీకరించడం అంటే అమిత ఆత్మగౌరవం, గర్వం, కష్టపడి కృషి చేసుకోడం లక్[illegible] [illegible] లోనయ్యే వేలీలోని బీదవారు కూడ అంగీకరించరు కా[illegible] డబ్బు లేకుండా ఆహారం తదితర అవసరాలు లభించ[illegible] ఇతర వస్తువులేవీ ఎంత పంచిపెట్టినా ఇంత సంతృ[illegible]నీయలేవు. అప్పుడు— మా స్కూలు ఉద్దేశం ఉ[illegible]వించింది.

బోట్లవారికి సం॥లో కొన్ని మాసాలే పని ఉంటుం[illegible] తమ పడవలను అద్దెకు పుచ్చుకొనేవారి యిష్ట ప్రకార[illegible] వాటితోబాటు వీరూ వేసవిని తిరుగుతూంటారు. [illegible]

మేమొక స్కూలు కట్టేం

పిల్లలు ఒక్క శీతాకాలంలో మాత్రం స్థిరంగా ఒకచోట నుండగలుగుతారు, అప్పుడు బ్రహ్మాండమైన మంచు మయమైన శీతాకాలంలో స్కూళ్ళన్నిటికీ రెండున్నర మాసాలు దీర్ఘ శలవులు యిచ్చేసి మూసేస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో వీరికి చదువు సంధ్యలు సున్న.

అందుచేత ఇదో మంచి అవకాశం. బోటు ప్రజల బిడ్డల కోసరం కాశ్మీర్ పట్నంలో ఒక శీతకాలపుస్కూలు ప్రారంభించడానికి నిశ్చయింపబడింది. అవసరమున్న కుటుంబాల్లోనుంచి ఒక అబ్బాయి, అమ్మాయిని ఎంచి వీరికి విద్య గరపడానికి బిడ్డ ఒక్కంటికి 15 రూ.లు విద్యార్థి వేతనం, నిశ్చయింపబడింది. దీనివల్ల వారి కుటుంబాలకు 30 రూ.లు ముట్టేవి. పిల్లలకు వారి జీవితంలో చదువుకొనే అవకాశం ఏర్పడింది. ఇందుకు ప్రత్యేకంగా తర్ఫీదై, విద్యగరపడంలో ప్రావీణ్యతకూ, ప్రజాసేవలో నమ్మకానికీ పేరొందిన మేష్టర్లు నియమింపబడ్డారు.

స్కూలు భవనం డాల్‌గేట్‌లో ఒక కాళీ హోటలు. రెండంతస్థులుగల పెద్ద భవంతిలో 250 బాలికలు, బాలురు విధి తప్పక చదువు, వ్రాత, సివిక్సు, ప్రపంచజ్ఞానం చేతి పనులు నేర్చుకొందుకు హాజరయ్యేవారు. ఇది ఒక తమాషాయైన ప్రయోగమే. ముఖ్యంగా ఈ పిల్లలు మే మనుకున్నదానికంటె ఎక్కువ ఉబలాటం చూపేవారు. వారిలో ఉండే విద్యాగంధం చూడాలంటే వినండి. స్కూలుకు వచ్చే 4 ఏళ్ళ ప్రాయం బిడ్డలనుంచి 16-17 ఏళ్ళ యువతులవరకు నున్న 250 మంది ఆడపిల్లల్లోను 20 మందికి వట్టి అక్షరజ్ఞానం మాత్రమే ఉండేది. ఆడపిల్లలకంటె పుస్తకం చదువుల్లో ఎక్కువైన వారమనుకొనే మగపిల్లల్లోను ఇంతే — వారిలోనూ 250 మంది లో 20 మందిలో కొంతఅక్షరాల్ని గుర్తుపట్టే జ్ఞానం ఉండేది. వారుకూడా ఈ మూడు మాసాలు చదువుకు లభించిన అవకాశాన్ని ఆతురతతో స్వీకరించారు.

చేతి పనుల క్లాసులో ఆడపిల్లలకు కుట్టు నేర్పబడేది. మనుకాలం పూర్తి కావచ్చేసరికి పెద్ద పిల్లల దుస్తుల (ఉత్తర హిందూ స్థానంలో స్త్రీలకు పరిపాటైన పొడుగు లాగులు) కుట్టడం వరకు వచ్చారు. మొదిలో వారం ఎక్కించడంతో ప్రారంభించేం ఈ కుట్టు క్లాసుల పాఠాలు అని నేను చెబితే — ఇంత తక్కువ వ్యవధిలో సాధించిన అభివృద్ధికి మీరంతా ఆశ్చర్యపోవచ్చు. చిన్న బాలికలకు ఇంత ప్రవీణత రాలేదుగాని చాల మందికి పిల్లల దుస్తులు కుట్టడం వచ్చింది. తమ బట్టలు తాము కుట్టుకునే సామర్థ్యం చేతనయింది. ఈ వివరాలు ఎందుకు చెబుతున్నానంటే — కాశ్మీరు కుట్టు. కాశ్మీరు శాలువాలు ప్రపంచమంతటా పేరు పొందేయి గనుక మీలో చాలా మంది కాశ్మీరు స్త్రీలు కుట్టుల్లో గొప్పప్రావీణులనుకోవచ్చు. కాశ్మీరువని అమ్మబడే మీరు చూస్తున్న అందమైన నగిషీలన్నీ మగవారు చేసేవే. తమ పిల్లల బట్టలు కూడ, స్త్రీలు, మగ దర్జీలకిచ్చి చిరుగులు కుట్టిస్తారు, లేకపోతే తమ ఇంట్లోనే ఒక మగవాడు కుడతాడు. ఈ చదువుకునే పిల్లలు ఇంకా గుడ్డ పేలికలతో మంచి మంచి ఆట బొమ్మలు, మగ పిల్లలు గుడ్డలతో కుట్టిన జంతువుల బొమ్మలు వగైరాలన్నీ తయారు చేశారు. ఇవి ముందు ముందు మంచి లాభకరమైన కుటీర పరిశ్రమలుగా రూపొందుతాయనుకుంటున్నాము.

బడికి పంపడానికి పిల్లలు లేని కుటుంబాలనుంచి వచ్చిన కొందరు వయస్సుగల స్త్రీలు కూడ ఉన్నారు. వారికి వేస్టు పట్టు అల్లడం నేర్పించి ఉచిత విద్యార్థి వేతనాలిచ్చాము.

నేను ఇంకా ఆ బడి పిల్లలను చూడగలను — "ఆ ప్రొద్దుటే కళకళ లాడే ముఖాలు" — మేము యిచ్చిన యూనిఫారాలతోటి. ఇచ్చిన యూనిఫారం ఏమిటంటే లేత పసుపు పచ్చ పట్టు గుడ్డ లాగూ, ఒక స్వెట్టరు, ఒక ఎర్రరంగు ముఖానికి వేసుకొనే తెర. దీన్ని నొసట మీద వేసికట్టి వెనకవైపున చక్కటి ముడి వేసుకుంటారు. శీతగాలిలో విడిచిన షాలిమర్ గులాబీలవంటి రంగుగల చెక్కిళ్ళు, మెరసే నల్లటి కళ్ళు, రెండు జడలుగాకట్టి వీపువెంట వ్రేలాడేసిన నల్లటి పట్టులాంటి కురులుగల కాశ్మీరు దేశపు పిల్లల్ని మీరెప్పుడైనా చూచి ఉంటే ఎంతముద్దొస్తూ ఉంటారో మీకే తెలుస్తుంది. చిన్న పిల్లలు మరీ ఆకర్షవంతంగా ఉంటారు. మగ పిల్లలు కాఫీ రంగు ఉన్ని గుడ్డలు, నల్లటి షరాయిలు, తలపై కాశ్మీరు పేరు పొందిన ఆ పెద్దబొచ్చు టోపీలు ధరించేవారు. ఆ మూడు మాసాల వ్యవధిలోను వారు చాల అభివృద్ధిలోకి వచ్చారు. ఒకవేళ స్థిరపడియుండి చక్కగా చదువుకొనే భాగ్యవంతుల బిడ్డలాగ గాక అవకాశాలు లేక వెనుకబడిపోయి ఉండే ఇలాంటి పిల్లల్లో ఎంత తెలివితేటలు, బాక చాతుర్యం ఉంటుందో మాకు బాగా విశదమయింది.

మేమొక స్కూలు కట్టేం

నేను ఆమూడు (జనవరి, ఫిబ్రవరి, మార్చి) మాసాలు ఎన్నడూ మరిచిపోలేను. "మేము కట్టిన స్కూలు"— పనిలేనివారికి సహాయం చేయడానికి నిర్మింపబడింది; ఇప్పుడు అది లేదు. బోటు ప్రజలు మళ్ళీ తమ ప్రయాణీకుల హడావిడిలో మునిగి మంచి లాభాలు సంపాదిస్తున్నారు. వారి పిల్లలు కొంతమందికి చదువు చెప్పుతున్నారు. కొందరు విధిలేక అలా స్థిరత్వంలేక పడవలతోబాటు తిరిగే తల్లిదండ్రులతో తిరుగుతూ కాలక్షేపం చేస్తున్నారు. కాని, ఆ 250 మంది ఆడపిల్లలు, 250 మగపిల్లలు గులామ్ మహమద్ సాహేబు, ముట్టో సాహేబు, లక్ష్మి గార్లు మరికొందరు ఎంచిన మాష్టర్లు వారి శీతకాలం శ్రెలవలు మానుకొని తమ అందరితోను గడిపిన ఆ ఆనంద పదమైన రోజులు వాళ్ళు యావజ్జీవం జ్ఞాపకముంచుకుంటారు. అలాగే తమరు, తమ కుటుంబాలకు బట్టలు పంచిపెట్టి మహా ఓర్పుతో ఆడపిల్లలకు కుట్లు, అల్లికలు, చిరుగులు కుట్టడం వస్త్రాలు నేర్పిన ఆ మేర్లిన్ సతీగార్నికూడ జ్ఞాపకముంచుకుంటారని అనుకుంటున్నాను.

ముందు ముందు, ప్రచారం చేసే స్కూళ్ళు, ఆమాటకువస్తే నీటిలో పడవల స్కూళ్లా సాకారందాల్చి, బోటు పనులమీద జీవనం చేసేవారి పిల్లలు, విధిగా చదువుకొందుకు నిశ్చయమైన యేర్పాట్లు జరిగితే- మేము శీతాకాలంలోను, దాడి సమయంలోను సాగించిన ఆ ధైర్యమైన ప్రయత్నమూ, ప్రయోగము సదా జ్ఞప్తిలో ఉంచుకుంటాం.

స్వప్న తోరణం

శ్రీ గోరా శాస్త్రి.

(ఒక పెద్దహాలులో వేడుక, వినోదం ఏదో జరుగుతున్నట్లు రొద వినిపిస్తుంది. ఒక యిరవై ముప్ఫయిమంది జనం చేరి మాటాడుకొంటున్న అలజడి. ఒక్కసారిగా అంతా చప్పట్లు కొడతారు.)

రాధ : (చప్పట్లు కొట్టడం ఆపేసి - విరగబడి నవ్వుతూ) వండర్ ఫుల్ ! వండర్ ఫుల్ ! మిస్టర్ గోపాల్. కంగ్రాచులేషన్స్. పేకముక్కల మ్యాజిక్ బాగా నేర్చుకున్నావే !

గోపాల్ : మరేమిటనుకున్నారు రాధా దేవీ ! నేను ఏది నేర్చుకున్నా క్షుణ్ణంగా నేర్చుకుంటాననుకోండి !

సుందరి : (గొంతులో అమాయికత్వం నటిస్తూ) మీరు జంతు శాస్త్రంలో ఎం. ఏ. కదండి ?

రా : కాదు సుందరీ. తెలియనట్టడుగుతావేం ?

గో : అహాఁ- మరేం లేదులెండి- సాక్షాత్తూ మీ చెల్లెలు కదూ- కాస్త వ్యంగ్యం అలవాటు చేసుకొంటోంది. మీరు మట్టుకు, సుందరిగారూ- మీ బి.ఏ. పాక శాస్త్రంలో కదూ ?

సుం : తగ్గండి మరి ! పాకశాస్త్రంలో కాదు- పూరిపాకల శాస్త్రంలో-

గో : అంటే ?

సుం : చూశారా ! అంటే ఎకనమిక్స్. ఇండియా నిండా పూరి పాకలే కదండీ ! ఆ మాత్రం పోల్చుకోలేరూ ?

గో : లేకేం. ఇంకా చూడండి. (అందరినీ ఉద్దేశించి బిగ్గరగా) లేడీస్- అండ్ జంటిల్ మన్ ! ఈ సాయంత్రం యీ సుందర సాయంత్రం- మనమంతా కుమారి రాధాదేవి పుట్టినరోజు పండగ- బర్త్ డే- సెలబ్రేట్ చేస్తున్నాం- అంచేత మనందరం హాయిగా - ఆడుతూ - పాడుతూ- నవ్వుతూ నవ్విస్తూ- వెరిగుడ్ ! ఇప్పుడు మీరంతా పేకముక్కల మ్యాజిక్ చూశారు- ఇంకో చిత్రమైన ఫీట్ ! దీన్ని ఇంగ్లీషులో థాట్ రీడింగ్ అంటారు !

సుం : (రాగ వరుసలో) ఎన్ని-విద్యలు-నేర్చినాడమ్మా !

రా : ఉష్. ఉండవే సుందరీ !

గో : —అంటారా ! ఇక చూడడండి తమాషా ! ఒరేయ్ వెంకట్రావ్ ! ఓసారి యిలారా.

వెం : నే రాన్నా బాబూ !

గో : ఏం ?

వెం : నా బుర్రలో ఉన్న థాట్స్ అన్నీకలిసి నాంఛగో అయివో. అవన్నీ నువ్వు పైకి చదివేస్తే ఏం దారి ?

(అందరూ గొల్లున నవ్వుతారు)

గో : భయంలేదురా ?

సుం : ఫరవాలేదు రండి వెంకట్రావుగారూ !

వెం : మీ సామ్యేం పోయింది రమ్మంటారు ! ధైర్యం ఉంటే మీరు నించోండి.

ఇంకో స్త్రీ : ఆడవాళ్ళ థాట్స్ చదవగలరండీ మీరు ?

గో : నిస్సందేహంగా !

స్త్రీ : అయితే ఉండండి... వస్తున్నాను...ఆఁ...ఇప్పుడు చెప్పండి. నేను మీడియమ్‌ని అనుకోండి...

గో : వెరీగుడ్. లేడీస్ అండ్ జంటిల్ మన్ ... చూడండి యీ తమాషా ! విమలగారూ ! మీ ధైర్యం మెచ్చుకోదగింది... సిద్ధంగా ఉన్నారా ?

విమల: ఓ యస్.

గో: చూడండి... ఇంక ఇప్పుడు నేనో నెంబరు తలుచుకున్నాను. ఏమిటా నంబరు?

విమల: ఏడు.

గో: కరెక్ట్. సరిగా అదే.

(అందరూ గొల్లున నవ్వుతారు)

గో: ఇంకా చూడండి. మిస్ విమలా! ఇప్పుడు నేను తొమ్మిది నంబర్లు తలుచుకున్నాను. అన్నీ తొమ్మిది లోపు. ఏమిటా నంబర్లు?

విమల: తొమ్మిదీ, ఎనిమిదీ, ఏడూ, ఆరూ, అయిదూ, నాలుగూ, మూడూ, రెండూ, ఒకటీ!

గో: ఆల్ కరెక్ట్.

(అందరూ నవ్వుతారు)

గో: ఇంకొక్క ఫీట్. సుందరిగారూ, దయచేసి ఓ చేతి రుమాలుతో విమలగారి కళ్ళకి గంతలు కట్టండి.

సుం: సరే... ఇదిగో కట్టేశాను.

గో: ఇదిగో విమలగారూ. నా చేతిలో ఓ వస్తువుంది. అదేమిటో పోల్చుకోండి.

విమల: పోల్చుకున్నాను.

గో: చేతిలో ఉన్నది సూటుకేసా?

విమల: కాదు.

గో: పందిరి మంచమా?

విమల: కాదు. అద్దాల బీరువా అంతకంటె కాదు.

సుం: పోనీ కాలుతున్న కొరకంచా?

విమల: అయినా బాగుండును. కాని కాదు.

(అందరూ గొల్లుమని నవ్వుతారు)

గో: చూశారా! ఏదికాదో విమలగారిచేత యిట్టే చెప్పించేశాను.

రాధ: మరే! థాట్ రీడింగ్ అంటే అలా ఉండాలి.

విమల: కంగ్రాచ్యులేషన్స్ గోపాల్ గారూ. నా మనస్సులో ఉన్నదంతా యిట్టే పోల్చేశారే?

వెం: ఒరే గోపాల్!

గో: ఏరా బాబూ!

వెం: అంతా బాగానే ఉందిగాని- నా సందేహం ఏమిటంటే - నువ్వు థాట్ రీడింగ్ అని ప్రారంభిస్తే- చివరికి ఆవిడ థాట్స్ నువ్వు పోల్చుకోవడం పోయి నీ థాట్స్‌లన్నీ విమలగారు పోల్చుకున్నారేమోనని.

విమల: ఎంతమాట వెంకట్రావుగారూ. ఆడవాళ్ళ థాట్స్ గోపాల్ గారు బాగా చదవగలరు.

సుం: ఆ సంగతి నేను ఏనాడో కనిపెట్టాను విమలా.

విమల: అన్నట్టు టైము ఎనిమిది దాటిందే? ఇంక నేను వెళ్ళాలి రాధా! ఇంక రామం రాడు వచ్చేవాడయితే యింత ఆలస్యం చెయ్యడు.

రాధ: వెళతానంటావా? సరే- రామం కావాలని ఎందుకో రాలేదు- పోనీ నాన్నగారు చూడు- ఈ సాయంత్రం ఆయనేనా కాస్త యింటిదగ్గర ఉంటే ఎంత బాగుండును?

సుం: ఆయనకేవో లక్ష పనులు పోనిస్తూ... వస్తారులే.

వెం: ఇంక మేం వెళ్తాం రాధా దేవీ! ఏదో సాయంత్రం అందరం స్నేహితులం మీ పుట్టినరోజు పేరుచెప్పి కలుసుకొన్నాం— కాస్సేపు కులాసాగా కాలక్షేపం చేశాం. సెలవ్ మరి.

(వెళ్ళొస్తాం రాధా! ఇంక వెళ్ళిరానా రాధా! థ్యాంక్యూ రాధా! సెలవు తీసుకుంటాను రాధగారూ! ఇలాగ ఒక అరడజను సంకీర్ణ కంఠాలూ- స్త్రీలవీ పురుషులవీ- కలగా పులగంగా వినిపిస్తాయి)

గో: ఇంక నన్నూ వెళ్ళమంటారా రాధా దేవీ!

సుం: మంచిది గోపాల్ గారూ. ఇవాళ నిజంగా మీరే పార్టీకి ప్రాణం పోశారు. థాంక్స్. జయప్రదంగా వెళ్ళిరండి.

గో: మళ్ళీ ఎప్పుడు దర్శనం రాధాదేవీ?

రాధ: అంత పెద్ద దర్శనానికేముందండీ. ఒక్క వీధిలోని వాళ్ళం- ఎప్పుడు పడితే అప్పుడే కలుసుకుందాం.

గో: గుడ్ నైట్! విష్ యూ హాపీ డ్రీమ్స్.

(క్షణం నిశ్శబ్దం)

సుం : హామ్మయ్యా. గ్రహాం వొదిలింది ఎలాగయితే నేం. కానూరపు జీడిలా ఒకంతట వదలడు... ఇడియెట్.

రాధ : పోనీలే గాని- రామం చూశావా సుందరీ ఎంత పనిచేశాడో.

సుం : నేను అనుమానపడుతూనే ఉన్నాను. నాకెందుకో పార్టీకి రామం రాడనిపించింది.

రాధ : ఎంచేత ?

సుం : మనిషి ధోరణి కనబడ్డంలేదే రాధా ? మళ్ళీ అలా అడుగుతావ్ ?

రాధ : నిజమేలే. వారం పది రోజులనుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. పోనీలే. అంతేనా ? ఆపైన ఏం చేస్తాడు ? నేను బాధపడతాననుకున్నాడు కాబోలు- వెర్రివాడు- రాధ అంత వెర్రిబాగులది ఏం కాదు. నేనూ ఇపుడిపుడు కొంచెం కళ్ళు తెరుస్తున్నాను. ఒక రకంగా చూస్తే- యీ రామం యింక మనింటికి రాకపోవడమే మంచిది......

సుం : ఎందు కదంతా నాతో చెపుతున్నావ్ ?

రాధ : ఏం చెపితే ? వినడానికి నీకంత బాధగా ఉందా?

సుం : మధ్యని నాకెందుకు బాధ ?- ఏదో కథ చెప్పినట్టుంది. వచ్చేడో లేదో చూద్దామని సాయంత్రం వాళ్ళింటికెళ్ళితే వాళ్ళ పార్వతి కూడా అలాగే అందిలే.

రాధ : (ఆశ్చర్యంగా) సాయంత్రం వెళ్ళావా వాళ్ళింటికి?

సుం : వెళ్ళాను. ఇంట్లో ఉన్నాడేమో చూద్దామనీ. లేడు.

రాధ : ఏమంది పార్వతి ?

సుం : ఏమంటుంది ? నవ్వుతూ పలకరిస్తుంది. తేనె లొలుకుతూ మాటాడుతుంది. అమ్మో అలాగుంది గాని- శుద్ధ నంగనాచి.

రాధ : పార్వతిలాంటి మనిషి యీ భూప్రపంచంలో లేదంటాడు రామం. ఆమె దేవత అని రామం నమ్మకం.

సుం : అంతేలే. కొన్ని కొన్ని గుడ్డి నమ్మకాలలాగే ఉంటాయి... అబ్బ... ఘోరమని ఇన్ని దీపాలిందుకే చీదరగా ఉంది.

రాధ : అన్నీ ఆర్పేసి ఒక్క నీలం లైటు మాత్రం ఉంచు. ఇంకా రాలేదు చూశావా నాన్నగారు.

సుం : ఏ క్లబ్బులో పేకాడుతూ కూర్చున్నారో... వస్తారులే.

(సన్నగా- అతి సన్నగా- భూగర్భంలోంచి వచ్చినట్లు వీణ గానం వినబడుతుంది)

పార్వతి : అరె! ఎవరో రేడియో స్విచ్ వేసి వదిలేసినట్లుంది. అరె! ఇక్కడే ఉన్నారా మావయ్యా. ఇంత చీకటిగా ఉంటే లైటు వేసుకోకుండా— ఏవిటాలోచిస్తున్నావ్ రామం మావయ్యా ?... (వీణ ఆగిపోతుంది)

రామం : అప్పుడే చీకటి పడిందా పార్వతీ ?

పా : (నవ్వు) అబ్బే- లేదు. ఇప్పుడే సూర్యుడుదయిస్తున్నాడు. ఇది పగలో రాత్రో కూడా నీకు తెలియడం లేదు.

రా : తెలియకేం పార్వతీ. ఇది చీకటి రాత్రి. ఎప్పుడు తెల్లారుతుందా అని చూస్తున్నాను. అంతే.

పా : ఎంత చీకటి రాత్రికీ ఓ అంతం అన్నది ఉంటుంది. దాని మాటలకేం గాని— ఏవిటంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు ? సుందరి పాపం- నీకోసం రెండుసార్లు ఒచ్చి వెళ్ళింది. నువ్వింట్లో లేవనుకున్నాను. పార్టీకి వెళ్ళలేదేం ?

రా : ఏవిటో. వెళ్ళాలనిపించలేదు. అంతే. అన్నయ్య యింకా రాలేదా ?

పా : పెద్దమావయ్యా! నీ అన్నగారాయన. ఒస్తాడు నెమ్మదిగా. ఆఫీసులో అంకెల కూడిక యింకా అవలేదు కాబోలు.

రా : అక్కయ్య ఏం చేస్తోంది ?

పా : అమ్మో ! అమ్మ వంటింట్లో ఉంది. ఇంతకూ మాట మార్చేస్తున్నావు. రాధాదేవి పార్టీకి నువ్వెందుకు వెళ్ళలేదంటే సమాధానం చెప్పవేం ?

రా : ఏమిటో కొన్నింటికి సమాధానం చెప్పలేం. ఈ వైశాఖంలో నీ పెళ్ళి ముహూర్తం నిశ్చయిద్దామా అంటే మీ మేనత్త మావయ్యా సమాధానం చెప్పరేం ?

పా : అవునులే. బోధపడింది. కొన్నింటికి మనం సమాధానాలు చెప్పలేం. ఇందాక వాళ్ళ సుందరికూడా యిలాగే యేమిటో ప్రశ్నలు వేసింది. మీ మావయ్య యింట్లో ఉండగానే లేదంటున్నావా, లేక నిజంగా లేడా అనడిగింది. యేం చెప్పను సమాధానం ?

రా : నువ్వు అంత పనీ చేశావుగా ! నేనింట్లో వున్నా లేనన్నావుగా.

పా : నాకు నిజంగా తెలీదు_ నువ్వు ఇంట్లోనే వున్నావని. తెలిసే ముస్తాబు చేసి సుందరి వెంట పంపించిఉండేదాన్ని. మధ్య నాదేమిటి మావయ్యా.

రా : కోపం తెచ్చుకోకు పార్వతీ. పార్టీకి వెళ్ళడం యిష్టంలేక యిలా గదిలో ఎవరికీ తెలియకుండా దాక్కున్నాను.

పా : ఏమిటో నీ వైఖరంతా ఓ వారం పదిరోజులనుంచి ఎంతో చిత్రంగా ఉంది. అమ్మకూడా అడిగింది.

రా : నాకేం_ హాయిగా ఉన్నాను. గంగిరెద్దు వేషం వేసుకొని రోజూ ఆఫీసుకి వెడుతున్నాను, వస్తున్నాను. ఆపైన స్నేహితులు, షికార్లు, సినిమాలు— అంతా మామూలుగానే ఉన్నానే ?

పా : అంతే అంటావ్ ?

రా : కాక మరి ! తీరి కూర్చున్నావ్ అలా అలా ఊహించుకుంటున్నావ్ నువ్వే ఇంక లాభంలేదు పార్వతీ ! ఈ వైశాఖంలో నీకు తప్పకుండా పెళ్ళి చేసెయ్యాలి. రేపో యెల్లుండో మీ మేనత్తకి యింకో ఘాటైన ఉత్తరం వ్రాస్తాను. కుర్రాడు నీకు నచ్చినట్లేగా.

పా : అంతేలే... జాడ్యం నీలో ఉంచుకొని వైద్యం నాకు ఏర్పాటు చేస్తున్నావు. నువ్వు నిజంగా కొంచెం పిచ్చివాడివి మావయ్యా ?

రా : క్రమంగా యీ లోకాన్ని చూసి పిచ్చెక్కుతోంది.

పా: లోకం ఏంచేసింది మధ్య. లేక నీ దృష్టిలో లోకం అంటే రాధాదేవీ, సుందరీ. వీళ్ళిద్దరేనా ?

రా : లేదు_ ఇంకో పేరు మరచిపోయావు.

పా : ఆ చిట్టితల్లెవరు ?

రా : విమలాదేవి. తెలియదూ ?

పా : తెలియకేం ? బంగారుతల్లి. ప్రస్తుతానికి వీళ్ళన్నమాట నీ స్వప్నసుందరులు.

రా : మరి.

(రామారావ్ అని బయటినుండి పిలుపు)

పా : అదిగో. సుందరి పిలుస్తోంది. ఏం చెప్పమంటావ్ ?

రా : లోపలికి ఆహ్వానించు. నిర్భయంతగంగా.

(కొంచెం విరామం)

సు : హల్లో ! రామారావ్ ! దొరికావోయ్ చివరికి. ఏం పార్వతీ ! ఎప్పుడు చేరుకున్నాడు కొంపకి ?

పా : (నవ్వుతూ) అతన్నే అడుగు ! ఏం మామయ్యా ? ఎప్పుడొచ్చావ్ యింటికి ?

రా : సారీ సుందరీ ! సమయానికి వేరే యింకో అర్జంటుపని తగిలింది... పార్టీ సజావుగానే జరిగిందా ? ఏమంటోంది రాధ ?

సు : అలా ఉండాలి నటనంటే_ నువ్వు సినీమాల్లో చేరిపోకూడదు రామారావ్ ?

రా : చేర్పిస్తావా ?

సు : తప్పకుండా. ఆమాటకొస్తే మా నాన్నగారితో చెప్పి ఓ సినిమా కంపెనీ పెట్టిస్తాను. అదెంత భాగ్యం? అది సరేగాని_ నీ ధోరణేం బాగాలేదు రామారావ్ ! సాయంత్రంనుంచి యిది మూడోసారి నిన్ను వెతుక్కుంటూ రావడం. తెలుసా !

రా : వెంకట్రావ్, గోపాల్ వాళ్ళంతా వచ్చారా పార్టీకి ?

సుం : రాలేం ! అంతావచ్చారు.

(సశేషం)

భూవలయము


భూవలయమనేది ప్రాచీన భారతీయ వైజ్ఞానిక గ్రంథము. దీనిని కుముదేందు అనే వ్యక్తి రచించి నాడట.

కలకత్తాలో నవంబరు మాసములో జరిగిన ఒక జైన ప్రదర్శనములో ఈ గ్రంథము ప్రదర్శింపబడ్డది. వెయ్యి సంవత్సరములనాటి తాటాకులు 2400 వరకూ ఈ ప్రదర్శనలో ప్రదర్శింప బడుచున్నవి. ఇందులో ఒక లక్షాడెబ్బయి రెండువేల శ్లోకాలున్నవి. ఇందులో మొత్తము 718 భాషల్లో చదవవచ్చునట.

ఈ గ్రంథము జైనుల చరిత్రకు చాలా ఉపయో గించగలదట.

ఎంత హీనంగా లెక్కవేసినా ఒక శతాబ్దము దాట కుండావున్న ఈ గ్రంథంలో అంకెల స్థానాల విలువను నిర్ణయించే పద్ధతి, ఒక పద్ధతిలో ఉన్న స్థానాలను మరొక పద్ధతిలోకి మార్చే పద్ధతి, ఘాత సంకలన సూత్రాలు, వివిధ సంఖ్యలను మరొక అంకెయొక్క ఘాతాలుగా నిరూపించటం (లాగరె ధమ్సు) మొదలైన గణిత శాస్త్ర విశేషాలెన్నో ఉన్నవి.

ఇంకా మన దేశంలో 9వ శతాబ్దినాటికే పదార్ధ విజ్ఞాన శాస్త్రము, రసాయన శాస్త్రము, జీవ శాస్త్రము, జంతు శాస్త్రము, ఆయుర్వేదము, ఖగోళ శాస్త్రము, పశువైద్యము మొదలైన వివిధ శాస్త్రాలు ఎట్లా అభివృద్ధి చెందినవో ఈ గ్రంథము వివరించగలదని తెలుస్తున్నది.



హిమాలయ పర్వతశిఖరములు

"ఆశాజీవులు"

శ్రీ పి. వి. రత్నం

"ఎవరెస్టు శిఖరం." ఎత్తైన శిఖరం.

మహోన్నత శిఖరం. మరుపురాని శిఖరం.

మానవులను ముప్పుతిప్పలు పెట్టిన మహోజ్జ్వల శిఖరం. ఆ పేరు ఎత్తితే చాలు— ఎన్నెన్ని భావాలు! ఎంతెంత ఆలోచనలు.

"అమ్మయ్యో!" అని ఒకసారి ఆశ్చర్యం. "అబ్బ!" అని ఒకసారి నిట్టూర్పు. కాని ఆ ఆశ్చర్యం ఆలోచనలు కల్గించింది. అందుకే అంత ఆవేశం. అందుకే అంత అభివృద్ధి.

నూరు సంవత్సరాలనుంచి నిద్రపోనివ్వని శిఖరం. నలుమూలలా పేరు ప్రతిష్ఠలార్జించుకున్న శిఖరం. పలు దఫాలుగా, పలు విధాలుగా ప్రయత్నం మీద ప్రయత్నం, ఫలితం సాధించాలన్న ప్రగాఢ వాంఛ.

అచంచల విశ్వాసం, అంతులేని ఆత్మవిశ్వాసం. పరాజయం పిమ్మట పరాజయం, ప్రాణాల్ని సైతం పొట్టపెట్టుకున్న పరాజయం. ఎముకల్ని కొరికే చలి. ఎవ్వరూ ప్రదేశం. కన్పించని ప్రపంచాన్ని పరిహసించిన ప్రదేశం. ఎంత కష్టం! ఎంత శ్రమ!

ఎంత ఓర్పు కావాలి? ఎంతనేర్పు వుండాలి? ప్లాను కావాలి. పట్టుదల వుండాలి. ప్రాణాలకు తెగించాలి. పరాజయాన్ని పాతిపెట్టాలి. భయాన్ని బాదాలి. అబ్బ! మానవునికి ఎందుకింత ఆరాటం? ఏమిటీ ఆత్రుత?

"కృష్ణా రామా" అంటూ, తలో గంటో త్రాగి, ఒక మూల కూర్చొని, కాలక్షేపం చేయక, మంచు కొండలతో కుస్తీ పట్టడమెందుకు?

ప్రపంచంలో ఎంతమంది బ్రతకడం లేదు? వీరూ తమ పొట్టల్ని పోషించుకోలేరా? కూటి కొరకు కోటి విద్యలున్నాయి కదా? మరి ఎందుకింత కాంక్ష? ఏమిటీ కలలు?

ఊహూ, మనిషి తల్చుకుంటే, సముద్రాన్ని సైతం బ్రద్దలై పోతాయ్. మానవుడు సాధించని దంటూ లేదనికాదోయ్. సంవత్సరాలు దొర్లిపోతున్నా. ఎందరెందరో. బట్టబట్టగా.

దేశదేశాలనుంచి. ఎన్నెన్నో పర్యాయములు, ఫలితం కోసం రావడం, పరాజయం పొందడం చూస్తే, మానవునిలోని అకుంఠిత దీక్ష, అర్థం అవుతుంది.

కొండల్ని కొలవడం— నదుల్ని దాటడం— ఆకాశంలో తేలడం— అబ్బ! ఎంత ధైర్యం! ఎంత అభివృద్ధి!

ప్రకృతిని సాధించాలన్న ఆశ మానవునిలో ఆవిర్భవించకపోతే, మరి ఎలాంటి ఎదుగూ బొదుగూ లేకుండా, అనామకంగా, అయోమయంగా, ఆనందం లేకుండా, ఆదాయం లేకుండా, మైలు రాయిలా, మొద్దు నిద్రలో మునిగి వుండేవాడే.

పోటీ. పెద్ద పోటీ. ఆపోటీలో గెలుపొందాలని ఎంత సాహసానికి ఒడిగట్టారో! ఎంత ముందుకు సాగిపోయారో!

ఆనాడు, టెన్‌సింగ్ ప్రభృతులు ఎవరెస్టు సిఖరాన్ని, ఎట్టకేలకు, అధిరోహించారన్న వార్త నాలో నాకే ఆశ్చర్యం, ఆనందం— ఒకసారి 'అబ్బ'! అన్న నిట్టూర్పు— 'అమ్మయ్యో' అన్న ఆశ్చర్యం నాలో కల్గించాయి. కాని అంతలోనే నాలో ఉవ్వెత్తున ఉత్సాహ కెరటాలు పొంగి పొర్లాయ్.

మహోన్నత శిఖరాన్ని మానవుడు జయించాడు. జయపతాకను ప్రతిష్ఠించాడు. ప్రశంసలు, పూల వర్షంలా కురిసాయ్. దేశ దేశాలా, ఖండ ఖండలా, కీర్తి ప్రతిష్ఠలు— కస్తూరిలా అలుముకున్నయ్, అఖిల ప్రపంచంలో ఆనంద కిరణాలు. ఆహ్లాద జ్యోతులు. ఆశాజీవులకు హారతులు........

ఇదే ఆలోచన. ఇదే ఆదర్శం, నాలో పరీక్ష వ్రాసుకోవాలన్న పట్టుదల ప్రత్యక్ష మయింది. ఎన్నో ఆశలు నాలో అదృశ్యమైపోయి. నిరాశా నిస్పృహలు నాట్యం చేస్తున్న సమయంలో.. ఈ చల్లని వార్త— అదే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించారన్న రేడియో వార్త, ఆశను మొలకెత్తించింది.

మెదడులో మెదిలిన ఆలోచన— పెదవులపై మంద హాసం... అన్ని సార్లు డింకీలు కొట్టినందుకు, నలుగురూ నవ్వడం, గుస గుసలు;.... ఇంట్లో ఈసడింపులు.... నన్నట్లా "మొద్దులా" చేసాయ్. మొద్దుబారిన మెదడు... మనశ్శాంతి లేని జీవితం... నా అమూల్య కాలం, ధనం, శ్రమ, శక్తి సర్వనాశనమైపోతుంటే. నాలో నిరాశ నృత్యం చేయదా?

చేసింది. బాగా చేసింది. కాని ఆ నిట్టూర్పు. ఆ ఆలోచన. మళ్ళీ నూతన భావాలు, నవచైతన్యం కల్గించి. కునుకు తీయకుండా, కుమిలి పోకుండా, కన్నీరు కారకుండా, చేశాయ్.

పరీక్ష పోవడమంటే ఎవరెస్టు శిఖరనుంచి పడిపోవడమన్నమాట. పరితపిస్తే ఫలితంఏముంది?

ఎవరెస్టు శిఖరం నా కళ్ళ ముందుంది. అదే నాలోని ఆశ. ఆరని ఆశ. ఆశాజ్యోతిలా ముందుంది. ఆ కాంతిలో, కళ్ళు తెరిచి చదివాను. బాగా చదివాను.

చివరికి ఆనాడు పరీక్ష ఫలితాలు ప్రకటించబడ్డాయ్. ఆత్రుత ....ఆవేదన....గుండెలు గుభేలు గుభేలు మంటున్నాయ్. వణకుతున్న చేతులతో పేపరు పేజీలు త్రిప్పి. ఫలితాలు చూస్తుంటే. కాళ్ళు దడ.... కళ్ళు చీకట్లు క్రమ్మాయ్. నిదానంగా చూస్తున్నా, ఎంతసేపటికీ, ఎక్కడ నా నెంబరు కన్పించకపోతే, చటాలున కూర్చొని, పేపరు చూడబోతుంటే. ప్రక్క నున్న మిత్రుడు "ప్యాస్! ప్యాసయ్యావురా" అంటూ దభాలున నా వీపు మీద ఒక చరుపు చరిసే సరికి, ఆనంద భాష్పాలతో, ఆలింగనం చేసుకున్నా వాడ్ని; ఉక్కిరి బిక్కిరై పోతున్న ఉత్సాహ ఉద్వేగాలతో.

కొద్ది క్షణాలకు 'అబ్బ?' అన్న నిట్టూర్పు, 'అమ్మయ్య!' అన్న ఆనందం నన్ను పశపర్చుకొని, వగర్చుకొంటున్నా, వడివడిగా ఇంటికి తీసుకొచ్చాయ్.

పొంగిపోతూ, అందరికీ అనేకసార్లు "ప్యాసయ్యాను. నేను ప్యాసయ్యాను" అని మురిసిపోతూ చెప్పాను.

అందుకే ఇప్పుడు నాలో గర్వం. నలుగురిలో తలెత్తుకొని సగర్వంగా నడుస్తున్నా. నాలో జీవం పోసిన ఎవరెస్టు శిఖరాన్ని ఎన్నటికీ మర్చిపోలేను' ఎలా మర్చిపోగలను?

అందుకే పీడితులూ, పరాజితులూ, మున్మాటికీ "ఎవరెస్టు" శిఖరాన్ని మర్చిపోకూడదు. ఇప్పుడు 'ఎవరెస్టు' ఎక్కినట్లే తల్చుస్తాను. అంతేకాదు 'ఎవరెస్టు' పేరు తల్చుకొని, నాలో నేనే. ఇప్పుడు నవ్వుకుంటుంటాను. ఎందుకా.... హ్హి ...హ్హి.... అందుకేనండీ.

ఉరుములు - మెరుపులు

"పార్లమెంటు సభ్యులు యోగాభ్యాసము చేస్తున్నారట." పత్రికా వార్త.

ఢిల్లీలో యోగాభ్యాసానికి వాతావరణ బాగున్నది కాబోలు.

మున్ముందు ఒక మహా సంక్షోభం రానున్నదనే భీతి నేటి ప్రపంచాన్ని ఆవరించివున్నది" — ప్రపంచ బౌద్ధ మహా సభలో

ఈ విపత్తును అదిగమించటానికి ఇప్పటి నుంచీ కొన్ని కమిటీలు ఏర్పరచాలి. ఒక నిధికూడా ఆరంభించాలి.

"రాజధానిలో మాట్లాడితే ఒక మహాసభ జరుగుతోందనీ. ఇవి ఇట్లా జరగకుండా కొంత అదుపు అవసరమని నెహ్రూ అన్నారు"— పత్రికా వార్త

దీనికి విరుగుడు వినే వారికన్నా మాట్లాడేవారు ఎక్కువగా విజృంభించటమే. కె. ల. ర.

షేక్స్పియరు కథ :

రోమియో ★ జూలియట్

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

వెరోనోలోని ముఖ్య కుటుంబాలు కేప్యులెట్లు - మంటాగోలు. ఆ కుటుంబాలు రెంటికిని చిరకాలమునుండి వైరమే. వీరిమధ్య ఎప్పుడూ ఏదో ఒక తీవ్రమైన కలహాలు జరుగుతూనే వుండేవి. పట్టి ఘర్షణలే కాకుండా చీటికి మాటికి చెయ్యికూడా చేసుకొనేవారే. ఆఖరుకి ఆ కుటుంబాల నౌకరులు సహితము ఏ బజారులోనో, రోడ్డుమీదో ఎదురైతే సంఘర్షణో ఒకటి జరుగకుండా వుండేది గాదు.

ఒకరోజు కేపులెట్టు పెద్దయజమాని ఒక పెద్ద విందు చేశారు. ఆ విందుకు అనేకమైన ప్రభువులను చక్కని స్త్రీలను ఆహ్వానించిరి. దేశములోని సుందరాంగులందరినీ విందులో చూడవచ్చును. మంటేగో కుటుంబములోని వారు తక్క మిగిలిన వారందరు ఆహ్వానింపబడిరి, విందుకు వచ్చేవారందరినీ బ్రహ్మాండముగా ఇంటిలోనికి ఆహ్వానిస్తూ వారిహోదాలకు తగినట్లు ఆసీనులను చేయుచుండిరి. ఈ విందుకు రోజలైనుకూడ ఆహ్వానింపబడెను. మంటెగో కుమారుడైన రోమియోకు రోజలైను ప్రియురాలు. రోమియో మిత్రుడు బినోనోనియో అనువాడు. ఈవిందుకు ఎట్లయినను మారువేషము వేసుకొనైనను తన మిత్రుని వెళ్ళమని బలపరచెను — కారణము ఇచ్చట దేశములోని అందకత్తెలనందరినీ చూచిన పిదప తన ప్రియురాలు రోజలైన అందచందాల వివరములతో తన చెవులు చిల్లులు పడునట్లు వినుకించుట మానుకొనుననియే. రోజలైను తనను ప్రేమించకపోయినను రోమియోకు ఆమె దేదీప్యమానమైన దేవకన్యకగా కనపడుచుండుటచే సర్వకాల సర్వావస్థల యందు రోజలైను అందచందాల వివరాలతో విసుగించుచుండెను. చిట్టచివరకు విందుకు వెళ్ళుటకు సమ్మతించి తన మిత్రుడు బొనవిలో ఇంకొక మిత్రుడు మెరిక్యూషియోలతో కలసి మాస్కుధరించివెళ్ళెను. అప్పటి కాలములో అప్పుడప్పుడు మాస్కుధరించి విందుకు వెళ్ళుట పరిపాటే, వీరిని అందరితోపాటు పెద్ద కాపులెట్ ప్రభువు ఆదరించి ఆసీనులను చేసి అక్కడ జరుగుచున్న నాట్యములలో పాల్గొనమని చెప్పెను. ఆ నాట్యము చేయువారిలో ఒక సుందరాంగి అద్భుత సౌందర్యము రోమియోను దిగ్భ్రాంతి చేసెను. మైమరచి 'ఆహా! ఏమి సౌందర్య'మని గట్టిగా అనెను. ప్రభువు కాపులెట్ మేనల్లుడు టైబాల్టు అనువాడు ఈ మాటలు విని స్వరముచే రోమియోను గుర్తించెను. మంటేగో కుటుంబీకుడు తమ ఇంటి విందులకు వచ్చుట సహింపబడదయ్యె. పరిహాసము చేయుటకే తమ యింటికి వచ్చెనని తలచి రోమియోపై చెయ్యి చేసుకొన వుద్యుక్తుడాయెను. కాని విందు సమయమందు రభస చేసిన తన మేనమామ కోపగించునేమోయని అతి కష్టముతో మానుకొనెను.

రోమియో అతిచతురతతో ఆసుందరాంగితో మాట్లాడు అవకాశము కలిగించుకొనెను. సంభాషణా చాతుర్యముతో ఆమెను నిలిపి సంభాషించుచుండగా ఆమె తల్లి పిలచుటచే రోమియోను విడచి ఆమె వెళ్ళవలసివచ్చెను. ఆపిలచినది క్యాపులెట్ సతి అనియు, తన హృదయ మనోహరి, సుందరాంగి, వారి ప్రియపుత్రిక జూలియట్ అనియు తెలసికొని తాను చాల బాధపడెను. కాని గట్టిగా హృదయములో హత్తుకొనిపోయిన ఆ సుందర స్వరూపాన్ని తుడచివేయలేకపోయినాడు. బాధపడుతూనే ఆమెను ప్రేమింప మొదలిడినాడు. అట్లే జూలియట్ నూ రోమియో ముఖమైన చూడకుండగనే ఆతనిని ఏలనో గాఢముగా ప్రేమింపమొదలిడెను.

అప్పటికే అర్ధరాత్రి సమయమగుటచే రోమియో తన మిత్రులతో సహా ఇంటికి బయలుదేరిరి. కాని బైట కాలు పెట్టగనే తన సొమ్మేదో ఇంట్లో విడచివచ్చినట్లు తోచి రోమియో తన మిత్రులకు తెలియకుండ ప్రహరి గోడదూకి కోశయోలెటు గృహావరణలోనికి ప్రవేశించెను. అచట జూలియట్ సౌందర్యమును గుఱించి ఆలోచించుచుండగనే ఒక కిటికీలోనుండి జూలియట్ సుందర విగ్రహము కనబడెను. చంద్రబింబముకన్నను ఆమె ఎన్నియోరెట్లు ఎక్కువ ప్రకాశవంతముగా కనబడెను. ఆమెను చూచుచు అట్లే నిలబడిపోయెను. ఇంతలో ఆమె ఒక దీర్ఘనిట్టూర్పు

విడచుచు "అయ్యో - నేను" అనెను. ఆహా 'ఏమి సుందరీ - నా దేవకన్య - ఏమిటి చెప్పు నీ మనస్సులోని మాటయని' మెల్లగా రోమియో తనలో తాననుకొనెను. ఇంతలో ఆమె రోమియో అచటనున్నాడని తెలియక 'ఓ రోమియో, ఓ రోమియో నీవెందుకు రోమియో నైతివి? నాకొరకు నీ పేరు విడచి నా ప్రియునివి కావేని నేను ఈక్షణము నుండి కాపులటు వంశీయురాలను కాజాలను" అనెను. ఈమాటలు వినుటతోనే జూలియటు కూడ తనను ప్రేమించుచున్నదని తెలసికొని అపరిమిత ఆనంద సముద్రమున మునిగిపోయెను. జూలియట్ తనలో తానే గట్టిగా రోమియో, మొంటేగో కుటుంబీకుడే లాయెనో, తనకు తన ప్రియునకు ఆకుటుంబ కక్షల వలన ఎట్టికీడు మూడునోయని విధినిదూరెను. ఇట్లామె తన ప్రేమ విరహ విలాపకలాపములు గట్టిగా సాగించుచుండగా రోమియో వీనులు విందుతో హృదయానంద భరితుడగు చుండెను. మెల్లిగా కిటికీ వద్దకు వచ్చి ఆమె కనబడకుండ ఆమెను ఇట్లు వేడుకొనెను. 'నీకే పేరుతో నాపేరు పిలచిన ఆనందమో ఆపేరుతోనే నన్ను పిలువుము. నీవే పేరుతో పిలచినను సరే - నేను ప్రస్తుతము రోమియోను కాదు నీప్రియుడను కావున నీయిచ్ఛవచ్చిన పేరుతో పిలువుము' అనెను. ఈమాటలు, పురుషకంఠము తనకిటికీ వద్దనినగనే జూలియట్కు అపరిమితమైన భయము కలిగెను. 'నీవిచటకేలవచ్చితివి. ఎవరు వెళ్ళమనిరి? ఇచ్చట ఎవరైన నిన్ను చూచితిరేని నీకు మరణము తప్పదు' అని మెల్లిగా అనెను. 'ప్రేమే నాకీవిధానము చూపినది. నిన్ను ప్రేమించి మరణించుటే మేలని' రోమియో అనెను. దానిలో ఆమె భయపడుచూనే రోమియోమీద తనకు కలిగిన ప్రేమను తెలపెను. రోమియో తనివి తీర ఆమాటలు వినుచుండగనే గంటలు క్షణములవలె గడచిపోయెను. తూర్పున చీకట్లు తొలగుచుండెను. తెల్లవారుచున్నదని తెలసికొని చాల భయపడి చిట్టచివరకు రోమియో జూలియటును వదలివెళ్ళెను. తెల్లవారగనే అతనికి ఎచ్చటకు రావలసినది కబురు బంపెదనని అనిర్ణీత స్థలములో కలసికొని వివాహము చేసికొని తరువాత తన నాథునితో పాటు ఆవిశాల ప్రపంచములో ఎచ్చటకయిన బయలుదేరి వెళ్ళవచ్చునని యామె చెప్పెను.

రోమియో అప్పటికైన ఇంటికి మరలి విశ్రాంతి తీసుకొనక తన మిత్రుడు ఫ్రయరు లారెన్సు యుండు ఆశ్రమమునకు వెళ్ళెను ఇంత తెల్లవారుతూనే రోమియోను చూచి ఆమతగురువు ప్రేమ బాధతో నిద్రపోలేదు కాబోలునని తలచెను. కాని రోమియో తన క్రొత్త ఆరాధదేవత జూలియటు సంగతి చెప్పి ఆనాడే తనకు ఆమెకు వివాహము చేయు ఏర్పాట్లు చేయుమని అనేక విధముల ప్రార్థించెను నిన్నటివరకూ రోజలేను అందాన్ని శ్లాఘించిన చిన్నవాడు నేడు జూలియట్ సౌందర్యలాలసుడగుట ఆశ్చర్యము కలిగించి హృదయాల్లోగాక యువకులకు కండ్లలో ప్రేమ అవతరించునుగదాయని ఆలోచించ సాగాడు. కాని రోమియో తన వివాహ ఏర్పాటు చేస్తానని ఒప్పుకునే వరకు ఆయనను వదలలేదు.

జూలియటు పంపిన వార్తాహరుడు రాగానే తన ఏర్పాట్లను ఆమెకు తెలియచేసి లారెన్సు సహాయముతో ఆయన ఎదుటవారికి న్యాయబద్ధముగ వివాహము జరిపెను వెంటనే జూలియట్ తన ఇంటికి వెళ్ళెను. రోమియో తిరిగి ఆరాత్రికి తన కిటికీ దగ్గరకు వచ్చెదనని వాగ్దానము చేసెను. ఆదినము మధ్యాహ్నము రోమియో స్నేహితులు బెన్‌వోలియోను మర్క్యూషియోను రాజమార్గమున వెళ్ళుచుండగా టైబాల్టువారిని చూచి రాత్రి కోపమింకను ఉపశమింపకుండుటచే వారిపై చెయ్యిచేసుకొనెను. ఇంతలోకే అచ్చటకు రోమియోకూడ వచ్చెను. మర్క్యూషియోకు బలమైన గాయము తగిలెను. రోమియో తన మిత్రుని చంపినందులకు కినసి టైబాల్టును చంపెను.

వెంటనే న్యాయస్థానమందు న్యాయ విచారణ జరిగెను. వెంటనే రోమియో వెరోనా నగరము విడచి వెళ్ళవలసినదిగా తీర్పు చెప్పబడెను.

కొద్ది గంటలమాత్రమే మధురమైన వాతావరణలో యున్న ఆవధువు జూలియట్ ఈ విషాదవార్త విని చాల ఖేదపడెను. రోమియో ఈ సంఘటన తరువాత లారెన్సు ఆశ్రమము చేరి అచ్చట పిచ్చివానివలె ప్రేలుచుండెను. తాను వెరోనా పట్టణము విడచి ఎట్లు వెళ్ళుదునని తల పీకుకొనుచు అరచుచుండెను. అప్పుడు ఆమతగురువు తన మిత్రుని మీద అధికమైన జాలితో కర్మ సిద్ధాంతమును

తెలియపర్చుమ ఓదార్చ జూచెను. కాని రోమియో వేదాంత వాక్యములు విను స్థితిలో లేడు. ఇంతలో జూలియటు వద్దనుండి కబురు వచ్చెను. అదృష్టవశాత్తు టైబోల్టు చనిపోయెను. కాని ఆమల్ల యుద్ధములో నీవే చనిపోయి యుండెడివాడివే. పైగా న్యాయమూర్తులును నీమీద ఎక్కువ కఠినమైన శిక్ష బదులు నీకు దేశాంతర వాస శిక్షమాత్రమే కదా విధించిరి. రాత్రికి వెళ్ళి జూలియట్‌ను కలుసుకొని ఆమెకు వీడ్కోలు చెప్పి, తెల్లవారక మునుపే వెరోనా పట్టణము వదలి మంటోవా నగరమునకు వెళ్ళి అక్కడ నివసించుచుండుము. సమయము వచ్చినపుడు మీ వివాహ విషయము ఎల్లరకు తెలియ చేసెదను. అప్పుడు మీ ఇద్దరి తల్లిదండ్రుల వంశములలోని కలతలు తగ్గించుకొని మీకు సుఖము తప్పక కలిగింతురు! అని రోమియోకు సలహా ఇచ్చెను. రోమియో అట్లేననెను. జూలియటు వద్దనుండి వర్తమానములు జాబులు ఎప్పటి కప్పుడు తనకు పంపెదనని లారెన్సు వద్ద వాగ్దానము గైకొనెను.

ఆరాత్రి రోమియో క్రిందటి రేయి వలెనే ప్రహరీ దూకిలోని ఆవరణలోనికి వెళ్ళెను. తన భార్య జూలియటు కిటికీ వద్దలేదు. కాని మరగున వున్న ద్వారము నొకదానిని తెరచి తన భర్తను లోనికి పిలుచుకొని పోయెను. రాత్రం తయు కంటికి కూరుకు లేక ప్రేమ పాశములు వల్లెవేసు కొనిరి. కొద్ది క్షణములలోనే రేయెల్ల కడచిపోయినట్లుం డెను. కాకులు కూయనారంభించెను. తెల్లవారు చున్న దను తెలివితో దుఃఖరేఖలు ఇద్దరి మొఖమున పొడ సూపెను. భారమైన దుఃఖముతో హృదయా వేదనతో రోమియో తన ప్రేయసిని విడచి వెళ్ళెను. త్వరత్వరగా వెరోనా పట్టణముకూడా విడచి వెళ్ళెను.

ఈ ప్రపంచములో కొందరి జీవితములు సుఖమయము. కొందరి జీవితములు దుఃఖమయము. ఏక్షణమున ఈజంట కన్నులు మనసులు కలసినవో ఆవేళావిశేషమేమో వారికి అప్పటినుండే శాంతిలేదుకదా అన్ని విషాదచ్ఛాయలే!

ఈవిషాద సంఘటన తరువాత కొన్నిదినములకు జూలి యటు తండ్రి ఆమె వివాహమును పేరిసు ప్రభువుతో నిర్ణయించెను. ఈవిషయము తెలిసికొని భయపడి పరిపరి విధముల తండ్రిని ప్రాధేయపడి తనకిష్టము లేదని వివాహము వలదనియు మరి ఆ వేళ ఇతర కారణములు చెప్పియు, ఆ వివాహ ప్రయత్నము తప్పింప చూచెను. కాని ఆమె తండ్రి అవన్నియు స్త్రీ సహజపు సిగ్గుసిరులని భ్రమపడి వివాహ ప్రయత్నమునకు వలయు అన్ని ఏర్పాట్లను చేయుటకు సన్నిధుడాయెను.

ఇంక చేయునది లేక జూలియటు తన విశ్వాస పాత్రుడైన ధర్మ స్నేహితుడగు లారెన్సును సలహా నడిగెను.

ఆవేదాంతి జూలియటును ఇంటికి వెళ్ళి పేరిసు ప్రభువును వివాహము చేసుకొనుటకు సమ్మతించమనెను. అట్లు చేయుటకన్న మరణమే శరణ్యమనెను. అప్పుడు ఆ మతగురువు చిరునవ్వు నవ్వి - పోయి తాను చెప్పిన ప్రకారము పారిసు ప్రభువును వివాహము చేసుకొనుటకు వప్పుకొనమనెను. ఆమె చేతిలో ఒక చిన్న సీసానిచ్చి దానిని ఆరాత్రికి తీసుకొనమనెను. అది తీసుకొనిన మర ణించినట్లు పడిపోవుదురనియు, మర్నాడు వివాహ సమయ మునకు పెండ్లికుమారుడు కళ్యాణ గృహమునకు వచ్చు నప్పటికి తాను మరణించినట్లు పడియుండుననియు అప్పుడు తనని ఆదేశ ఆచార ప్రకారము పాడె మీద శ్మశాన వాటికకు తీసుకొని వత్తురనియు తన దేహము తెచ్చినవారు వెళ్ళిపోయిన పిదప అనగా సరిగా ఔషధము సేవించిన 42 గంటలకు తెలివి వచ్చుననియు అప్పటికి రోమియో అచ్చటికి వచ్చునట్లు చేయుదుననియు తరువాత ఇద్దరు తమ ఇచ్చవచ్చిన చోటకు వెళ్ళి సుఖముగా నుండవచ్చుననియు చెప్పెను. ఈ వుపాయము చాల బాగున్నదని తలచినను కొద్దిగా భయపడినది. కాని పేరిసు ప్రభువును వివాహ మాడకుండ తప్పించుకొనుటకు రోమియోను చేరుటకు వేరొక ఉపాయము తోచక ఇదియే గతియని తలచి ఆయన వద్ద ఆ సీసా తీసికొని ఆయన చెప్పిన ప్రకారమే చేసెద నని చెప్పి ఇంటికి వెళ్ళెను.

మార్గ మధ్యమునే పేరిసు ప్రభువును కలుసుకొనెను. ఆయనను వివాహమాడుటకు అంగీకారము తెలిపెను. వెంటనే వాయువేగముతో ఆయన వెళ్ళి ముసలి క్యాపు లెటు దంపతులకు తెలిపెను. వారు మిక్కిలి అలజడితో వివాహ సన్నాహము ఏర్పాట్లు మరింత ఉత్సాహముతో

చేతుల మీదుగా మహా వైభవముగ జరుగదగిన వివాహముకు వలయునన్ని ఏర్పాట్లు మహావేగముగా, ఆడంబరముగా జరుగుచుండెను.

ఆదినము బుధవారము. సూర్యాస్తమయమగుచున్నది. ఇంతలోనే జూలియటు మనసులో పెద్ద ఆందోళనతుఫాను చెలరేగినది. తను ఆమందు త్రాగిన నిజముగా మరణించితే తన ప్రియుడైన రోమియో గతి ఏమగునో లేక నలువది నాలుగు గంటకు పూర్వమే తనకు తెలివివచ్చిన, అప్పటికి రోమియో రానియెడల తనేమి చేయవలెను. తనని అశ్మశాన భూమిలో వదలి వెళ్ళినప్పుడు పిశాచములు వచ్చి రాలు పట్టుకొని హింసించితే? ఇట్లా అనేకవిధముల ఆలోచించుచూ దుఃఖించుచూ, ఏమని చూచుచూ తన అదృష్ట మెట్టిదోయని ఆలోచించెను. దిక్కు తోచలేదు. ఆ ఔషధము సేవించుటే తరుణోపాయమని ఔషధము త్రాగి పడక మీదవ్రాలెను. తెలివి తప్పెను.

గురువారముదయము మేళతాళాలతో మంగళ వాద్యములతో పెండ్లికొడుకు వేసవజాముననే జూలియటు గృహమునకు వచ్చెను. ఆనిర్జీవ జూలియటు ప్రతిమను చూచి పేరిసు ప్రభువు నిర్జీవుడాయెను. ఆమెకై విలపించెను. తన దురదృష్టమును తిట్టుకొనెను. వివాహమునకు కావలసిన పురోహితుని బదులు అంత్యక్రియలకొరకు పురోహితుని పిలిపింపవలసివచ్చెను. ఇంటిలో వివాహమునకు చేయు ఏర్పాట్లన్నియు అంత్యక్రియలకు మరలింపవలసివచ్చెను.

శుభవార్తలకన్న దుఃఖవార్తలు శీఘ్రముగా చేరును కదా! ఫ్రైయరు లారెన్సు బంపిన వార్త చేరకముందే రోమియోకు జూలియటు మరణవార్త తెలిసెను. ఆహా ఏమి సృష్టివైపరీత్యము. తానొకటి తలచిన దైవమింకొకటి తలచునుగదా జూలియటు మరణ వార్త వినగనే ఒక రహస్య స్థలమునకు పోయి కొద్దిగా ఒక చిట్కా విషమును కొని దానిని భద్రముగా దాచికొని విరోనాకు బయలుదేరెను అచ్చట చివరిసారి తన భార్యను కళేబరమునైన చూచి ఆ విషమును రోమియో నచ్చటనే సేవింపదలచెను. తాను వెంటనే బయలుదేరెను గనుక లారెన్సు బంపిన వార్త తనకు అందనేలేదు. రోమియో శ్మశానమునకు చేరునప్పటికి అచట పేరిసు ప్రభువును చూచెను. (ప్యారిసు ప్రభువును పట్టి బందీ చేసి జూలియటు కొరకు తెచ్చి జూలియటును తనతోనే సమాధియందుంచెను) వారిద్దరు కత్తి కత్తి దూసికొని జూలియటు కళేబరమునకు సమీపమునే పడిరి.

జూలియటుకు తెలివి వచ్చు సమయము వచ్చినది. లారెన్సు బంపిన వార్త రోమియోకు అందలేదని తెలిసి తానే జూలియటు కళేబరము నద్దకు వెళ్ళెను. అప్పుడే జూలియటు లేచెను. ఇంతలో ఎవ్వరి సందడియో విని లారెన్సు అచటినుండి వరాదైను. జూలియటు రోమియో చేతిలో కప్పు చూచెను. ఆ కప్పుతో ఏదో విషము త్రాగి మరణించెనని తెలిసికొనెను. ఆ కప్పులో ఇంకా కొద్దిగ విషమున్న తనుకూడా త్రాగవచ్చునని చూచెను. కాని అందు లేక పోయెను. వెంటనే సమీపమున నున్న ఒక ఖడ్గము తీసి దానితో తనను తానే పొడుచుకొని చంపుకొనెను. రోమియో ప్రక్కనే వ్రాలి మరణించెను.

ప్రేమజీవుల విపరీతగాథ!

మంటేగో ప్రభువు వంశము కాప్యులిట్ ప్రభువు వంశము ఈ వార్తలు విని చాలా దుఃఖించిరి. వారిని ఇది నరకు కన్నా ఒకరి నొకరు ఈ విషాద గాథకు కారకులని దూషించుకొనిరి. వారి వైరము మరింత పెరిగెను.

అప్పుడు లారెన్సు వారందరి సమక్షంలో రోమియో జూలియటుల ప్రేమగాథ వివాహము తెలిపెను. రెండు వంశముల వారును వారి బిడ్డలతో పాటు తమ వైరమును ముగించుటకు నిశ్చయించుకొని ప్రేమ పూర్వకముగ క్యాపులెటు ప్రభువు మంటేగు ప్రభువు కౌగలించుకొనిరి. తమ బిడ్డల జీవితములాహుతైన తరువాత వారు కోడలి స్మారక చిహ్నముగా ఆమె విగ్రహము నొకదానిని బంగారుతో చేయించి విరోనా పట్టణములో ప్రతిష్టింప చేసెను క్యాపులెటు తన అల్లుని విగ్రహము చేయించి ప్రతిష్టి చేసెను అంతటితో వారి వైరములు రూపుమాసెను.

కాని పాపము రోమియో జూలియట్ల జీవితము అట్లు విషాదముగ ముగిసెనుగదా! ఆ ప్రేమజీవుల ప్రేమగాథ అమరగాథయై మనకందరికీ చిరస్మరణీయ మైనది.

(లేంబ్ షేక్సుపియరు కథకు అనువాదను) ప్రతినెలా సుప్రసిద్ధ ఆంగ్లరచయిత కథవిదైన అనువాద మిచ్చుట ప్రకటింప దలచాము)

సంక్షేమం



ఈ అనుబంధంలో

ఆంధ్రరాష్ట్ర సంఘ సంక్షేమ సలహాసంస్థ నాల్గవ సమావేశము, ఆంధ్ర రాష్ట్ర సంక్షేమ విస్తరణ ప్రణాళికా కార్యదర్శుల (కన్వీనర్లు) మొదటి మహాసభ సంయుక్తంగా డిసెంబరు 15 వ తేదీన గుంటూరులో జరిగింది. మహాసభను ప్రారంభోత్సవం చేసిన ఆంధ్ర ప్రధాన న్యాయమూర్తి శ్రీ కోకా సుబ్బారావుగారి ఉపన్యాసంలోని ముఖ్యాంశాలు!

"స్వార్థత్యాగానికీ, పరోపకారానికీ స్వతస్సిద్ధంగా తగినవారు స్త్రీలు"

—శ్రీ కోకా సుబ్బారావు

సంఘసేవ అనేది నేడు క్రొత్త విషయమేమీకాదు. సృష్టి ఆదినుండీ ఉన్నదే. ప్రతివాని హృదయ కుహరంలోనూ నిగూఢంగా ఈ భావం ఉంటూనే ఉంటుంది. తన అవసరాలను తీర్చుకుని, తన కుటుంబీకులకు సహాయం చేయటం, క్రమంగా ఈ సహాయాన్ని సంఘంలోని ఇతరులకు విస్తరింప చేయటం మానవసహజం. ఈసేవా కార్యక్రమమును దేశమంతటా విస్తరింపజేయుటయే సంఘ సంక్షేమ సంస్థయొక్క వుద్దేశం. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తినైన నన్ను ఈసమావేశ ప్రారంభోత్సవం చెయ్యటానికి ఆహ్వానించటంలో, ఈ సంస్థకు ఎట్టి రాజకీయాలతోగాని, మతకుల సిద్ధాంతాలతోగాని, సంబంధాలు లేక కేవలం సంఘ సేవయే పరమావధిగా ఎంచుకుంటున్నట్లు ఋజువుచెయ్యటం జరిగిందన్నమాట.

సంఘ సేవాతత్పరులు కొద్దిపాటి అవధులను దాటి, విశ్వమానవ కల్యాణానికి, సమస్త మానవుల శ్రేయస్సుకూ పాటు పడుతున్నారు. ఇటువంటి లోకశాంతి మన పురాణాల్లో విస్తారంగా పొగడబడింది. భగవద్గీతలో ఫలాపేక్ష రహితంగా సత్కర్మ చెయ్యమని చెప్పబడింది. తన స్వార్థం కోసం తనుపాటు బడటమే పరమావధి కారాదు. స్వయం సహాయంలో స్వార్థం, త్యాగం ఇమిడి ఉన్నవి. మనం కొంత త్యాగం చేస్తే తప్ప, ఇతరుల కేమీ సహాయం చేయలేము. ఇట్టిస్వార్థత్యాగానికీ, పరోపకారానికీ స్వతసిద్ధంగా తగినవారు స్త్రీలు. తల్లులు తమ సుఖాన్ని త్యాగంచేసి, తమ పిల్లల శ్రేయస్సుకై తహతహ లాడుతారు. సంఘంలో విద్యావంతులైన స్త్రీలు ముందుకు వచ్చి ఈ సంఘ సంక్షేమ కార్యక్రమాలను జయప్రదంగా నిర్వహించ వలసి ఉంటుంది.

ఈ విషయంలో ప్రజలకున్న బాధ్యత అపారం. ప్రజల సహకారం లభించినప్పుడే ప్రభుత్వకృషి పూర్తిగా ఫలిస్తుంది. కాని ప్రజలు తామెంతో ఘనకార్యం చేస్తున్నామనీ, ఎవరినో ఉద్ధరిస్తున్నామనీ భావం పెంచుకోరాదు. దీనులయెడల తమ విధ్యుక్త ధర్మం నెరవేరుస్తున్నామనే భావంతో వారితో కలిసిమెలిసి, వారి కష్టసుఖాలలో భాగం పంచుకుంటూ సంఘ సేవ చెయ్యాలి. సంఘసేవను అనేక విధాలుగా చెయ్యవచ్చు. నిరాశ్రయులకు ఇళ్ళుకట్టించవచ్చును. కుష్టు, గుడ్డి, మొదలైన వారికి వైద్యసహాయం కలిగించవచ్చును. ఈ సేవాకార్య క్రమంలో ఉదారులు, స్వార్థరహితులు అయినవారి పూర్తి సహకారం అవసరం. మన ఆంధ్ర దేశంలో ఇటువంటి వారు ఎందరో ఉన్నారు. సంఘసేవా కార్యక్రమాలకు ప్రజల పూర్తి సహకారం లభిస్తుందని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను.

ఇతర దేశాలతో పోల్చి చూస్తే మనదేశం ఎంతో వెనుక బడిఉన్నది. మనదేశంలో దరిద్రం తాండవిస్తున్నది. అజ్ఞానం చాలా ఎక్కువగా వుంటోంది. జన సంఖ్య రోజురోజుకూ పెరిగి పోతున్నది. చిన్నతనంలోనే అనేక రోగాలకూ, దురలవాట్లకూ గురైన వారు ఎందరో ఉన్నారు. వైద్య సహాయం తక్కువ. లేమి లేకుండా చెయ్యటానికి ప్రభుత్వం చెయ్యగలిగిన దంతా చేస్తున్నది. కాని ప్రభుత్వం మాత్రమే ఏమీ చెయ్యలేము. ప్రజల సహకారంతో యీ సంఘ సంక్షేమ కార్య క్రమం జయప్రదం కాగలదని ఆశిస్తున్నాను.

ఆంధ్రరాష్ట్ర సాంఘిక సలహా సంస్థ

నాల్గవ సమావేశము

ఆంధ్రరాష్ట్ర సాంఘిక సంక్షేమ ప్రణాళికల జిల్లా కన్వీనర్ల ప్రథమసమావేశము గుంటూరు.

ఆంధ్రరాష్ట్ర సంఘ సంక్షేమ సలహా సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి చన్నఘంటమ్మగారి ఉపన్యాస ముఖ్యాంశములు.

సర్వతంత్ర స్వతంత్ర ప్రజా స్వామ్యానికి అనుకూలంగా లిఖించబడ్డ మన రాజ్యాంగ చట్టంలో, శ్రేయో రాజ్య స్థాపనకు అవసరమైన సూత్రాలు కొన్ని పేర్కొనబడ్డాయి. స్త్రీ పురుషులకు సమాన హక్కులు; సమాన ప్రతిపత్తి. సమాన ఉద్యోగార్హతలు కల్పించడం, ప్రజల యొక్క ఆరోగ్యం, పిల్లలయొక్క సంక్షేమం, వృద్ధుల సంరక్షణ, తమ బాధ్యతలుగా గుర్తించి పరి పాలించడం ప్రభుత్వము యొక్క లక్ష్యాలుగా యీ సూత్రాలలో సూచించ బడ్డవి.

పై సూత్రాలను అమలు జరిపే నిమిత్తం, 1950 లో ప్లానింగ్ కమిషను నియమింప బడ్డది. ఈ కమిషనువారు తయారు చేసిన ప్రథమ పంచవర్ష ప్రణాళికకు కాగల 2244 కోట్ల మొత్తము వ్యయములో. 5 వ వంతు-అనగా 400 కోట్ల రూపాయలకు పైగా. సంక్షేమ కార్య క్రమాలు—విద్య, ఆరోగ్యం, నిరుద్యోగ నివారణ, వెనుకబడ్డ జాతుల ఉద్ధరణ. గృహనిర్మాణం. కార్మికుల సంక్షేమం యిత్యాది కార్య క్రమాలకు కేటాయించ బడ్డది.

సాంఘికసేవ అనేది "పరోపకారమిదం శరీరం" అన్న మన హిందూ దేశంలోగాని, హైందవ సాంప్రదాయంలోగాని క్రొత్త విషయాలుకావు. దానం, ధార్మికచింతన పారంపర్యంగా మన జాతిలో వ్రేళ్ళుపాతుకుని ఉన్నప్పటికీ. కారణాంతరాల వల్ల, సాంప్రదాయాను బంధంగా సాంఘిక కార్య క్రమాలు విస్తరించ లేక పోయాయి. అక్కడక్కడ కొందరు ప్రత్యేక వ్యక్తులు, కొన్ని ప్రత్యేక సంస్థలు, బ్రహ్మసమాజమ్, రామక్రిష్ణమిషన్, దివ్యజ్ఞానసమాజం, క్రైస్తవమిషన్లు. యిత్యాదిముఖ్యంగా మత సంబంధంగా, ఏర్పడ్డ సంస్థలు, తదుపరి రాజకీయాలకు అనుబంధంగా, ఏర్పడ్డ రాష్ట్ర సంస్థలు. దీనుల దారిద్ర్యం తొలగించడానికి. దీనులకు విద్య చెప్పడానికి. దరిద్రుల రోగ నివారణకు కృషిచేస్తూ వచ్చాయి. స్వచ్ఛందంగా యిట్లా ఏర్పడి. సేవా కార్య క్రమాలు సాధిస్తున్న యిలాంటి అనేక సంస్థల సహకారాన్ని పొందుతూ, వారి కృషిని ఒక నిర్ణీతమైన పంథాలో వినియోగించుటకై తగిన ప్రోత్సాహము, తగుమాత్రము ఆర్థిక సహాయము యిచ్చిన పక్షంలో. ప్రభుత్వపు బాధ్యత కొంత తగ్గి ఆశయాలు త్వరలోనే ఫలించే అవకాశాలుండుననే నమ్మకంతో, కేంద్ర సాంఘికసంక్షేమ సమితి. ఆగస్టు 15-1953 లో శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గారి ఆధ్వర్యాన అవతరించింది. ఒక వంక ప్రభుత్వ ప్రాతినిధ్యం, ఒక వంక స్వచ్ఛంద సేవికా సేవకుల ప్రాతినిధ్యం గలిగి, ప్రభుత్వానికి అనుబంధమైనప్పటికీ, స్వతంత్రంగా వ్యవహరించే టటువంటి యీ సంస్థయొక్క కార్య ప్రణాళికకై, ప్రథమ పంచవర్షపు ప్రణాళికలో 4 కోట్లరూపాయలు కేటాయించ బడ్డవి.

శిశు సంక్షేమం, స్త్రీ సంక్షేమం, వికలాంగుల సంక్షేమం, బాలనేరస్థుల సంస్కరణ, యీ కార్య క్రమాలకు క్రేంద సాంఘిక సమితి ప్రాముఖ్యతనిస్తుంది. ఆదిలో, ఈ సమితి నియమించిన ఉపసంఘాలు, దేశం మొత్తం మీద పర్యటించి. స్వచ్ఛంద సేవాసంస్థలు కొనసాగించుచున్న సేవాకార్య క్రమాలను పరిశీలించి. కేంద్ర సమితికి పంపిన సిఫారసులనుసరించి, యిప్పటివరకు రమారమి 1000 సంస్థలకు. కేంద్ర సమితివారు, విరాళాలనిచ్చి. జరుగుచున్న కార్యక్రమ అభివృద్ధికి సూచనలిస్తూ ప్రోత్సహించారు. ఆంధ్ర దేశంలో ఇంతవరకు 74 స్వచ్ఛంద సంస్థలకు $2\frac{1}{2}$ లక్షలకు పైగా యీ విధంగా ధనసహాయం అందజేయ బడ్డది. సంస్థల నిర్వహణకయ్యే వ్యయ

ములో 15000 లకు మించని సగము గ్రాంటును యీయ డానికి కేంద్రసంస్థ ఏర్పాటు చేసింది.

ఇంకా ఎక్కువ సంస్థలకు యిలాంటి ప్రోత్సాహ మిచ్చుటకు, అనువైన చోట్ల క్రొత్త సంస్థలు కూడ ఏర్పా టగునట్లు ప్రజలలో ఉత్సాహము కలిగించుటకు, గ్రామాల్లో సంక్షేమ కార్య క్రమం విస్తరించే ప్రణాళికలను అమలు జరుపుటకు—ఒక్కొక్క రాష్ట్రములో ఒక్కొక్క సలహా సమితి ఏర్పాటు చేసింది. ఈ సలహా సమితిలో కూడ ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వ ప్రతినిధులు, అనుభవముగల స్వచ్ఛంద సేవా కార్య కర్తలు ఉన్నారు. మన ఆంధ్ర రాష్ట్రానికి యీ రోజున సమావేశమైన.... ...

శ్రీమతి రామసుబ్బమ్మ. }
కోటమ్మరెడ్డి — } ప్రభుత్వ ప్రతినిధులు
బుచ్చికృష్ణమ్మ ...—
శ్రీ రాఘవరావు.

లేడీ వెంకటసుబ్బారావు — రాలేదు.
శ్రీ టి. నటరాజన్ } - రాలేదు.
కుమారి జె. జమునాబాయి } ఉద్యోగస్తులు.
శ్రీమతి ఎ. సి. కృష్ణరావు.

ఇదిగాక, జిల్లాలలో విస్తరణ కార్య క్రమాలను అమలు జరిపే నిమిత్తం, ఒక్కొక్క జిల్లాలో ఒక్కొ క్క జిల్లా కార్యవర్గం ఏర్పాటు చేయబడ్డారు—స్థానికంగా పలుకుబడి, స్థానికసేవా కార్య క్రమాలలో అనుభవం, పరిచయంగల వ్యక్తులు యిందు సభ్యులుగా నియమింప బడ్డారు- D. M. O, D. P. O, A. O- ఇందు ప్రభుత్వ ప్రతినిధులు, ఇచ్చట సమావేశమైన జిల్లాప్రతినిధులు. ఈ రాష్ట్ర సలహాసమితి, జిల్లా కార్య వర్గాలు, గత జూలై నుండి నియమింప బడ్డవి—

రాష్ట్రసమితి సభ్యులు, వ్యష్టిగాను, సమిష్టిగాను పర్య టించి గత ఐదు మాసాల్లో ఒక 60 సేవా సంస్థలను దర్శించారు. అక్టోబరులో జరిగిన రాష్ట్ర సమితి మూడవ సమావేశంలో, 50 సేవా సంస్థలనుండి గ్రాంటులకై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వారి సిఫారసులను కేంద్ర సమితికి పంపించారు.

ఇప్పుడు ప్రారంభమైన నాల్గవ సమావేశంలో — సమా రమి75 దరఖాస్తులు పరిశీలించబడుతాయి.

ఇంక సంక్షేమ విస్తరణ కార్యక్రమ బాధ్యత వహిం చిన జిల్లా కార్యవర్గాలు ఎంతో ఉత్సాహంగా పని ప్రారం భించి, ఆగష్టు 15 వ తేదీకల్లా ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క ప్రాజెక్టు ప్రారంభించారు. ప్రథమ పంచవర్ష ప్రణాళికలో, దేశం మొత్తంమీద 350 ప్రాజెక్టులు ప్రారం భించి, జరిపించాలని - కేంద్ర సమితివారి ఆశయం-ఆంధ్ర రాష్ట్రానికి ఇందు 17 ప్రాజెక్టులు కేటాయింపబడ్డాయి. ఒక్కొక్క ప్రాజెక్టు ఒకజిల్లాలో, ఒకటి రెండు తాలూకా లకు సంబంధించిన 20, 30 గ్రామాల ప్రజలకు, అంటే 30, 40 వేల జనాభాకు, సంక్షేమం అందజేస్తుంది. జిల్లా కార్యవర్గంవారు ప్రప్రథమంలో వెనుకబడియున్న గ్రామాలలో పర్యటించి, గ్రామస్థులతో ప్రసంగించి, వారి అవసరాలను అర్థం చేసుకుని యిక్కడ ఒక కేంద్రాన్ని స్థాపిస్తారు. ఇల్లాంటి కేంద్రాలు, ఒక్కొక్క ప్రాజెక్టు ఆవరణలో 5కు తగ్గకుండానూ, 7కు మించకుండానూ ఏర్పాటు చేయబడతాయి. అంటే ఒక్కొక్క సంక్షేమ కేంద్రం- సుమారు నాలుగైదు పల్లెల ప్రజలకు- ఉపయోగ పడుతుంది రెండు సంవత్సరాలు యీ ప్రాజెక్టు నిర్వహిం చడానికి, సుమారు 50000/- వ్యయమౌతుందని, అందు సగభాగం— కేంద్రసమితి, కాలు భాగం రాష్ట్ర ప్రభుత్వం, మిగతాది గ్రామ ప్రజలు భరించవలెనని పథకముయొక్క స్వరూపం—పర్యటనకనువైన ఒక జీప్‌ను ప్రతి జిల్లాకూ కేంద్రసమితి యిచ్చియున్నది.

ఆంధ్ర దేశంలో, గ్రామ ప్రజలు ఎక్కడ కోరినా ప్రసూతి కేంద్రమె. గ్రామాల్లో వైద్యసహాయమన్నది పూర్తిగా శూన్యంగా ఉన్నది. అందు ముఖ్యంగా, గర్భిణీ స్త్రీలకు వైద్య సహాయం లేక, ప్రమాదదశలో ఒక్కొక్క మారు 40 మైళ్ళవరకూ, బండిమీదనో, చేతులమీదనో వేసుకొని వచ్చే పరిస్థితి ఎన్నో గ్రామాలో కలుగుతూ వుంది. అందువల్ల, ప్రసూతి కేంద్రాల ఏర్పాటుకే, మన జిల్లా ప్రాజెక్టులలో ప్రాముఖ్యత యీయబడినది. దాని కనుబంధంగా పిల్లలకు పాలు పోయుట, ఆటలు పాటలు నేర్పుట, పరిశుభ్రత నేర్పుట, యిటువంటి కార్యక్రమం కూడా చాలా కేంద్రాలలో ఏర్పాటు చేయబడ్డది.

గుంటూరు జిల్లావారు- ఇప్పటికి 6 ప్రసూతి కేంద్రాలు స్థాపించారు. 19 వ తేదీన పసపర్లలో మరియొకటి స్థాపించబోవుచున్నారు. ప్రజలు అమిత వుత్సాహంగా, యీ స్థాపనకు తమ సహాయాన్నిస్తున్నారు. ఎన్నో

గ్రామాల ప్రజలు తమ గ్రామాల్లో యిల్లాంటి కేంద్రాలు ఏర్పాటుచేయమని జిల్లా కార్యవర్గాన్ని కోరడం, ప్రాథేయపడి, నిరుత్సాహంతో తిరిగివెళ్ళడం కూడా సంభవిస్తూవుంది.

అయితే అన్నీ ప్రసూతి కేంద్రాలుగా ఉండవలెనని నిర్ణయించలేము. శిశు సంరక్షణ, శిశు విహారములు నెలకొల్పుట, వికలాంగులకు, వృద్ధులకు, వృత్తిని కల్పించడం, అంటువ్యాధులతో బాధపడేవారిని ఇండ్లనుండి వేరు చేసి, తగిన వైద్యాలయాలకు పంపించడం- యిలాంటి కార్యక్రమాలు కూడ యీ ప్రణాళికలో చేరినవేను. రాజమండ్రి- రాజానగరంలో, వికలాంగులకు, వృద్ధులకు, వృత్తి కేంద్రాన్ని స్థాపించి, వారికి భోజనం, వస్త్రములు యిస్తున్నారు. ఈ విధంగా, ఒక్కొక్క జిల్లాలో 3,4,5 కేంద్రాలు స్థాపించి, యీ నాల్గు మాసాలుగా జిల్లా కార్యవర్గంవారు కృషి చేయుచున్నారు. ఎండనక, వాననక ఇసుకలో, బురదలో, దారిలేని అడవులలో, పర్యటించి, దూర దూరాన ఉన్న గ్రామాల్లో యీ కేంద్రాలను స్థాపించి, నిర్వహించుచున్న జిల్లా కార్యవర్గంవారి ఉత్సాహం, పట్టుదల చాలా అభినందించదగియున్నవి.

రాష్ట్ర సలహాసమితి 3–వ సమావేశం కర్నూలులో జరిగినప్పుడు శ్రీ ప్రకాశం పంతులుగారు, గాంధీజీ సూచించిన నిర్మాణ కార్య క్రమం సంఘ సంక్షేమానికి ప్రాతిపదిక"యని ఉద్ఘాటించారు. "గ్రామపునర్నిర్మాణానికి గాంధీజీ అనుచరులు దారి చూపించారు. కమ్యూనిటీ ప్రాజెక్టు, నేషనల్ఎక్స్టెంట్షన్ సర్వీసులుమున్నగునవి అధికోత్తత్త్వం. రోడ్లు వంతెనల నిర్మాణాన్ని స్వయంసమృద్ధి గ్రామాల్లో సాధించుటకు ఏర్పాటైనాయి. అందువల్ల, కేంద్రసమితివారు తలపెట్టిన సంక్షేమ విస్తరణ ప్రణాళిక సకాలంలోనే ప్రారంభించ బడ్డవి. గ్రామాల్లో ప్రారంభమైన అభివృద్ధి ప్రణాళికలకు, ఇవి ఒక పరిపూర్ణ మైన స్వరూపాన్ని కలిగిస్తుంది." అని బాబూ రాజేంద్రప్రసాద్ గారు నవంబరులో ఢిల్లీలో జరిగిన సలహాసంఘ అధ్యక్షుల మహాసభలో ఉపన్యసించారు.

"సంక్షేమవిస్తరణ ప్రణాళికల వలన మానవజీవితాలలోని కొరతలను కొంతవరకూ తగ్గించ గలిగినా, సంపూర్ణ సమగ్రజీవితానికి మరికొన్ని అవకాశాలు కలిగించగలిగినా, మానవసంబంధ బాంధవ్యాలలో కొంత సమన్వయం తీసుకురాగలిగినా, సంపూర్ణ సంక్షేమరాజ్య స్థాపనవైపు, మనం మరొక మెట్టు ముందుకు సాగినట్లే" అనిన శ్రీమతి దుర్గాబాయిగారి వచనాలు— ఆంధ్రదేశంలో జరుగుచున్న కృషిని చూచినప్పుడల్లా జ్ఞప్తికివచ్చి, మనకు కొంత తృప్తిని కలిగిస్తూ వుంటాయి.

నవంబరులో ఢిల్లీలో జరిగిన రాష్ట్ర సమితుల అధ్యక్షుల సమావేశంతో, కేంద్ర సంక్షేమ సమితి ఒక నూతన ఘట్టానికి చేరుకోగలిగిందని చెప్పాలి. స్వచ్ఛంద సహకారంతో జరుపబడుచున్న యీ సంక్షేమ కార్యక్రమం — యీనాడు ఎన్నో నూతన, అవకాశాలను ప్రజలకు కల్పిస్తూవుంది. ఇంతకు పూర్వము స్థాపితమై కృషిచేయుచున్న సంస్థలకేగాక, క్రొత్తగా స్థాపింపబడే సంస్థలకు, నిర్వహణకేగాక, గృహనిర్మాణానికి కూడా, గ్రాంటులు యిచ్చుటకు క్రొత్తగా నిర్ణయింపబడ్డవి. విద్యా ప్రచారానికి, సంచారవైద్యానికి ఉపయోగించ డానికి ఒక మోటారు వాన్ ను సంస్థలకు దానంచేయడానికి కూడా నిర్ణయించింది. వృద్ధులకు, నిరాశ్రయులకు ఆశ్రయము, కార్మికస్త్రీల శిశువులకై క్రెచీలు. కుంటి గ్రుడ్డిమూక మొదలగు వికలాంగులకు విద్యాలయాలు, వసతి గృహాలు, బాల్యనేరస్థులకు అనువైనవసతి, విద్యాలయాలు, ఆనాధశరణాలయాలు, ప్రసూతి కేంద్రాలు—ఎక్కువగా స్థాపించుటకు ప్రోత్సాహమివ్వ వలెనని నిర్ణయించింది. ఆడఖైదీల బిడ్డలకు తాత్కాలిక వసతి గృహాలు, విడుదలైన ఖైదీలకు ఉద్యోగము కల్పించుటకు, విడుదలైన బాల్యనేరస్తులకు వృత్తి కల్పించుటకు, సహకార కర్మాగారాలు, మంత్రసానులు, దాయిలు, ఆర్గనైజర్లను తర్ఫీదుచేసే శిక్షణ పాఠశాలలు- ఇట్టి సంస్థల నిర్వహణకు ఎక్కువ ప్రోత్సాహ మిచ్చుటకుకూడ నిశ్చయించింది. పట్టణాల్లో ఉండే మధ్యతరగతి స్త్రీలకు తమయింటనుండి చేయగల పనిని నేర్పించి తన్మూలంగా, కొంత ఆదాయం కల్పించడానికని, పెద్ద నగర సంక్షేమ పథకాలు కూడా ప్రారంభించ డానికి నిశ్చయించింది. ఢిల్లీలో ఈ సంస్థ పరిముఖంగా ప్రారంభింప బడుచున్న అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ దీనికొక ఉదాహరణ 500 కుటుంబాల స్త్రీలకు ఇది వారి యిండ్లలోనే వృత్తిని కలిగించగలదని అంచనా.

ఈవిధంగా సంక్షేమ కార్యక్రమాన్ని విస్తృతంచేస్తూ మానవునికోసమున్న సేవాశక్తిని సమీకరిస్తూ, స్వచ్ఛంద

గుంటూరు సమావేశము

సేవాదళాన్ని దేశం మొత్తంమీద ఆయత్త పరుస్తూ, ఒక ఆదర్శమైన శ్రేయో రాజ్యాన్ని స్థాపించడానికి ప్రభుత్వానికి చేదోడుగా నిలపడమే కేంద్ర సమితి ఆశయం.

విషయం విస్తృతంగా చెప్పి మీకందరికీ కాలయాపన చేసితినేమోనని భయపడుచున్నాను. తమ అమూల్యమైన కాలంలో కొద్దిభాగం యీ కార్యక్రమానికని ఒసంగిన ప్రధాన న్యాయమూర్తికి, సమావేశమైన అతిథులకు నా కృతజ్ఞత తెలియజేయుచున్నాను. మీ ఆశీర్వాదములతో, సహకారముతో మేము తలపెట్టిన కార్యక్రమం దిగ్విజయంగా విస్తృతమై, ప్రజామోదాన్ని బడయగలదని ఆశిస్తున్నాను. కార్యక్రమ నిర్వహణలో ఉత్సాహము చూపుచున్న రాష్ట్ర సభ్యులకు, జిల్లా కార్యవర్గాలకు, ప్రజా బాహుళ్యానికి, కావలసిన ప్రచారమిచ్చి సహకరిస్తున్న పత్రికా నిర్వాహకులకు, నా ధన్యవాదాలు.

పుష్పవర్షం



ఇది బౌద్ధవాఙ్మయం నుంచి గ్రహించిన కథ: తథాగత తన పద్మసింహాసనమున సుపవిష్టుడై యుండి, తన శిష్యులకు బౌద్ధ మత సారాంశము బోధించుచుండగా, విమల కీర్తి యొక్క ప్రస్తుత శరీరం వేసలి నగరమున రోగగ్రస్తమైఉన్నదని తెలుసుకుంటాడు. ఆయన మంజుశ్రీనీ, బోధిసత్వానీ, తన శిష్యులినీ పంపిస్తాడు. ఈయన్ని గురించి విచారించడానికని. సువాసనా లోకంలో పూలను గురించి శ్రద్ధ తీసుకుంటున్న దేవకన్యను కూడ అక్కడకు పంపిస్తాడు పూలు విరజిమ్మడానికని. తథాగత ఆజ్ఞానుసారం ఆమె తన పూల పరిచారికలను వెనుక నిడుకొని వేసలికి బయలుదేరుతుంది. వీరు సుమేరు, పుటోషాన్, ఇంకా యితర దివ్య స్థలాలమీదనుండి యెగిరి వెళ్ళి వేసలి నగరంలో విమలకీర్తి, మంజుశ్రీ, తదితరులు బౌద్ధ మతాన్ని గూర్చి చర్చించుచున్న సమయానికి చేరుకుంటారు. ఆమె వారిపై పూలు వర్షించి, పడమటి దిశగా తిరిగిపోతుంది.—

—చైనీస్ బ్యాలట్‌లోని సన్నివేశం.

ఇండియాలో కుటుంబ సంక్షేమ కృషి

—— :o: ——

డాక్టర్ మిస్ జి. ఆర్. బెనర్జి.

(బొంబాయి టాటా సాంఘిక శాస్త్రపాఠశాలాధ్యాపకులు)

కుటుంబం విశిష్టమైన సంఘానికి పునాది. మానవుల మధ్య సుహృద్భావ సంబంధాలు పెంపొందాలంటే, దానికి అవసరమైనదికూడా కుటుంబమే. కనుకనే కుటుంబంలోని క్లిష్టసమస్యలకు, వ్యక్తిగతమైన చిక్కులకు గల సంబంధాలకు యిటీవల అత్యధికమైన ప్రాధాన్యం యివ్వబడింది.

కుటుంబానికి సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారానికి వేర్వేరు సంస్థలు నెలకొల్పబడినవి. వీటి ప్రధాన లక్ష్యం కుటుంబ సంక్షేమమే కనక కుటుంబసంక్షేమ సంస్థలుగానే యివి తరుచుగా పరిగణింపబడుతున్నవి. ఈదృష్టితో చూస్తే ప్రసూతి, శిశు రక్షణ కేంద్రంకూడా తల్లి బిడ్డల ఆరోగ్యావసరాలను తీర్చడానికే కృషి చేస్తుంది కనక యిది కూడా కుటుంబ సంక్షేమ సంస్థే కాగలదు. చిక్కులలోవున్న కుటుంబాలకు ఆర్థిక సహాయంచేసే సంస్థలకు కూడా ఈ సూత్రం వర్తిస్తుంది.

అయితే, పైన పేర్కొన్న సంస్థలు చేసేకృషి కుటుంబ సమస్యలలో ఒక భాగం మాత్రమే. ఉదాహరణకు ఒక కుటుంబాన్ని తీసుకొందాం. భర్త నిరుద్యోగి. భార్యకు జబ్బుగావుంది. పిల్లవాడు బాల నేరస్థుడై వుంటాడు. ఎంప్లాయిమెంటు బ్యూరో భర్తకు ఉద్యోగం మాత్రమే సమకూర్చగలదు. ఆసుపత్రి భార్యకు చికిత్స చెయ్యాలి. సంక్షేమ సంస్థలేవీ మొత్తంయొక కుటుంబం సమస్యలను గమనించవు. అయితే కుటుంబ సంక్షేమ సంస్థ అయితే మొత్తం కుటుంబాన్నే ఒక వర్గంగా తీసుకొని, వ్యక్తిగతంగా కుటుంబసభ్యుల అవసరాలను తీర్చడంద్వారా మొత్తం సమస్యను పరిష్కరించడానికి పూనుకొంటూ వుంటుంది.

ఈ సంస్థ అనేక సమస్యలను ఏవిధంగా పరిష్కరించ గలదు ? ఒక ఎంప్లాయ్‌మెంటు బ్యూరోను, ఒక ఆసుపత్రిని, ఒక బిడ్డల రక్షణ కేంద్రాన్ని కూడా ఈ సంస్థ నిర్వహించవలసివుంటుందా ? అక్కరలేదు. ఇతర సంస్థలతో సహకరించడం ద్వారానే ఈ సమస్యలను పరిష్కరించగలుగుతుంది.

కుటుంబ సంక్షేమ సంస్థలో సాంఘిక సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శిక్షణ పొందిన సంఘసేవకు లుంటారు. తమ సమస్యలను స్వయంగా పరిష్కరించుకొనలేని వారికి, తత్పరిష్కారంలో వీరు తోడ్పడుతూ వుంటారు. కుటుంబ సంబంధాలపైన, తలిదండ్రులకు, పిల్లలకు గల సంబంధాలపైన యజమానికి - పనివానికి గల సంబంధాలపైన ఈ సంస్థ సలహాలిస్తూ వుంటుంది. ఈ సంస్థలోని సంఘ సేవకుడు ప్రజలకు తగు సలహా లివ్వగల నిపుణుడై వుంటాడు.

కుటుంబానికి చెందిన ఏదో ఒక సమస్యపై సలహాకోసమే కుటుంబ సంక్షేమ సంస్థ సలహాను కోరినప్పటికీ, మొత్తం కుటుంబ సమస్యలో భాగంగానే భావించి సంస్థ పరిశీలిస్తుంది. రోగ చికిత్స పొందడంలో అశ్రద్ధచేసిన సందర్భాలు, భార్యాభర్తల మధ్య సామరస్యం లేకపోవడం, నిరుద్యోగం, పిల్లల చదువు వంటి సమస్యల విషయంలోకూడా కుటుంబం కోరికలకు, పరిస్థితులకు అనుగుణంగా సహాయం చెయ్యబడుతూ వుండగలదు.

సాంఘిక సమస్యల కృషి మన దేశంలో ప్రారంభ దశలోనే వున్నందున యిందుకు కృషిచేసే సంస్థల సంఖ్య ప్రస్తుతంలో తక్కువగానే వున్నది. ఏ సమస్యనైనా మొత్తం సమస్యలదృష్ట్యా పరిశీలించి, వ్యక్తిగతంగా పరిష్కారానికి తోడ్పడే సంస్థ ఒక్కటీ లేదు. కుటుంబ సంక్షేమ సంస్థ మనదేశంలో ఓం ప్రథమంగా 1950 మే నెలలో బొంబాయిలో నెలకొన్నది. ఈ కృషి ఆవశ్యకతను గుర్తించిన కొందరు ప్రముఖులు దీనికి పూనుకొన్నారు. ఎన్. ఎం. వాడియా ధర్మసంస్థ, అమెరికన్ విమెన్స్ క్లబ్, సర్ దొరాబ్జీ తాతా ట్రస్ట్, అఖిలభారత సాంఘిక మహాసభ, మున్నగువాటి సహాయ సహకారాలతోను, కొందరు హితైషులు కానుకగా యిచ్చిన కుర్చీలు బల్లలు సమకూర్చగా ఈ కుటుంబ సంక్షేమ సంస్థ ఏర్పడ్డది. సుశిక్షితుడైన ఒక సంఘ సేవకుడు ఉద్యోగిగా నియమించ బడ్డాడు.

కుటుంబ సంక్షేమం

బొంబాయి మదర్స్ అండ్ చిల్డ్రన్స్ వెల్‌ఫేర్ సొసైటీ ఈ సంస్థ కార్యాలయాన్ని 10 బి డి.డి చాల్, డెలిస్లి రోడ్ లోని తమ భవనంలోనే ఏర్పాటు చేసుకొనడానికి అనుమతించింది. జాతి మత వివక్షత లేకుండా అవసరంవున్న వారందరు ఈ సంస్థ సహాయం పొందే అవకాశం కలిగించబడింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆసుపత్రులు, బాల్య నేరస్థులను విచారణచేసే న్యాయస్థానాలు, శిశు సంరక్షణ కేంద్రాలు, ప్రయివేటుగా వ్యక్తులు కోరే సలహాలను యిస్తూ వుంటుంది. కొంత మంది ఈ సంస్థతో తామే సరాసరిగా వ్యవహరిస్తూవుంటారు. పెండ్లికాని తల్లులకు, బాల నేరస్థులకు వసతి వసతి కల్పించవలసిందని, అటువంటి వారిని పెద్దైనా పెంచుకొనడానికిగల అవకాశాలను పరిశీలించవలసిందని దాంపత్య జీవితంలో దంపతులమధ్య ఏర్పడివున్న వైమనస్యం తొలగించవలసిందని, అంతరంగిక సమస్యలపై సలహా ఈయవలసిందని, ఆసుపత్రులనుంచి విడుదల పొందిన కొందరి విషయంలో తర్వాత జాగ్రత్తకు, అనారోగ్య సమస్యలకు తగు ఏర్పాట్లు చెయ్యవలసిందని అనేకమంది సలహాలను కోరుతూ వుంటారు.

సలహాకోరి వచ్చే వ్యక్తి తన పరిస్థితిని తాను సమగ్రంగా గ్రహించగలగడానికి. తన అనిశ్చిత స్థితిని విడిచి, ఒక నిశ్చయానికి రాగలగడానికి తన సమస్యల పరిష్కార విషయంలో ఎదుర్కొంటున్న చిక్కులనుగురించి చెప్పుకొనడానికి ఈ సంస్థకు చెందిన సంఘ సేవకుడు తోడ్పడతాడు.

కుటుంబ సమస్యల పరిష్కారంలో వ్యక్తి జీవన పరిస్థితులలో ఏర్పడ్డ చిక్కులను తొలగించడానికి, తగ్గించడానికి, తన స్వశక్తి చేతనే తగు విధంగా ఆ చిక్కులను సవరించుకొనడానికి, సంస్థ సంఘ సేవకుడు సహాయపడతాడు. ఈ సమస్యలను ఒకదాని తరువాత మరొకటిగాగాని, ఏకకాలమందే గాని ఆ సమస్య తీరునట్టి తత్పరిష్కారానికి చర్య తీసుకొంటుంది. కొన్ని సందర్భాలలో సంస్థ చిక్కులోవున్న వ్యక్తినిగాని, కుటుంబం సభ్యులనుగాని సంప్రతిస్తుంది. ప్రత్యేక సహాయాలను చేస్తుంది.

సలహా లివ్వవలసినసందర్భాలలో కొన్ని సమయాలలో సంస్థ సహాయాన్ని అర్థించిన వ్యక్తితో కలిసి పని చేయవలసి వుంటుంది. కొన్ని సందర్భాలలో కుటుంబం సభ్యులతోనే సంప్రతించి, వారు ఆ సమస్యపట్ల తమ వైఖరిని మార్చుకొనడంలో తోడ్పడుతుంది. అభ్యర్థికి, అతని కుటుంబానికి సహాయం చేసే సందర్భంలో సంస్థ పాఠశాలల, ఆసుపత్రుల, ధార్మిక సంస్థల తోడ్పాటును ఆర్థిక సహాయం, ఉద్యోగం చూసిపెట్టడం, ఏకాలు అయినా తీసివేయబడిన పరిస్థితిలో కృత్రిమమైన కాలును ఏర్పాటు చెయ్యడం వంటివి కుటుంబ సమస్య పరిష్కారానికి తోడ్పడగలవు. ప్రతి సమస్యను సంస్థ పరిష్కరించిన తర్వాత కూడా తర్వాతి జాగ్రత్తకు తగు చర్య తీసుకొని ముగిస్తుంది.

పరిష్కారానికి సమ్మతి సహాయం పొందిన వ్యక్తి తిరిగి చిక్కుల నెదుర్కొనదనే హామీని సంస్థ యివ్వజాలదుగదా! అయితే సంస్థనుంచి సహాయం పొందిన అనుభవాన్ని బట్టి కొందరు ఆ తర్వాత ఎదురైన చిక్కులను ధైర్య, విశ్వాసాలతో పరిష్కరించుకోగలరని, పరిస్థితులు విషమించకుండానే సంస్థ సహాయాన్ని కోరగలరని ఆశించవచ్చు.

కుటుంబ సమస్యల పరిష్కారంలో తోడ్పడడానికి, గృహజీవన విధానాలను ఉద్బోధించడానికి, విచ్ఛిన్నమైన కుటుంబాల సముద్ధరణకు ఇండియాలోని వేర్వేరు ప్రాంతాలలో కుటుంబ సంక్షేమ సంస్థలను ఏర్పాటు చెయ్యవలసిన ఆవశ్యకత ఎంతైనాకలదు. ఏ సమస్యనైనా మొత్తం కుటుంబం సమస్యగా భావించడం, ఆ సమస్య ఫలంగా ఏర్పడ్డ చిక్కును వారించడం, అది తిరిగి సంభవించకుండా చూడడం వంటి చర్యలద్వారా కుటుంబసమస్యలను తగ్గించడం, కుటుంబాలు విచ్ఛిన్నమైపోకుండా కాపాడడం ఈ కుటుంబ సంక్షేమ సంస్థలకు కర్తవ్యం కాగలదు.



కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ

ఇంతవరకు జరిగిన కృషి

శ్రీమతి ఎం. రంగనాయకిగారు

ప్లానింగ్ కమిషన్ సిఫారసుపై కేంద్ర సంక్షేమ సంస్థ ఏర్పడి అప్పుడే ఏడాది దాటింది. స్త్రీలు, శిశు సంక్షేమానికి దేశంలో పాటుపడుతూన్న స్వచ్ఛంద సంస్థలను తోడ్పడడమే కేంద్ర సంక్షేమ సంస్థ ప్రధాన లక్ష్యం. స్వచ్ఛంద సేవ చేస్తున్న సంస్థలకు యింతవరకు ప్రభుత్వ సహాయం అంత ఎక్కువగా అందడంలేదు. ఏ దేశానికైనా సాంఘిక, ఆర్థిక, సంస్కృతి రంగాలలో యిటువంటి సంస్థలు కీలక స్థానంగా వుండవలసిందే. ప్రజల సాంఘిక, ఆర్థిక శ్రేయస్సుకి తోడ్పడే ఈ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఇంత ప్రాధాన్యమివ్వడం సర్వవిధాల సమంజసమౌతున్నది.

కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ స్వతంత్ర నిర్ణయాధికారంకల సంస్థ. స్వచ్ఛంద సంఘ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పార్లమెంటు ఉభయ సభల ప్రతినిధులు దీనిలో సభ్యులు. ఈ సంస్థకు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారు అధ్యక్షులు. సాంఘిక సంక్షేమ సాధనకు కేంద్ర ప్రభుత్వం నాలుగు కోట్ల రూపాయలు ప్రత్యేకించింది. బహు కొలది కాలంలోనే తనకు గల స్వయం నిర్ణయాధికారావకాశాన్ని పురస్కరించుకొని, కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ అపూర్వాభివృద్ధిని సాధించింది.

దేశంలోని సంఘ సంక్షేమ సంఘాలకు కేంద్ర సంస్థ మాచింగ్ పద్ధతిని ద్రవ్య సహాయం చేస్తున్నది. ఇప్పటికి 1520 సంస్థలు ద్రవ్య సహాయానికి దరఖాస్తు చెయ్యగా 1008 సంస్థలకు కేంద్ర సంక్షేమ సంస్థ సహాయం చేసింది. ఏసంస్థకైనా కేంద్ర సంస్థ గ్రాంటు రూపంలో సహాయం చెయ్యడగు గరిష్ట మొత్తం 15,000 రూపాయలు. కేంద్ర సంఘ సంక్షేమ సంస్థ అజమాయిషీలోనే ఈ సహాయం సమకూర్చబడుతూ వుంటుంది.

దేశంలోని వేర్వేరు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని స్థానిక సమస్యలను పరిశీలించడానికి కేంద్ర సంఘ సంక్షేమ సంస్థ పంపిన నిపుణులు, సంఘ సేవకులు ప్రతిరాష్ట్రంలోను స్థానికావసరాలను తీర్చడానికి సంక్షేమ సలహా సంఘాలు ఏర్పాటు చెయ్యడం అవసరమని సూచించారు. సంక్షేమ విస్తరణ ప్రణాళికల నిర్వహణకు కేంద్ర సంక్షేమ సంస్థ నిర్ణయానికి ఈ సూచన అనుగుణంగా వున్నందువల్ల 1954 ఏప్రిల్ నుంచి రాష్ట్రీయ సంఘ సంక్షేమ సలహా సంఘాలు ఏర్పాటు చెయ్యబడ్డాయి.

దేశంలోని 27 రాష్ట్రాలలోను సంఘ సంక్షేమ సలహా సంఘాలున్నాయి. ఈ సలహా సంఘాల ఏర్పాటు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంప్రదించి జరుగుతూ వుంటుంది. వీటిలోని సభ్యులను రాష్ట్రీయ ప్రభుత్వాలు, కేంద్ర సంక్షేమ సంస్థ నియమిస్తూ వుంటాయి. కేంద్ర సంక్షేమ సంస్థ రాష్ట్రీయ ప్రభుత్వాలు కలసి ఈ సంఘాలకు అధ్యక్షులను ఎన్నుకొంటాయి. [illegible] అధికారి, [illegible] రాష్ట్రీయ సంక్షేమ సలహా సంఘాలకు కేంద్ర సంక్షేమసంస్థ ఆర్థికంగాను, సాంకేతికంగాను సహాయం చేస్తూవుంటుంది.

కేంద్ర సంక్షేమ సంస్థ బాధ్యత ఈ కార్యభారం ఏకేంద్రీకృతం చెయ్యబడడంతో ముగియలేదు. గ్రామ ప్రాంతాలలో సంక్షేమ విస్తరణ ప్రణాళికల నిర్వహణకు కేంద్ర సంక్షేమ సంస్థ పూనుకొన్నది. ఈ ప్రాజెక్టుల నమలు జరపడంలో రాష్ట్రీయ సంఘ సంక్షేమ సలహా సంఘాలు అత్యంత ముఖ్యమైన బాధ్యతను నిర్వర్తిస్తూ వున్నవి. గ్రామ ప్రాంతాలలోని ప్రజల సంక్షేమాన్నే లక్ష్యించే యీ సంక్షేమ విస్తరణ కార్యక్రమాలకు కమ్యూనిటీ ప్రాజెక్టు, జాతీయ విస్తరణ కార్యక్రమాలు ఒక్కటే కాకుండా చూడడానికి ఎక్కువ జాగ్రత్త వహించబడుతుంది.

సంక్షేమ విస్తరణ ప్రణాళిక 15 నుంచి 20 దగ్గర దగ్గరగా వుండే గ్రామాలకు — సుమారు 20,000 జనాభాగల వాటికి అనువర్తించబడుతూవుంది. ఇది బహుళార్థ సాధక

మైనది. స్త్రీలు, బిడ్డలు, దుర్బలుల సంక్షేమ సాధనకిది యుద్దేశించబడింది. మహిళా సేవకులు దీనికై తమకాలాన్ని పూర్తిగా వినియోగిస్తారు వీరికి స్వచ్ఛంద సేవకులు కొంత కాలం వినియోగించి సాయపడుతూవుంటారు.

ప్రతి ప్రాజెక్టుకు సుమారుగా 50,000 రూపాయలు ఖర్చు కాగలదని అంచనా వెయ్యబడుతుంది. కేంద్ర సంక్షేమ సంస్థ దీనిలో సగం భరిస్తుంది. మిగిలిన సగం రాష్ట్రీయ ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు భరిస్తాయి. సంస్థల సేవకుల ప్రయాణ సౌకర్యాలను కేంద్ర సంక్షేమ సంస్థ ఏర్పాటు చేస్తుంది. ఏ తరగతి రాష్ట్రాలలో 17 ప్రాజెక్టులు, బి తరగతి రాష్ట్రాలలో పది ప్రాజెక్టులు, సి తరగతి రాష్ట్రాలలో ఐదు ప్రాజెక్టులు తలపెట్టబడ్డాయి.

పెక్కు రాష్ట్రాలలో సంక్షేమ సలహా సంఘాలు కార్యక్రమాలు ప్రారంభించాయి. రాష్ట్రీయ సలహా సంఘాలకు, ప్రాజెక్టు ప్రాంతాలకు చెక్ గ్రాంటు పంపించబడ్డాయి.

352 ప్రాజెక్టుల నిర్వహణకు కేంద్ర సంక్షేమ సంస్థ తలపెట్టగా అప్పుడే 130 ప్రాజెక్టులు స్వాతంత్ర్య వార్షిక దినోత్సవంనాడు, గాంధి జయంతినాడు ప్రారంభించబడ్డాయి. మొత్తంమీద దేశంలోగల 329 జిల్లాలలోను ఈ ప్రాజెక్టులు జిల్లాల వారిగా ప్రారంభించబడ్డాయి. ఇంకా 23 ప్రాజెక్టులు ఆ తర్వాత నిర్వహించడానికై అట్టేపెట్టబడ్డాయి.

పట్టణ ప్రాంతంలోని తక్కువ రాబడిగల స్త్రీల కోసం ఢిల్లీలో కేంద్ర సంఘ సంక్షేమ సంస్థ కుటుంబ సంక్షేమ కృషి సందర్భంగా ఒక పైలట్ ప్రాజెక్టును తలపెట్టింది. ఒక అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ నిర్మాణం ఈ సందర్భంలో చాల మట్టుకు పూర్తి అయింది. ఈ సంవత్సరాంతంలోగానే ఫ్యాక్టరీ పని ప్రారంభం కావచ్చు.

విస్తృతమైన ఈ కృషి సందర్భంగా ప్రచారం కోసం వేర్వేరు రాష్ట్రాలలోని సంక్షేమ సంఘాల తమ తమ అభిప్రాయాలను తెలుపుకోవడం కోసం 'సోషల్ వెల్ఫేర్' అనే మాస పత్రిక ప్రకటనకు కేంద్ర సంస్థ సంపాదకవర్గం తగు చర్య తీసుకొంటోంది. దేశ భాషా పత్రికలలో ఇంగ్లీషు పత్రికలోని వ్యాసాలు ప్రచురణకు కూడా ఏర్పాట్లు గావించబడుతున్నవి.

కేంద్ర సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయ్ దేశ్ ముఖ్ గారి ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ విషయాలపై రెండు ప్రమాణ గ్రంథాలను ప్లానింగ్ కమిషన్ తయారు చేస్తున్నది. ఈ రెండు గ్రంథాల సంయుక్త సంపాదక వర్గానికికూడా శ్రీమతి దుర్గాబాయ్ దేశ్ ముఖ్ గారే అధ్యక్షులు.

Andhra Mahila Sabha

NURSING HOME

(Report for November '54)

Department		No. of Cases
Out-Patient Department	...	2,216
In-Patient Department	...	139
Delivery cases	...	55
Free distribution of milk to children	...	1350

All the patients treated and Maternity aid given as shown above are very poor people from the slum areas in the neighbourhood and no fees are charged from them.

Forty one women are at present receiving training as Midwives and Nurses.

దాసీలుగా బ్రతుకుతున్న స్త్రీలు

శ్రీమతి పద్మినీసేన్ గుప్త



"స్త్రీలు! కార్మిక సంక్షేమం" శీర్షికపై పెక్కు వ్యాసాలు వ్రాస్తున్న శ్రీమతి పద్మినీసేన్‌గుప్త కార్మికవృత్తిలో జీవించే స్త్రీల దైనందిన జీవనంపట్ల ఎంతో శ్రద్ధాసక్తులుకల విదుషీమణి. 1945 నుంచి 1953 వరకు ఇండియన్ జూట్ మిల్స్ అసోసియేషన్‌లో లేబర్ ఆఫీసరుగా పనిచేసినపుడు ఆమిల్లుల ప్రాంతంలో పెక్కు ఆసుపత్రులు, క్రీచీలు, పాల కేంద్రాలు, [illegible], క్రీడా కేంద్రాలు, బారక్‌పూర్, టిటాఘర్‌లలో ఏర్పాటు కావడానికి కృషి చేశారు. అక్కడ ఆమె మహిళా సంక్షేమ సంఘాలను కూడా స్థాపించారు. పనిపాటులు చేసి జీవించే స్త్రీల సమస్యలను పరిష్కరించడానికి స్వయంగా కృషి చేశారు.

1901 లో మద్రాసులో ఆమె జన్మించారు. ప్రఖ్యాత పత్రికా రచయిత్రి శ్రీమతి కమల సత్యనాథన్ గారి కుమార్తె ఆమె. ఎం.ఏ పరీక్షలో ఉత్తీర్ణురాలైన పిదప ఆమె పత్రికా రచనలో శిక్షణ పొందారు. అప్పటినుంచీ సాంఘిక సంక్షేమకృషితోపాటు పత్రికా రచనను కొనసాగిస్తున్నారు. "ప్రాచీనభారతంలో దైనందిన జీవితం" (Every day life in Ancient India) అన్న ఆమె రచనను ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్‌వారు ప్రకటించారు. శ్రీమతి పద్మినీసేన్‌గుప్త ఇప్పుడు బెంగాల్ ప్రాంతంలోని యంగ్ ఉమెన్స్ క్రిష్టియన్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలుగా వున్నారు. కలకత్తాకు దగ్గరగా వున్న [illegible] గ్రామ సంక్షేమ కేంద్రం ఆమె ఆధ్వర్యంలోనే నిర్వహించబడుతోంది.

ఉత్తర భారతదేశంలో రెడ్‌క్రాస్ సంస్థకు పెక్కు శాఖలను ఏర్పాటు చేశారు. బెంగాల్ గర్ల్ గైడ్స్ అసోసియేషన్‌కు డిప్యుటీ కమిషనర్‌గా కూడా పనిచేశారు. భారతీయ కార్మిక స్త్రీల శ్రేయోభివృద్ధి [illegible] తీవ్రమైన ఆకాంక్ష ఆమె రచనలలో ప్రతిబింబిస్తూ వుంటుంది. అదే ఆమె రచనలోని [illegible]. అదే ఆమె రచనలోని ప్రత్యేకత [illegible].

* * *

మధ్య తరగతికి కొంచెం తక్కువ శ్రేణికి, సర్వసామాన్య శ్రేణికి చెందిన స్త్రీలు ఏదైనా ఫ్యాక్టరీలో గాని, కర్మాగారంలోగాని కొలువునకు వుండనప్పటికీ ఏవో పనులలో నిమగ్నులయ్యేవుంటారు.

ఒక పాతజనాభా నివేదికలో యీవిధంగా పేర్కొనబడివుంది. "నిరుద్యోగులు శీర్షిక క్రింద చేర్చబడిన వారిలో. పెక్కుమంది నిజానికి వంటపని, నీళ్లుమోయడం, ధాన్యాలు దంచడం, పిల్లల్ని ఎత్తుకోవడం మున్నగు పనులు చేస్తునే ఉన్నారు." ఇటువంటివారంతా 1931 లో 'ఇంటిపనులు చేస్తున్నవారు' అని పేర్కొనబడింది. ఇండియాలో చాలామంది 'ఆయాలు'గా పనిచేస్తున్న స్త్రీలు కలరు. వీరిని 'స్త్రీ కార్మికులు'గా పేర్కొన్నట్లు కనిపించదు. ఈ ఆయాలు, బెంగాల్‌లోని 'ఝీ'లు లేదా 'పనికత్తెలు' లేకుండావుంటే ఇండియాలో ఏమిజరిగి వుండేదా అనుకొంటాను.

1940 లో నేషనల్ ప్లానింగ్ కమిటీ కార్మిక పరిస్థితుల విచారణ సంఘం తన నివేదికలో ఇళ్ళలో పనిచేసే పరిచారికలున్నను వారి సంక్షేమానికి కొన్ని సిఫారసులు చెయ్యడం ముదావహం. వారిరక్షణకు ఏదైనా శాసనం చెయ్యడంలో 'ఇంటి నౌకరులు' అని వాడేటప్పుడు,

వారిలో ఇంటికి సంబంధించిన అన్నిరకాల చాకిరిచేసేవారి నందరినీ కూడా చేర్చటంసిద్ధంది.

విచారణ సంఘం తన నివేదికలో చేసిన సిఫారసులు ఈవిధంగా తెలుపుతున్నాయి. 15 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలు పనిచెయ్యరాదు. నౌకరుకు రాత్రి తొమ్మిది గంటలపాటు విశ్రాంతివుండాలి. పగలు మధ్యాహ్నం ఒంటిగంటనుంచి సాయంకాలం అయిదుగంటలవరకు పని వుండకూడదు. ప్రతీ ఆదివారంపూట సెలవియ్యాలి. నౌకరులు మామూలుగా కుటుంబ జీవితం గడుపుకోవాలి. తగువసతి సౌకర్యం కలిగించాలి. తిండిపెట్టి, 20 రూపాయలకు తక్కువకాని వేతనం యివ్వాలి. వేతనం సక్రమంగా చెల్లించాలి. వేతనాల శాసనం, వర్క్‌మన్స్ కంపెన్‌సేషన్ చట్టం, సాంఘికభీమా సౌకర్యం వీరికి వర్తించాలి. దాసిపనులు చేసే స్త్రీలకు ప్రసవకాలం సౌకర్యాలివ్వబడాలి. సాంఘిక రక్షణ చర్యల దృష్ట్యా ఇతర పనివారికి ఏవిధమైన సౌకర్యాలున్నాయో, అవి అన్నీ వీరికి సమకూర్చబడాలి.

ఆయాలు, వంటవాళ్లు సహాయం చేసేవారు, ఇళ్ళు ఊడిచి, దాసీపనులు చేసేవారు ఎంతకష్టపడి పనిచేస్తూ వుంటారో, ఏవిధంగా అగచాట్లుపడాలి, వెలుతురు, గాలి సదుపాయం లేక బాధపడుతూవుంటారో, ఎంత తక్కువ జీతాలకు ఎంత ఎక్కువ పనిచేస్తూవుంటారో పరిశీలించి, గ్రహించి వీరివిషయంలో తగురక్షణలు కల్పించవలసి వుంది.

యూరోపియనుల యిళ్ళలో పనిపాటులు చేసేవారి పరిస్థితి బాగుంటుంది. అయితే ఎక్కువ భారతీయుల కుటుంబాలుకూడా నౌకరులు విధివిరామాలు లేకుండా పని చేసే అమానుషులుకాక మానవత్వం కల సౌజన్యవంతు లని యిప్పుడిప్పుడు గుర్తిస్తున్నాయి. రవీంద్రనాథ్ టాగూరు తన "పురాతనభృత్య" గేయంలో నౌకరుల త్యాగశీలతను ప్రశంసించారు. పెక్కుమంది పత్నులు తమ పనివాళ్ళను గురించి ఏమేమో ఫిర్యాదులు చెబుతూనే వున్నప్పటికీ, భారతీయ కుటుంబంలో పనిచేసేపిల్ల ఆ కుటుంబంలోని వారికి కలిగే సుఖం తక్కువైనదికాదని. యితర దేశాలలో యిట్టి సౌకర్యం చాలా అరుదైనదని నేను చెప్ప గలను.'

ఇంక మిగిలిన యితర తరహాలపని వారిమాటేమి? వేర్వేరు వృత్తులలో వేర్వేరు రంగాలలో పనిచేసే స్త్రీ కార్మికులకు సంబంధించిన లెఖలవివరాలను పరిశీలిస్తే అనేకమంది స్త్రీలు ప్రముఖమైంకాని పెక్కు వృత్తి వ్యాపారాలలో పనులుచేసి రక్షింపుకొంటున్నారని తేల పడుతుంది. నిజానికి పాటకజనంలో స్త్రీలు ఏదో ఒక పని చేస్తేనేకాని వారికి రోజుజరగదు. ఈపరిస్థితివల్ల పని పాటులలో నిమగ్నులైవున్న స్త్రీల సంఖ్య లక్షలలో వుం టున్నది. ఈవిషయంలో నేను యిటీవలలెఖలను సేకరించలేక పోయినప్పటికీ, అఖిలభారత మహిళాసభ, ఉమన్స్ ఇండియన్ అసోసియేషన్ 1939 లో నానాజాతి సమితికి అందజేసిన మెమోరాండంలో చిన్న చిన్న వ్యాపారాలలో పనిచేస్తున్న స్త్రీలకు సంబంధించిన లెఖలు వున్నవి. ఈ వ్యాపారాలలో పురుషులకంటె స్త్రీలే ఎక్కువగా వున్నారు. పాలు, పెరుగు వ్యాపారం చేసే ప్రతీ వెయ్యిమందిలోను 486 మంది పురుషులైతే 514 మంది స్త్రీలున్నారు. రొట్టె, పిడకలు, వంట చెరుకు వ్యాపారంచేసే ప్రతీ వెయ్యిమందిలోను 443 మంది పురుషులైతే 557 మంది స్త్రీలుకలరు.

గ్రామాలలో పాలు పోసేది ముఖ్యంగా స్త్రీలే. ఊరి వెలుపల అడవులలో కట్టెలు ఏరుకొని తెచ్చేది స్త్రీలే. ఆమె కార్బెట్ 'మాన్ ఈటర్స్ ఆఫ్ కుమాన్' పుస్తకంలో పేర్కొన్నట్లు కట్టెలకోసం అడవుల లోపలికంటు వెళ్ళి జంతువుల వాతబడేది స్త్రీలే చాలామంది స్త్రీలు పేడను పిడకలుగా చేసి వంటచెరకుగా విక్రయిస్తారు. రైల్వే సైడింగులవద్ద కుప్పలనుంచి బొగ్గును ఏరితెచ్చుకొని, కొన్ని అణాలకు దానిని విక్రయించుకొని గడిపేవారు కొందరు. వీధులు ఊడ్చేవారు కొందరు.

ధాన్యం దంచడం, పిండి విసరడం వంటిపనులుచేసే వారిలో చాలమంది స్త్రీలుకలరు. 1936 లో వారి సంఖ్య 1000 మందికి 185 మంది పురుషులైతే స్త్రీలు 815 మంది వుంటున వున్నారు. పంచవర్ష ప్రణాళికకు సంబంధించిన పారిశ్రామిక కార్యక్రమంలో ధాన్యం దంచడం గ్రామీణ పరిశ్రమలలో ముఖ్యమైనదిగా పరిగణించబడడం గమనార్హం. "రాతి చక్రాల ద్వారా ధాన్యం దంపించడం ద్వారా ఎక్కువ బియ్యం, పొట్టురాబట్టడమే ఈకార్య క్రమం లక్ష్యం." ధాన్యం దంపుడు అమలున గలప్రాంతా లలో 50,000 చక్కీలు నాలుగు సంవత్సరాలలో పంపిణీ చెయ్యడానికి యోచించబడుతూవుంది. హల్లరు రైస్ మిల్లులను క్రమంగా తగ్గించివేయడమే ఈ కార్యక్రమానికి

లక్ష్యం" అని పంచవర్ష ప్రణాళిక పేర్కొన్నది. (తొలి పంచవర్ష ప్రణాళిక. 144 పుట.)

స్త్రీలు పనిచేస్తున్న యితర వ్యాపారాలలో లాండ్రీపని ఒకటి. ప్రతీ వెయ్యిమందికి ఈపని చేస్తున్న స్త్రీలు 300 మందివున్నారు. అయితే ఫ్యాక్టరీలలోని లాండ్రీలలోను రంగుల అద్దకంలోను పనిచేస్తున్న వారి సంఖ్య 1951లో ఇండియా మొత్తంమీద 51 మందే అయినప్పటికీ పెక్కుమంది స్త్రీలు గ్రామాలలో చాకిత పనులను తమ మా నాన చేసుకొంటూవున్నారనే చెప్పవచ్చు.

తోలు ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న స్త్రీల సంఖ్య 1951 లో 624. అయితే ప్రయివేటుగా ఈ పరిశ్రమలో పని చేస్తున్న స్త్రీల సంఖ్య ఇంకా ఎక్కువగా వుండవచ్చు. గ్రామాలలో తోలుపనులు చేసేవారికోసం సహకార వస తి సంఘాలు ఏర్పాటుచేసి, పట్టణాలలోను, పరిసరాల లోను వారికి శిక్షణ యిస్తేంది. అభివృద్ధిని సాధించడానికి పంచవర్ష ప్రణాళికలో నిర్ణయించబడింది. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారి అభివృద్ధిని పెంపొందిస్తూ, సహకారోద్యమాలు నిర్దిష్ట కార్యక్రమాల ద్వారా సాధించ వచ్చు.


ఊలు నేత కేంద్రాలస్థాపనకు, చేతికాగితం పరిశ్రమకు, తేనెటీగల పెంపకానికికూడా పంచవర్ష ప్రణాళిక కార్య క్రమాలను నిర్ణయించింది. ఈకార్యక్రమాలన్నిటి వల్ల స్వయంగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని చాలీచాలని సంపాదనలతో బాధపడుతున్న పెక్కుమంది స్త్రీలకు తగినంతపని కల్పించవచ్చు.

సహకార సంఘాల స్థాపనవల్ల పెక్కుమంది కష్ట పడి సంపాదించుకొన్న దానిలో కొంత చేజిక్కించుకొనే కంట్రాక్టుదారుల గొడవను తప్పిస్తుంది.

"ప్రతీ ప్రభుత్వశాఖ, ప్రతీ మంత్రివర్గం సహకార వ్యాపారపు పద్ధతులను అమలు జరపనట్లయితే సుస్థిరఫలితాలను సాధించజాలము" అనికూడా పంచవర్ష ప్రణాళిక (83వ పుట)లో పేర్కొనబడ్డది.

ఇంకా చేపలు, కాయకూరలు, పువ్వులు, పళ్ళు, గాజులు అమ్ముకునేవారు, తేనెలు పట్టేవారు, కుండలు చేసేవారు, నేతపనివారు, నూలు వడికేవారు మొదలగువారు గ్రామాలలోకూడా రోజుకు కొన్ని అణాలు సంపాదించుకొనడంకోసం పనిచెయ్యడం కద్దు. ఈ పరిశ్రమలన్నీ ప్లానింగ్ కమిషన్ కార్యక్రమంవల్లనే అభివృద్ధి పొందించబడవలసివున్నది. నిజానికి చేనేత, ఖద్దరు, గ్రామ పరిశ్రమల విషయాలలో ఎక్కువ శ్రద్ధ వహించబడుతున్నవి. పారిశ్రామిక పాఠశాలలు విరివిగా స్థాపించబడుతున్నవి. చేతిపనులతోపాటు కూరగాయలు, పువ్వులు, మొక్కల పెంపకం, ఊరగాయలు, అప్పడాలు, మిఠాయిలు, ఇతర వ్యాపారాలు ప్రస్తుతంలో కంటె క్రమబద్ధ విధానంలో కొనసాగడానికి, అభివృద్ధి పొందడానికి కృషి చెయ్యవలసివుంది.

కోరమాండల్ కోస్తాలో మత్స్యకారులైన వనితలతో నేను ఉదయకాలం గడపిన సంగతిని మరువలేను. ఎంత ఉత్సాహంతో వారు చేపలను వలనుంచి సేకరించి, బుట్టలు నింపుకొని అమ్మకానికై వెళ్ళేవారు! ఒక్కొక్కపుడు చేపలు లభించేవే కావు. ఖాళీ బుట్టలతో నిరాశగా వెళ్ళిపోయేవారు. లేదా పెద్ద తుఫాను వచ్చి, ఆనావలు మునిగిపోయేవి. ఇటువంటి సంఘటనలు ఎవరు గమనించకుండానే ఎన్నిసార్లుజరుగుతూ వుంటాయో! అసలు, ఇండియాలో వనిపాటులవల్ల కుటుంబం పోషించేది పురుషులు - ఆ పురుషులకు ఏదైనా విపత్తు సంభవిస్తే విలపించేది స్త్రీలు. అలా విలపిస్తూకూడా ఆ స్త్రీలు పనులుచేస్తూవుంటారు. లేకపోతేవారికి రోజు గడువదు.



మనోవికాసంలేని బిడ్డలు

బొంబాయి సాంఘిక సంస్థ కృషి

మన దేశంలో అనేకకుటుంబాలు అధ్వాన్న పరిస్థితులలో కాలం గడుపుతున్నాయి. ఆ దుర్భర పరిస్థితుల విపరీత పరిణామం అనుభవించేది బిడ్డలు. వారికి మనోవికాసం తక్కువ, అదేవారిని వక్రమార్గాలకు, నేరాలకు ప్రోత్సహిస్తూ వుంటుంది. ఈ బిడ్డల చేష్టలను చూసి నిస్సహాయులైన వారి తలిదండ్రులు కర్తవ్య విమూఢులై సిగ్గుతో క్రుంగి, కుమిలి పోతూవుంటారు.

ప్రజలు సహృదయంతో పరిశీలించ వలసిన సమస్య యిది. శారీరికంగా వికలాంగులైన వారితో యీ మనోవికాసంలేని బిడ్డలను పోల్చవచ్చు. వీరి సంరక్షణ బాధ్యత సంఘమే వహించ వలసివుంది. ఇండియాలో యీ బిడ్డల సంగతిని తొలిసారిగా గ్రహించింది శ్రీమతి జయ్‌వకీల్‌సతి; 1944 లో ఆమె తన యింటనే యిటువంటి బిడ్డలకు చిన్న కిండర్ గార్డెన్ పాఠశాలను ఏర్పాటు చేసింది. తొమ్మిదేళ్ళ ప్రాయంగల యిద్దరు ఆడపిల్లలను చేరదీసింది, విదేశాలలో నూరేళ్ళుగా యిట్టి బిడ్డల సంరక్షణ, శిక్షణ కృషిసాగిస్తున్న సంస్థలు అమూల్యమైన సలహాలనిస్తూ సహకరించాయి. 15 మంది బిడ్డలకు ఈ పాఠశాల సహాయ పడడంలో కృతకృత్యతను సాధించింది.

దేశంలో యిటువంటి బిడ్డలు ఎందరో వున్నందున, ఈ కార్య క్రమాన్ని విస్తరించే వుద్దేశంతో 1949 లో పిల్లలకు ప్రత్యేక రక్షణ, పోషణ, శిక్షణలనుసమకూర్చే సంఘం **(The Society for the care, Treatment, and Training of children in need of Special care)** రూపొందించ బడింది.


పిల్లల సంఖ్య త్వరలోనే 30 కి పెరింగింది. నిపుణుల సూచనలపై ప్రతిబిడ్డకు ప్రత్యేక సంరక్షణను సమకూర్చే పద్ధతి ఆచరణలో పెట్ట బడింది. క్రమేపీ ఈ సంస్థకు బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్, కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ సహాయం లభించాయి.

దేశం అంతట యిటువంటి సంస్థలు అవసరమని గుర్తించ బడినంమన 1952 లో ఈ సంఘం ఉపాధ్యాయుల శిక్షణకు తగు ఏర్పాట్లు చేసింది. అన్ని రాష్ట్రాల లోను సుశిక్షితులైన ఈ ఉపాధ్యాయుల ద్వారా మనోవికాసంలేని బిడ్డల రక్షణకు సంస్థలను నెలకొల్పి, వీరు కూడా యితర బాలబాలికల వలెనే స్వతంత్రంగా జీవించగల పౌరులుగా అభివృద్ధి పొంద దగు అవకాశాలను కలిగించడానికే సంకల్పించ బడ్డది.

మనో వికాసంలేని బిడ్డలకు ఈ విధంగా రక్షణ కలిగించ బడడమే గాక, వృత్తి వ్యాపారాలకు తగిన అవకాశాలు కలిగించడానికి వీలుగా ఇంకా అభివృద్ధి చెయ్యడానికి కూడ ఈ పాఠశాల నిర్వాహకులు కృషిచేస్తున్నారు. ఇది బొంబాయిలో —రవిలాడ్జి, వార్డెన్ రోడ్ లో వున్నది.



★



సోహన్ సింగు

దివాన్ బిరెందర్‌నాథ్

సోహన్‌సింగు అదృష్టహీనుడని అందరికీ తెలుసు. అతను పుట్టినప్పుడు పురిటిమంచం కింద పాముని చూశారు. దానికి తోడు, ఆలోచించకుండా అతని తండ్రి ఆ పాముని చంపాడు. పిల్లాడు ఆరోగ్యంగా పెరిగి పెద్దవాడు అవుతున్నా, అతని అమ్మమ్మకి మటుకు అనుమానమే: అపశకునం ఫలించక తప్పదని.

ఆరోజు రానేవచ్చింది. తన అనుమానాలు ఉత్తివి కావనీ, ఎంతో అనుభవంమీద మాట్లాడగలుగుతున్నాననీ, అమ్మమ్మ గట్టిగా చెప్పగలిగింది ఆరోజు. సోహన్‌సింగు తండ్రి ఆలమ్‌సింగూ, అతని తండ్రి, భార్యాతో చుట్టాలని చూసి బన్నునుండి రావల్‌పిండికి తిరిగివస్తున్నాడు. రావల్‌పిండిలో అతను చౌకిదార్. అదిదారుణమైన శీతకాలపు ఉదయం. గాలి భరింపరానంత బాధ పెడుతూంది. ఇంటికి వచ్చి సోహన్‌సింగు నిలువలేకపోయాడు. నిల్చోపెడితే పడిపోతున్నాడు. శరీరం పొత్తి కడుపుకింద మంచులా చల్లబడిపోయింది. పీరుసాహెబు నుండి సివిల్ ఆసుపత్రి డాక్టరుదాకా ఎవరూ ఏమీ చేయలేకపోయారు. చివరకి తల్లితండ్రులు అసలు నిజం తెలుసుకున్నారు: సోహన్‌సింగు యిక ఎప్పుడూ నడువలేడు. తన జీవితాన్నంతా ప్రాకుతూ దేకుతూ గడిపివేయాలి.

దేశవిభజనతో రావల్‌పిండినుండి ఢిల్లీకి వచ్చేశారు ఆలమ్‌సింగూ అతని కుటుంబమూ. ఢిల్లీ జిల్లాకోర్టులో చౌకీదార్‌గా చేరాడు ఆలమ్‌సింగు. అప్పటికి సోహన్‌సింగుకి పది సంవత్సరాలు నిండాయి. స్కూలుకి పోలేదు. పదో తరగతిదాకా చదువుకొన్న తల్లి, ఇంటి దగ్గిర అతనికి లెక్కలు, హిందీ నేర్పుతూవుండేది. ఇక అతను నడిచే ఆశలేదని అందరూ నిర్ధారణ చేసుకున్నారు. కొన్ని సంవత్సరాలు అలాగే గడిచిపోయాయి....కాని, ఆనాటికి సోహన్‌సింగు అనుకున్నాడు. తను తప్పక లేచి నిలవాలని!

ఒక రోజు తల్లి దగ్గిర చదువుకుంటూ, 'నేను యితర కుర్రాళ్ళలాగ బయటికి వెళ్ళి ఏదైనా చేయాలి. కనట్ ప్లేసుకి వెళ్ళి తానూ అందరిలాగా ఏమైనా అమ్మాలి' అని చెప్పాడు తల్లితో. తల్లి యితని కోరికకి ఆశ్చర్యపోయింది. కాని సోహన్‌సింగు మటుకు కానహట్ ప్లేస్‌లోని షాపుల వరాండాలో ప్రాకడం మాత్రం వదలలేదు. తల్లితండ్రులు గటిగా ఏమీ అనలేక పోయారు. సోహన్‌సింగే, ఒక ఆటోరిక్షాను పిలిపించుకొని కనట్ ప్లేస్ వెళ్ళాడు. దువ్వెనలూ పిన్నులూ కొన్ని కొని యిచ్చింది తల్లి. అవి సంచిలో వేసుకొని బయలుదేరాడు. సాయంత్రానికి కాళీసంచితోనూ, జేబునిండుగా చిల్లర డబ్బులతోనూ సోహన్‌సింగు యింటికి తిరిగివచ్చాడు. ఇంట్లో అందరూ అతన్ని చూసి గర్వపడ్డారు ఆరోజు.

ఇంట్లో కూర్చుని ఒకరోజు చదువుకొంటూ వుంటే, ఆలమ్‌సింగుని చూడడానికి ఒకాయన వచ్చాడు. ఇర్విన్ ఆసుపత్రిలో పిల్లల సెక్షనులోని డాక్టరు రౌఫ్‌నని తనని తనే పరిచయం చేసుకున్నాడు. కనట్‌ప్లేస్‌లో యీ కుర్రవాడు ప్రాకుతూ తిరగడం తాను చూశాననీ, తనశక్తి వంచన లేకుండా, ఆ కుర్రవాడు తన కాళ్ళమీద నిలిచేలా చేస్తాననీ డాక్టరు రౌఫ్ చెప్పాడు. దానికి సోహన్‌సింగు కుటుంబం ఆనందంతో ఒప్పుకుంది.

సోహన్ సింగు

సోహన్‌సింగుని ఆస్పత్రికి తీసుకువెళ్ళి అతని కుడి కాలు ఆపరేట్ చేశారు; తరువాత నాలుగు నెలలకి ప్లాస్టరులోనుండి బైటికి వచ్చిన సోహన్‌సింగు కాలు తిన్నగా నిలువకల్గింది. ప్రాకడానికి బదులు యిప్పుడతను కఱ్ఱల సహాయంతో నడువగలడు. డాక్టరు రాఫ్, సోహన్ సింగుకి కఱ్ఱా ఒకరకమైన బూటూకూడా యిచ్చాడు. కొంతకాలంపోతే ఎడమకాలుకూడా సరిఅవుతుందని చెప్పాడు.

ఆరోజు మొదలు, మళ్ళీ, తన దువ్వెనలూ పెన్నులూ మొదలైనవి తీసుకొని కనట్‌ప్లేస్‌లో తన పాతవ్యాపారం ప్రారంభించాడు సోహన్‌సింగు. సాయంత్రానికి ఆ వ్యాపారం పూర్తిచేసి 'ఈవెనింగ్ న్యూస్' కూడా అమ్మి, రెండుమూడురూపాయలైనా పట్టుకుని యింటికొస్తాడు. అతని దగ్గర యేమైనాకొని, అసలు చెప్పిన ఖరీదుకంటె కొంచం ఎక్కువ యివ్వబోయామంటే, మనకే అభ్యంతరం చేసేలా 'అక్కర్లే'దంటాడు! ఎందుకు? అతని దృష్టిలో అదీ ముష్టిలాంటిదే. అంతేకాదు, రాజపుత్రుని కొడుకు భిక్ష స్వీకరించకూడదని అది అని అతని తల్లి చెప్పగా విన్నాడు.

సోహన్ సింగుకి మానసికమైన సమస్యలే లేవు. అందరి పిల్లలను చూసినట్లే యితన్ని చూసింది తల్లి. తన తమ్ముళ్ళమాట అలాఉంచి, ఆ చుట్టుపక్కల పిల్లలందరిమీదా అజమాయిషీ చేస్తాడు సోహన్ సింగు. తమ్ముళ్ళంటే ఎంతో గారాబం, తనకి పన్నెండేళ్ళు నిండక పోయినా, "తనతమ్ముళ్ళు చదువుకోవాలి" అన్నట్లు తాపత్రయ పడతాడు. కొన్ని రోజుల క్రితం తన బూటొకటి పారేసుకున్నాడు. అది కొనాలంటే పదిరూపాయలు కావాలి. ఒక నెలరోజులపాటు కష్టపడి పోగు చేశాడు. కాని సరిగ్గా ఆదేసమయానికి తమ్ముడికి స్కూల్లో ప్రమోషను వచ్చింది. కొత్త పుస్తకాలు కొనాలి. జీతం కట్టాలి. ఇంట్లో డబ్బులేదు. ఎలాగూ యింట్లో అందరూ కష్టపడుతున్నారుకూడా. తను బూటుకోసం కూడబెట్టిన పదిరూపాయలతో తమ్ముణ్ణి పుస్తకాలతో చేర్పించాడు సోహన సింగు.

ఇంత అయినా అతనిలోని "క్షత్రియం" మాత్రం పోలేదు. అతను కనే కలలో అది కనిపిస్తూనే వుంటుంది. తనకు కొన్ని క్రమ ప్రకారం, అతను ఒక సొమ్ము తెచ్చి అందులో అన్ని సదుపాయాలూ పెట్టి సంచీ ఎక్కువగా వుప్పుగోట కనట్ ప్లేస్‌లో అది పెట్టుకొని కూర్చోవాలని! ఇదే కొన్నాళ్ళకి చక్కని దుకాణంగా రూపొందుతుందని అతని నమ్మకం. ఏమి దుకాణం? ఢిల్లీలో ఎక్కడాదొరకనంతటి మంచి బొమ్మల దుకాణం!

అన్యధా శరణం నాస్తి....

ఉన్న నలుగురు బిడ్డల్లోను ఆమెయే పెద్దది. పదేళ్ళ ప్రాయం. ఒక తమ్ముడికి ఏడేళ్ళు. మరో తమ్మునికి అయిదేళ్ళు. కడసారపుది కొన్నినెల్ల పసిపాప. ఆపాప పుట్టినపుడే తల్లి చనిపోయింది.

ఉద్యోగంలేక తండ్రి బాధపడుతున్నాడు. ఒక బంధువు ఓ అబ్బాయిని తీసుకుపోయి పెంచుకున్నాడు. పసిపాపనిచ్చి తండ్రి మిగిలిన బిడ్డలను వాళ్ళ అమ్మమ్మ దగ్గరకు పంపాడు.

ఆ బిడ్డను సాకడం తనవల్ల కాదని తండ్రికి అప్పగించి రమ్మని అమ్మమ్మ ఆదేశించింది. పదేళ్ళ పిల్ల పాపనెత్తుకుని అంతదూరం తమ్ముడితో కలిసి నడిచిరావడంచూసి తండ్రి కోపోద్రిక్తుడై తిరిగి అమ్మమ్మ దగ్గరకే పొమ్మని గద్దించాడు.

ఏం చెయ్యడానికీ తోచక ఆ పదేళ్ళపిల్ల పాపను చెరువులో పడవేసింది. పోలీసులు ఆపాప దేహంచూసి, దర్యాప్తుచేసి అక్కను తమ్ముణ్ణి ఢిల్లీలోని రిమాండ్‌హోంకు పంపారు. సంగతి జ్ఞాపకం వచ్చినపుడల్లా ఆ అమ్మాయి వలవల ఏడుస్తుంది. చేతులారా చంపవలసివచ్చినందుకు.

— సోషల్ వెల్ఫేరునుండి.

నాటక కళ

శ్రీమతి ఆ. భాస్కరమ్మ

ఈ నాటక కళను గురించి తెలిసికొనుటకుఁ బూర్వము ఈ నాటకము లెందుకొరకేర్పడినవో, ఉద్దేశమేమో, వీని ప్రారంభమెప్పటినుండియో, వీని పరిణామమెట్టిదియో తెలిసికొనుట ముఖ్యావశ్యకము.

ఈ నాటక ప్రారంభ కాలమును నిర్ణయించుటకు సృష్టియే ప్రారంభము. సృష్టియేర్పడినది లగాయతు నేటి వరకు ననంతములగు నాటకములు జరుగుచునేయున్నవి. ఇప్పుడింకను జరుగుచున్నవి. ఈ సృష్టి యంతమగువరకు నిట్లు జరుగుచునేయుండును. ఈ సృష్టియే యొక గొప్ప రంగస్థలము. ఇందలి జీవరాసులే నటకులు. భగవంతుడే సూత్రధారుఁడు. ఈ నాటక రంగస్థలమున ప్రతిదినము ననేక రసములతో గూడిన లెక్కలేని నాటకములు జరుగుచునే యున్నవి. వానిని మన మెల్లరము ప్రత్యక్షముగా చూచుచున్నాము. వానిని గురించి వినుచున్నాము. స్వయముగా ఆడుచున్నాము. అందువలన గలుగు విశాలమగు ప్రపంచానుభవము బొందుచున్నాము. జీవిత పరిణామమునొందుచున్నాము. ఈ జగన్నాటకానుకరణములే మన నాటక గ్రంథములు, కృత్రిమ నాటక రంగములు, నాటక ప్రదర్శనములు.

కవిత్వమునకును, చిత్రకళకును, సృష్టికిని నెంత దగ్గర సంబంధమున్నదో, ఈ నాటక ప్రదర్శనములకును, సృష్టికిని కూడ నంత దగ్గర సంబంధమున్నది. సృష్టివినా నాటకమేలేదు.

మానవుని మేధాశక్తి అద్భుతమైనది. మానవుఁడు తక్కిన జంతుజాలములవలె కేవల సృష్టికి లోబడియుండ లేదు. మానవుని మేధాశక్తికిని, జీవితమునకును దినదినము పరిణామము కలుగుచునేయున్నది. మానవులు తమ యూహలను, ఉద్దేశములను చెప్పుటకొఱకును, మానవ జ్ఞానమును విస్తరింపఁజేయుటకును, మానవుల నొకక్రమములో నడపుటకును, సృష్ట్యాదిలోని పరిస్థితులు, సృష్ట్యంతము వరకు నుండు మానవులు తెలిసికొనుటకును ననుకూలముగా నుండునట్లనేక గ్రంథములు రచించిరి. ఆగ్రంథములలో వేదములు ప్రప్రథమములు. ఈ వేదములలో మొదటిదగు ఋగ్వేదమునందు తక్కిన విషయములతోఁబాటు నాట్యవిషయమైకూడ పెక్కుచోట్ల చెప్పబడియున్నదని కొందరు చరిత్ర కారులు వ్రాయుచున్నారు. దీనిని బట్టి చూడ సృష్టికి ప్రారంభదశయగు వేదకాలమునందు కూడ నాటిక ప్రదర్శనములున్నట్లు గాననగుచున్నది. అయితే ఆకాలమునందలి నాటక కళ రెండు విధములుగా నున్నది, అందొకటి మత సంబంధమైనదీ రెండవది సామాన్యము అని ఏదెత్తు అను నామె యొక పత్రికలో వ్రాసినది.

దీనికి తరవాతది యగు పౌరాణిక యుగమునందుకూడ నాటక ప్రదర్శనములున్నట్లు నిదర్శనములు కలవు. "హరివంశములో" ప్రద్యుమ్నాదులు నటరూపములనుదాల్చి "గంగావతరణము", "రంభాభిసారము" మున్నగు నాటకములను ప్రదర్శించి రాక్షసులను మోహితులను జేసినట్లు వర్ణింపబడినది. "స్కాంధపురాణములో" గౌరీ కళ్యాణ సందర్భమున నప్సరసలు నాటక ప్రదర్శనమును గావించినట్లు వర్ణింపబడినది.

బౌద్ధకాలములో కూడ బౌద్ధులు తమ మతప్రచారమునకై నాటకములను ప్రదర్శించుచుండెడివారని పెక్కు ప్రమాణములు గలవు. అయా కాలములలోని నాటకములన్నియు మతసంబంధమైనవగుటచేత కళాసూన్యములై యుండనోపు.

తరువాత భాఁసుడు, శూద్రకుడు కాళిదాసు మొదలగు మహాకవులు క్రీస్తుశక ప్రారంభములో ననేక గొప్పనాటకములను రచించిరి. కాని యెందువలననో నాకాలములో నాటకప్రదర్శనములంత యుచ్ఛదశలోలేవు.

కాని తరువాత క్రీస్తు శకము 8 మొదలు 11 వ శతాబ్దము వరకు నాటకములు విరివిగనే వెలువడినవి. ఆకాలములోనున్న ప్రసిద్ధ నాటక కవులలో శ్రీహర్షుడు, రత్నావళి, నాగానందము, ప్రియదర్శికలను రూపకములను రచించెను. ఇంకను భవభూతి, భట్టనారాయణుడు, కృష్ణమిశ్రుఁడు మొదలగు ననేకమంది కవులు మాలతీ

మాధవము, వేణీసంహారము- ప్రబోధచంద్రోదయము మొదలగు ననేక నాటకములను రచించిరి.

ఈవిధముగా సృష్టిలో ప్రారంభదశయగు వేదకాలము నుండి తర తరములుగా మిగుల నుచ్ఛదశలో వ్రాయఁబడుచు, ప్రదర్శింపబడుచు వచ్చుచున్న నాటకములు మహమ్మదీయ ప్రభుత్వ ఆరంభముననే సమాంతముగా పడిపోయినవి. దేశమంతయు నల్లకల్లోలమగు యుద్ధముల తోడను, భయముతోడను, నిండియుండుటచేత నాటక ఖేలనాది విలాస క్రీడల కవకాశము లేకపోయినది. అయి నప్పటికీ మహమ్మదీయ ప్రభువుల సంతోషపెట్టుటకు క్షుద్రరూపకములను రచింపసాగిరి. నటకులు గూడ చెడు ప్రవర్తనాపరులైరి. దానితో నాటక గౌరవ మంతరించి నది. నటకులకు సంఘములో గౌరవము పోయినది. నాటక వేషధారి యనిన నందరికు చులకనయే. ఎందులకు కొరగానివాఁడు ఉదరపోషణార్థమై నాటక సంఘములో జేరి యే యశ్లీలోక్తులనో బలుకుచు. ఏ వెట్టి మొట్టి గంతులో వేయుచు నాటకములాడుచుండ, దానికి గౌరవ మెట్లు కలుగును ? అక్కడితో, నీతి, జ్ఞానదాయకములగు నాటకములు వదిలి. తోలుబొమ్మలాడుట, వీధినాటకములు బయల్వెడలినవి. రసికుల యాదరణపోయి పామరజన సంతోషమే ప్రాధాన్యమునకు వచ్చినది. ఈవిధముగా తక్కిన యన్నికళలతోబాటు నీ నాటక కళ గూడ మన దేశములో పూర్తిగా నంతరించినది.

కాని యేబది సంవత్సరముల క్రితము శ్రీ వీరేశలింగం పంతులుగారు, చిలకమర్తి లక్ష్మినరసింహంగారు, హనుమంతరావు నాయుడుగారు మొదలగు వారు నాటకములను రచించియు, యోగ్యులగు విద్యార్థులచేత ప్రదర్శింపఁజేసియు నీ నాటక కళను పునరుద్ధరింపఁజేసి యాంధ్ర మండలమునకంతకును నాయకమణియు, ఆంధ్రవాఙ్మయమునకు ప్రధాన నిలయమునగు నీ రాజమహేంద్రపురినే యాకళకుఁగూడ ప్రధాన స్థానముగా నేర్పరచిరి. అప్పటి నుండియు ముఖ్యముగా మన యాంధ్ర మండలమునందు తిరుగ నాటకములున్నత స్థితిలోనికి వచ్చినవి.

కవిత్వము, చిత్రలేఖన, సంగీతము, అభినయము మొదలగు లలిత కళలలో నీ నాటక మొకటి. తక్కిన కళలన్నిటికిని ప్రకృతి భావము లెంత యావశ్యకములో దీని కంతకన్నా నెక్కుడావశ్యకములు. తక్కిన కళలు దేనికది ప్రత్యేకముగా విలువగలదు. కాని నాటక మట్టిదికాదు. పైనాలుగు కళలతోఁగూడిన యైదవ కళ. ఈ నాలుగు కళలతోఁగూడిన నాటక దృశ్యమే మనో రంజకముగా నుండునుగాని తదితర మట్లుండదు. మానవుల జ్ఞానాభివృద్ధికై పురాణములు, ప్రబంధములు, పద్య కావ్యములు, నవలలు మొదలగు గ్రంథములు రచింపబడినవి. ప్రతి గ్రంథమునకును తగిన పాత్రములు గలవు, ఆ పాత్రములయొక్క హావభావ విశేషములు, గుణాతిశయములు, స్వభావములు మొదలగునవి కవియొక్క సమర్థతనుబట్టి చక్కగా పోషింపబడును. అయితే పై చెప్పబడిన కావ్యములకును నాటకములకును పాత్రపోషణ యందొక గొప్పభేదమున్నది. ఇతరకావ్యముల యందు పాత్ర స్వరూపము, స్వభావము వివరముగ, విపులముగ వర్ణించుటకు వీలున్నది. ఆ మార్గము నాటకమున రసాధ్యము. ఆ పాత్రయొక్క కార్యములు వాక్యములు, ఉచ్చరించు అభిప్రాయములు ఇవియే మన కథ కాధారములు. వీనినుండి మనము మన భావనాశక్తి నుపయోగించి ఆ పాత్రయొక్క భావదృష్టిని పరికించు చున్నాము. అట్లే నటుఁడు తన భావ శక్తిచే నాపాత్రము వహించి దృశ్యమార్గమున ప్రదర్శించుచున్నాడు.

ఉత్తమోత్తమములగు నుద్దేశ్యములతోడను, భావనల తోడను కూడియుండి ప్రజలకెంతో జ్ఞానము నిచ్చుట కేర్పడియున్న నాటకముల నాడు నటుడెట్టివాడుగా నుండవలయును ? భావ ప్రకటనకు నటుడు ముందు గొప్ప పండితుఁడును, రసికుడును గావలయును. రసికుడగు నటుఁడుగాని రసముల బోషింపఁ జాలడు.

వినోదప్రదమగుటచేత నాకర్షకమును, పకృతినలంకరించుటచేత సద్ధర్మబోధకమునునై తనరు నాటకము లెంత యావశ్యకములో ఆలోచింపుడు.

నాటకములు సరిగా ప్రదర్శింపబడినచో నవి చాలా జ్ఞాన దాయకములు. అట్టి జ్ఞాన దాయకములగు నాటకములకు వస్తు, పాత్ర, భావనలు ముఖ్యావశ్యకములు. నాటకమునకు దగిన వస్తువులను సేకరింపవలయును. పాత్రకు దగిన మనిషిని చూడవలయును, ఆ పాత్ర ధరించువాఁడు తదనుగుణమైన భావప్రకటనల నభ్యసింపవలయును. పురుషులెంత ప్రయత్నించినను స్త్రీ పాత్రలను బోషింప లేరు. వారి మార్దవము వయ్యారము, సరళత, గంభీరము మొదలగు విషయములు ప్రకటించుట పురుషుల కశక్యము. స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించవలయును. నీతి

గలిగియుండి యేపని చేసినను తప్పులేమ. నీతి లేకున్నచో నెంతయుత్కృష్టపు పనియైనను తప్పే. పాశ్చాత్యదేశము లందు నటులను, నటీకురాండ్రను సమితముగా గౌర వించుచున్నారు, కావుననే విద్యావంతులు. కళోపాసకులు. రసిక శిఖామణులు. ఉన్నతాశయములు గలవారు కేవలము ఆ కళాభివృద్ధికై సర్వస్వము ధారబోయువారే అందుచేరి నటించుచున్నారు. అందువలననే ఆంగ్లనాటకములు జ్ఞాన దాయకములగుచున్నవి.

మనదేశములో నటకులకు సరియగు గౌరవాదరణలు లేవు. ఎక్కడాపనికిరానివారు నాటకవేషధారులగుచున్నారు. ఎక్కడికక్కడికే సంతృప్తిచెందే స్వభావము మనది. నాటకమునకు కావలసిన సరియగు వస్తుసేకరణ యుండదు. తగిన నటకులుండరు, దుస్తులుండవు. సీనులుండవు. మన నాటకములు పామర జనులకు సంతోషమునిస్తే నివ్వ గాక ! కాని పండితులను మాత్రము మెప్పించలేవు. నానాటికి నాటక కళ క్షీణిస్తోంది. ఈలాటి నాటకములను ప్రదర్శించి ఆ కళయొక్క గౌరవము పాడుచేయుటకన్న అసలు ప్రదర్శింపకుండుటయే యుత్తమము.

సినీమాలు వచ్చిన తరువాత నాటకములు పూర్తిగా పడిపోయినవి. అక్కడక్కడ యెవరైన నాటకముల నాడుచున్నను అవి కేవలము వర్తకసరళిలోను, తమ అవసరపోషణార్థమై ప్రదర్శించు సామాన్యజనులచే నాడ బడుచున్నవిగాని, నాటక కళలను పోషింపవలయునని గొప్పయాశయముతో ప్రదర్శింపబడునవికావు.

సినీమాలు కూడ నాటకములే. నటకులు నాటకము లాడుచుండ నాప్రదర్శనములను ఫిల్ములో ఫొటోలుతీసి తెరపై చూపిస్తున్నారు. ఈ సినీమాలు పౌరాణికములు, చారిత్రకములు, సాంఘికములు అని మూడు విధములుగా నున్నవి. పౌరాణిక చిత్రములను దీయుట చాల కష్టము. అవి చాలా పురాతనములు. ఆకాలమునాటి మానవుల మూర్తిత్వములు, వేషభాషలు, సాంఘికాచారములు, వస్తు సామగ్రి మొదలగువానిని సరిగా తెలిసికొనుటకు తగిన యాధారములు లేవు. పురాణములే కొంతవరకాధారములు. అవి అతిశయోక్తులతోడను, అభూత కల్పనలతోడను నిండియుండుటచేత వానిని సరియగు విధానములో ప్రద ర్శించుట అసంభవము. అయినను ఆగ్రంధములయందలి వర్ణనలను శ్రద్ధతో జాగ్రత్తగా చదివి అవగాహన చేసి కొని కృషి సల్పినచో కొంతవరకైనను సాధించుటకవ కాశమున్నది. కాని ఆ శ్రద్ధ, ఓపిక మన సినీమాలుతీయు వారియొద్ద బొత్తిగా కానరావు. కృతయుగమునాటి హరిశ్చంద్ర, నలోపాఖ్యానములలో, త్రేతాయుగమునాటి రామాయణము, ద్వాపరమునాటి భారతము ఈ నాటకము లేవియాడినను, సినీమాలు ఏవి తీసినను వాటన్నిటికి ఈ నాటి దుస్తులు, వస్తుసామగ్రి, వేషములు. ఇక పాత్ర లన్నినో చెప్పనక్కరయేలేదు. శ్రవ్య ప్రబంధములకన్న దృశ్యప్రబంధములు ఎక్కుడు సులభ గ్రాహ్యములు, జ్ఞాపకశక్తిని యెక్కుడభివృద్ధిచేయు సాధనములు. చెవు లతో వినుదానికన్న కండ్లతో చూచు విషయములు స్థిర స్థాయియగు జ్ఞాన బోధకములు.

పైన చెప్పబడిన నాటకములు, సినీమాలు చూచుట వలన కథనుబట్టి కొంతవరకు నీతిబోధకములగుచున్నవి. గాని తక్కిన విషయములు జ్ఞానబోధకములుకావు సరిగదా పైగా తప్పుడు భావముల నిచ్చుచున్నవి.

చారిత్రక సంబంధమైన సినీమాలు కొంతవరకు మెరుగు. అవైనను ఇంకా చాలావరకు అభివృద్ధి చెంద వలసియున్నది.

ఇక సాంఘిక చిత్రములు. వీనిని తీయుట పైరెంటి కన్నా చాలా సులభము. ప్రస్తుతము సంఘములో జరుగు చున్న విషయములగుటవలన నటకులు సంఘములోని వేరు వేరు వ్యక్తులను బాగుగ పరిశీలించి, పరిశోధించి అనుకరించుటకవకాశమున్నది. కాని వారు వారు ధరించు పాత్రల కనుకూలురగు వ్యక్తులు కావలయును, వారు చూపు నటన అతి స్వాభావికముగా నుండవలయును. ఆ చిత్రములు సంఘమునకు చక్కని నీతిని బోధించుచు సంఘములో అద్భుతమగు నీతిదాయకమైన మార్పును గొనిరావలయును. అసభ్యకరములు, చూచుటకసహ్య కరములు, చెడ్డ విషయములలో ప్రజలలో ఉద్రేకమును కలిగించు నటనలు, హాస్యములు లేకుండుట మంచిది. పాటలుకూడ ప్రౌఢముగను, గంభీరముగను, చక్కని రసవంతమైన సాహిత్యముతో గూడినవిగాను, హిందీ, బెంగాలీ, ఆంగ్ల అనుకరణములుకాక స్వచ్ఛమైన తెలుగు రాగములతో గూడినదిగాను ఉండుట మంచిది. పురుష పాత్రలకు స్త్రీలవలెనే అన్నీ పాటలేకాకుండా ప్రౌఢము, గంభీరము, పౌరుషముతోగూడిన పద్యములు కూడ నున్నచో ఇంకనూ ఎక్కుడుగా రాణించవచ్చును.



డబ్బు విలువ

శ్రీ చింతలపాటి హరగోపాల్ కృష్ణశర్మ

మా తమ్ముడు ఈమధ్య చెడిపోతున్నాడని గ్రహించా. కారణం ఇంట్లో చెప్పిన పనులు చేయకపోవడం, పై పెచ్చు మా అమ్మా వాళ్ళనే ఎదిరించడం మొదలైనవాటి వలన పసికట్టగలిగాను. నిజంగా నామటుకు నాకే విచారమేసింది. వాడు చెడిపోవడానికి బాధ్యులు ఎవరా? సంఘమా- వాతావరణమా- స్నేహితులా లేక ఇంట్లో వాళ్ళా? అసలు వాడెట్లు చెడిపోయాడు నాదగ్గరుంటూ? అనేది బాధిస్తోంది. వాడి నేవిధంగా బాగుచేసి, సరి అయిన మార్గంలో పెట్టగలను? అనేది ప్రశ్న.

అసలు మా నాన్నగారు రిటైర్డ్ తాలూకా ఆఫీసు గుమాస్తా. మేంఇద్దరమే కొడుకులవడం వలన, కూతుళ్లు లేకపోవడం వలన నన్ను ఎమ్. ఏ. దాక చదివించారు. పెండ్లి చేశారు. ఆతరువాత రెండేళ్ళకల్లా చనిపోయారు. చనిపోతూ అమ్మని, తమ్ముడ్ని ఆదరించమని మరీ మరి చెప్పి పోయారు. నామటుకు నాకు అమ్మంటే గౌరవం వుంది. ఆవిడ ఏవిషయాలు పట్టించుకోదు. చనువుగా మెలుగుతుంది. మా తమ్ముడంటే కూడా అమితమైన ప్రేమ ఉంది. వాడు అప్పటికి 4 వ ఫారం చదువుతున్నాడు. వాణ్ణికూడా నాలాగ ఎమ్. ఏ. చదివించాలని ఉండేది. మా ఆవిడకూడా చాల మంచిది. మా తమ్ముడంటే ప్రేమ. మా అమ్మంటే గౌరవంవుంది. అందుచేత ఇంట్లో "అత్తా-కోడళ్ళ" తగవులుండేవికావు. ఈ ఒక్క విషయానికి నామటుకు నేనే ఉప్పొంగిపోయేవాడిని. కాని ఒక్క తమ్ముడి విషయంలో కథ కాస్త అడ్డం తిరిగింది. వాడంటే ఇంట్లో అందరికీ ప్రేమ అవడంవల్ల వాడు ఇటు వదినగారిదగ్గర, అటు అమ్మ దగ్గర డబ్బులు తీసుకునేవాడు. అది స్నేహితులతో కలిసి "సినిమాలకు, హోటళ్ళకి" ఖర్చుపెట్టున్నాడని విన్నా. కుర్రవాళ్ళకి సరదాలు ఉంటాయి. కాదనను గాని అవి మరీ మితిమీర కూడదు. ఎప్పుడైతే ఈవిషయం గ్రహించానో, అంటే వాడు దురలవాట్లకు లోనౌతున్నాడని వెంటనే మొదట మా ఆవిడకు చెప్పేశా "కుర్రవాళ్ళకి బాధ్యత అనేది తెలియనప్పుడు- డబ్బంటే ఏమిటో తెలియనప్పుడు, వాళ్ళ చేతికి డబ్బు అందించరాదు. ఆవిధంగా డబ్బులిస్తున్నామంటే వాడు చెడిపోవడానికి, భవిష్యత్తు చెడకొట్టడానికి మనమే కారకులవుతాము" అంటే "కుర్రతనంలో కాకపోతే పెద్దయినతర్వాత ఖర్చుపెడ్తారాఏమిటి, పెద్దయిన తరువాత అన్నిటితోబాటు డబ్బు విలువలు- అన్నీ తెలుస్తాయిలెండి" అనేసింది చటుక్కున. పోనీ అమ్మకు చెప్పుదామా అంటే ఆవిడకు వాడంటే మహాప్రేమ. వాడి మీద ఈగవాలిన మొదట ఆవిడే సహించలేదు ఎల్లాగో అలాగ నచ్చచెప్పుదామనుకుని బయలుదేరా అమ్మదగ్గరకు. మా ఆవిడదగ్గరలాగనే పాఠం వల్లించా. దాంతో ఆవిడ ఇంత ఎత్తున లేచింది. నాకు తమ్ముడంటే ఇష్టంలే

దన్నట్టుగామాట్లాడింది. అంతేగాని ఆవిషయంలోని మంచి చెడుల గురించి ఆలోచించలేదు.

నాకు మటుకు ఓధైర్యం ఉంది, వాడు అంతగా ఉద్యోగం చేసుకోలేకపోయిన తిండి, బట్ట ఇవ్వగల తాహతు ఉంది. ఈరోజువరకూ వాడిని ప్రేమతోనే చూస్తున్నాను. కాని రేపటి సంగతేమో. వాడంటే చీదరించుకోవచ్చు. నాకేగనక నగ్గురు పుట్టితే నా భార్య అసహ్యించుకోవచ్చు. రేపటి సంగతి ఏమవుతుందో ఎవరు ఆలోచించగలరు ? అందుకనే అప్పుడప్పుడు నా మిత్రులు "అరే నీకు ముందుచూపు- ఆలోచన ఎక్కువరా" అంటారు. అసలు నాకు మొట్టమొదటే గనక తెలిస్తే మందలించేవాడిని. కాని ఇప్పుడు మందలించకుండా సరి అయిన దోవలో పెట్టాలని నా ఆలోచన. వాడికి అసలే అభిమానం జాస్తి. మందలిస్తే ఎంతటి పనికైనా (అంటే ఆత్మహత్య) వెనుదీయడు. పోనీ వాడే సరైన మార్గానికి వస్తాడులే పెద్ద అయిన తరువాత అని అనుకుందామా అంటే మనసొప్పడంలేదు. దానికితోడు నాన్నగారు చనిపోతూ చెప్పినమాటలు నగరా దెబ్బలాగ వినిపించాయి. "అరే పెద్దవాడు- మోహన్‌ని జాగ్రత్త. వాడి భారమంతా నీకే వప్పజెప్పి పోతున్నా. నేను నిన్ను ఎట్లా పెంచి పెద్దవాడిని జేసానో అట్లాగా వాడ్ని కూడ చూడవల్సింది" అని పదే పదే చెప్పారు. అందుచేత ఏమైనాసరే వాడిని బాగు చెయ్యాలని నిశ్చయించుకున్నా. ఏవిధంగా అనేది ప్రశ్న ? ఆఫీసులో కాగితాలు చూస్తున్నంతసేపు ఇదే ఆలోచన. పోనీ ఎవరినైనా సలహా అడుగుదామంటే ఇష్టంలేకపోయింది. ఇంట్లో సంగతులన్నీ పరాయివాళ్ళకి చెప్పుకోవడమేమిటనిపించింది. ఇలా ఆలోచిస్తుంటే నా మైండ్‌కి ఒక ఆలోచన తట్టింది. ఆ ఆలోచనకు నాలో నేనే ఉప్పొంగిపోయా.

ఇంక మరేం ఆలోచించకుండా ఇంటికి వచ్చేసా. ఎన్నడూ నాతో షికారుకి రమ్మని పిలవలేదు వాడ్ని. కాని ఈరోజున షికారుకి రమ్మని పిలిచేసరికి వాడికి ఆశ్చర్యం, భయం వేసాయి. మారు మాట్లాడకుండా వచ్చేసాడు నాతోటి. మెరినా బీచ్‌కి తీసుకెళ్ళాను, ఒక మూల కూర్చుని మొదట డబ్బంటే ఏమిటో- అదిలేకపోతే కలిగే నష్టాలేమిటో అన్నీ వివరంగా చెప్పా. అప్పే వాడి చెవికి ఎక్కనేలేదు. ఇంక ఇట్లా లాభంలేదనుకుని "ఒక్క రోజున ఒక రూపాయి సంపాదించుకురా చూద్దాం" అన్నా. ఏమిటి ఏవిధంగానైనా డబ్బు విలువ తెలిసొచ్చేటట్లు చేద్దామనే ఉద్దేశ్యంతో. "ఓ, ఒక్క రూపాయేగదా సంపాదించుకుని రాగలను" అన్నాడు. నాకు నవ్వొచ్చింది. వీడికి రూపాయంటే పైసలాగా ఉందేం చెప్మా ? అని.

మరునటిరోజు సాయంకాలం చదువుతూవుంటే రూపాయి నోటొకటి తీసుకొచ్చి ఇచ్చాడు. వీడు ఏవిధంగా తీసుకొచ్చాడో తెలుసుకోవాలిగదా ! మొదటిసంగతనుకుని వాడిముందరే ముష్టివాడికి ఆరూపాయి నోటిచ్చేస్తూ మా వాడితో అన్నా "ఏ వదినగారినో, లేకపోతే అమ్మగారినో అడిగి తీసుకొచ్చి ఉంటావు" అని. నేనేదో ఉత్తినే అనేశా. వాడాశ్చర్యపోయాడు. వెంటనే ఇంట్లోకి వెళ్ళిపోయాడు. నిజానికి వాడు అమ్మని అడిగి తీసుకున్నాడట ఆ రూపాయి. నేనేదో నవ్వులాటకన్నా విషయం నిజమే అయింది. అసలు నా ఉద్దేశ్యం వాడు నిజంగా కష్టపడి సంపాదిస్తే ఆ రూపాయి ముష్టివాడికి వేస్తుంటే అడ్డపడతాడనుకున్నా ? అంతేగదండీ. కష్టపడి సంపాదించిన రూపాయి ముష్టివాడికి పారేయడానికి మనస్పొప్పుతుందా ! ఈ ఆలోచనతో అన్న విషయము నిజమే అయింది. వాడనుకున్నాడు— ఇంట్లో వాళ్ళు నాకు చెప్పారనుకున్నాడు అందుచేత రెండోరోజు వాళ్ళ స్నేహితుడిని అడిగి తీసుకొచ్చి ఇచ్చాడు. అదీ మొదటిసారిలాగనే ముష్టివాడికి వేశేసాను. దాంతో వాడు నేనెట్లు కనుక్కోగలుగుతున్నాను అని ఆశ్చర్యపోయాడు. తరువాత మరోజు అభిమానం, పౌరుషం ముంచెత్తుకొచ్చింది. ఏమైనాసరే సంపాదించుకొద్దామని బయలుదేరాడు.

మూడో రోజున రాత్రి 8 గం॥లకు రూపాయి చిల్లరతో పట్టుకొచ్చాడు. బయట ముష్టివాళ్లెవరూ లేకపోయారు. దాంతో ముష్టివాళ్ళకి వేసేబదులు— బయట పారేయబోతుంటే అడ్డపడ్డాడు. "ఏం" అన్నా. "అది

ఎంతో కష్టపడి సంపాదించాను ఈరోజున. నిన్న స్నేహితుడ్ని, మొన్న అమ్మని అడిగి తీసుకొచ్చా. కాని నీవెట్లాగో కనుక్కున్నావు. అందుచేత ఈరోజున సంపాదించుకొద్దామని బయలుదేరా. ఎవడూ నా మొగమేజూడలేదు. దాంతో బస్సు స్టేండుల దగ్గర పెట్టెలవి మోసి, రైలు స్టేషన్ల వద్ద పెట్టెలవి మోసి సంపాదించ. నీవు డబ్బు విలువ గురించి చెపితే నాకు ఏం అర్థంకాలేదుగాని, ఇవాళ తెల్సింది డబ్బంటే ఏమిటో పూర్వం రూపాయలంటే చిళ్ళ పెంకులులాగా ఉండేవి. కానీ ఇవాళ బుద్ధి వచ్చిందిరా అన్నయ్యా" అన్నాడు. నాకు నిజంగా ఒక పక్క సంతోషం, వేరొక పక్క విచారం వేసింది. వాడికి డబ్బంటే ఏమిటో తెల్సిందిగదాని ఒక పక్క సంతోషం, రూపాయి కోసం వాడు పడ్డ అవస్థని చూస్తే విచారం వేసాయి.

అంతే ఆరోజు మొదలుకుని బుద్ధిగా ఉన్నాడు. నాలా ఎమ్. ఏ. ప్యాసు అయ్యాడు. ఇప్పుడు విజయవాడలో కలెక్టరుగా పనిచేస్తున్నాడు. ఇప్పటికి వాడు నన్నెంతో మెచ్చుకుంటాడు వాడ్ని బాగుచేసానని. అంతే. బాలయి చిన్నప్పుడు నాన్న సంపాదిస్తుంటే డబ్బంటే ఏమిటో తెలియక అన్యాయంగా చెడిపోతారు. పెద్దయి వాళ్ళ హయాం వచ్చేసరికి పశ్చాత్తాపపడతారు. లేకపోతే కొంత మంది తలిదండ్రులను తిట్తారు.

మానవుని చావు

శ్రీ భీమవరపు సత్యనారాయణమూర్తి

పూర్వం మానవులకు చావు లేకపోయింది. విపరీతంగా జీవులు పుట్టటం సంభవించింది. ఒకనాడు భూదేవి గబగబా బ్రహ్మ దగ్గిరకు పరుగెత్తుకొచ్చి తన భారం బాపవలసిందిగా అర్థించింది. కారణానికి సమాధానమిస్తూ, "భూలోకంలో మనుష్యులను జంతువులను తదితర ప్రాణులను చక్కగా పుట్టిస్తున్నందులకు చాల సంతోషంగానే వుంది. కాని వీరి పుట్టుకలకు యెక్కడా అంతులేదా? అనేక కుటుంబాలు వెలుస్తున్నవి. అనేకమంది తమ తాతలను, ముత్తాతలను మూల పురుషులను, చూడటమే గాకుండా మనుమలను, ముని మనుమలను మునిమనుమడి మునిమనుమలను చూస్తున్నారు. ఇంతమందికీ జీవనోపాధి జరగటం చాల చిరాకుగా వుంది. ముసలితనం మోయలేక మూలుగుతున్న వృద్ధులు, తమ మనుమలు సరసంగా గడ్డాలు, గోచీలు వూడపీకుతూ ఏడిపిస్తున్నందులకు చాల దురవస్థలుగా వున్నారు. 'పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం!' గా పరిణమిస్తున్నది. ఏ పని చేయలేక పనులు లేకపోవటం వల్ల పాపకార్యాలుకు పాలుపడుతున్న ప్రజల భారంతో క్రుంగిపోతున్నాను. నన్ను రక్షించ వలసిందిగా వేడుతున్నాను" అని ఆమె వలవల ఏడ్చింది. బ్రహ్మ ఆమె కన్నీళ్ళు తన దోసిలినిండా పట్టాడు. ఆమెపై జాలికలిగింది. శక్తి స్వరూపము ఆడది ఏడిస్తే, లోకం దద్దరిల్ల వలసిందే గనుక ఆయన ఆమె భారం తగ్గించటానికి ఆమె కంటి చుక్కల ధారలని తన దోసిలితో పట్టి "ఈ కంటి నీరు చుక్కలు ఎన్ని అయితే నా దోసిలిలో పడ్డయ్యో, యివన్నీ అన్ని రకాల జబ్బులగుగాక!" అని ఆయన ఆ నీటిని భూమిమీద చల్లాడు. ఒక చుక్క మలబద్ధకము రెండవది తలనొప్పి మూడవది మశూచి నాలుగోది జ్వరం యిల్లా రకరకాల జబ్బులుగా మారిపోయాయి. అవి వచ్చి యీ మానవుల్ని పీడించటం మృత్యు దేవత వీటి సాయాన మానవులని చంపటం జరుగుతూ వచ్చింది. అప్పటినుంచి భూభారం తగ్గి కొంత శాంతించింది. ఆనాటి నుంచే మానవులకు చావు అంటూ కలిగింది.

"భగవంతుని లీల"

శ్రీ పిళ్ళా సుబ్బారావుశాస్త్రి

అదొక మహారణ్యం. ఆ అరణ్యంలో ఏకాంత జీవితం గడుపుతూ భగవన్నామస్మరణ జేసుకుంటున్నాడు ఒక మహర్షి. అతని పేరు భగవాన్.

భగవాన్ గొప్ప దైవభక్తి గలవాడు. ఆయనకిప్పుడు అరవయ్యేళ్ళు. ఇప్పుడు కలిగిందతనికి ఒక సందేహం అది 'భగవంతుడు అందర్నీ సమంగా చూస్తున్నాడా?' అని. ఆయన యీ సందేహం తీర్చుకోవాలనుకున్నాడు.

సరే! భగవాన్ దేశాటనానికి బయలుదేరాడు. ఆయన అలా బయలుదేరాడు— ఎక్కడికో, ఏమిటో....! ఆయనలా నీళ్ళూ, పళ్ళూ సేవిస్తూ పోతున్నాడు.

సూర్యోదయం అయింది. పక్షులుకిలకిల మంటున్నాయి. రైతులు పొలాలకి బయలుదేరారు. స్త్రీలు బిందెల్ని చంకనేసుకొని నీలాటి రేవుకు బయలుదేరారు. బ్రాహ్మణులు సూర్యనమస్కారాలు చేయసాగారు.

భగవాన్ స్నానం చేసి, ఏవో కందమూలాలు తిని నడక సాగించాడు. అతనికి ఎదురుగా వచ్చాడు ఒక యువకుడు. తెల్లని ఛాయ, దృఢమయిన శరీరం. తీర్చి దిద్దిన కళ్ళూ, నల్లటి ఉంగరాల జుట్టూ ఎంతో అందంగాను, అమాయకంగాను కనపడుతున్నాడు.

"స్వామీ! నమస్కారములు!" ఆయువకుడు ఎంతో వినయంగా నమస్కరించాడు.

"శ్రీఘ్రమే—" అన్న భగవాన్ మాటల త్రుంచేసి "దేవా! నేను లోకాన్ని చూడటానికి బయలుదేరాను!" అన్నాడు యువకుడు.

"సరే! నేనుకూడా లోకసంచారానికే బయలుదేరాను. నాతో రా నాయనా!" అన్నాడు భగవాన్.

భగవాన్, యువకుడు యిద్దరూ బయలుదేరారు. "నాయనా! నీ పేరు....?" అన్నాడు భగవాన్.

"చంద్రుడు- స్వామీ....!" అన్నాడు యువకుడు. ఇద్దరూ మౌనంగా నడక సాగించారు.

సూర్యుడు అస్తమించాడు. పక్షులు గూళ్ళు చేరుకో సాగినై. రైతులు యిళ్ళకి బయలుదేరారు— చంద్రుడు వెన్నెలని విరజిమ్ముకుంటూ మబ్బులని తోసుకుంటూ బయటికి రాసాగేడు.

"స్వామీ! అదో....! ఆదీపకాంతులు చూశారా? అది ఎవరో ధనవంతుడి గృహంలావుంది....! పోదాం రండి....!" అన్నాడు ఒక మేడని చూపిస్తూ చంద్రుడు.

"నాయనా! చంద్రా! నేను కూడా అలసిపోయాను: పద- పోదాం!"— భగవాన్, చంద్రులు ఆయింటికి బయలుదేరారు.

బాట కిరువైపులా పూల మొక్కలూ, సిమెంటుచేసిన బాట! భగవాన్, యువకుడు ఆయిల్లుచేరారు- వాళ్ళు వీధిలో వుండగానే ఒక ముసలాతను వాళ్ళిద్దరికీ నమస్కరించి "ఈరోజు మీరిద్దరూ అతిధులు!" అన్నాడు.

భగవాన్, చంద్రులకి చక్కని గది యిచ్చారు. ఆ గదిలో రెండు హంస తూలికా పాన్పులు వున్నాయి. చుట్టూ కిటికీలు, అద్దాలు వున్నాయి. ఒక చక్కటి కర్ర బల్లమీద అనేక రకాల పళ్ళూ, పానీయాలు వున్నాయి.

ఇద్దరు నౌకర్లు వచ్చి వాళ్ళిద్దర్నీ స్నానాల గదిలోకి తీసుకువెళ్ళి, స్నానం చేయించారు.

తర్వాత యిద్దరికీ, బంగారు పళ్ళాలలో చక్కని పిండి వంటల్తో భోజనం పెట్టారు— ఇద్దరూ తృప్తిగా భోజనం చేసి, తాంబూలాలు వేసుకున్నారు.

వాళ్ళు నిద్రపోయేముందు నౌకర్లు రెండు బంగారు కప్పులలో ద్రాక్షారసాన్ని తెచ్చి యిచ్చారు— అది త్రాగి నిద్దరోయారిద్దరూ.

తెల్లవారక మునుపే స్నానం చేసి, చక్కని కమ్మని ఫలహారాలు తీసుకొని యిద్దరూ బయలుదేరారు.

భగవాన్ త్రోవలో ఆయింటి యజమానిని గురించి ఎంతో పొగుడుతూ మాట్లాడేడు.

"స్వామీ! చూశారా....?"— అన్నాడు చంద్రుడు. ఆ గృహస్థుడు పానీయంతో యిచ్చిన బంగారు కప్పు చూపిస్తూ— భగవాన్‌కి, చంద్రుడు యిలా దొంగిలించి తెచ్చాడని చాలా కోపం వచ్చింది. కాని ఏమీ అనలేదు.

"భగవంతుని లీల"

ఆకాశమంతా మబ్బులు క్రమ్మింది. గాలిబాగా వీచింది. ఉరుములూ- మెఱుపులు రాసాగేయి. భగవాన్ యువకుడు గబగబా నడవ సాగారు– కాని కొంచంసేపు వర్షం జోరు హెచ్చింది. ఆచీకట్లో కన్ను పొడుచుకున్నా కళ్ళు కనిపించవు। అందులోకి అమావాస్య రాత్రి।। వాళ్ళకి అల్లంత దూరాన్న ఒక చిన్న దీపం వెలుతురు కనిపించింది. అక్కడికి బయలుదేరారు.

ఆయిల్లు ఒక లక్షాధికారిది. ఎంత లక్షాధికారి అయినా పిల్లికి బిచ్చం పెట్టని రకం।– అందుకే చిన్న గుడ్డిదీపం పెట్టుకు కూర్చున్నాడు.

ఇద్దరూ వెళ్ళి తలుపు కొట్టారు– ఎంతకీ తియ్యలేదు. వాళ్ళు మరింత గట్టిగ్గా బాదారు।- తలుపులు విరుగుతాయేమో అని తలుపు తీశాడు పిసినారి.

ఇద్దరూ వణుకుతూ ఒకమూల కూర్చున్నారు. "ఆకలిగావుంది ....। ఏమన్నా పెట్టమా।" అన్నాడు చంద్రుడు.

ఆలక్షాధికారి విసుక్కుంటూ– ఒక ఎండిపోయి, పాడయిపోయిన రొట్టె, ఇన్ని నీళ్ళూ తెచ్చి యిచ్చాడు. చంద్రుడు అవే తిని కడుపు నింపుకున్నాడు.

వర్షం కొంచెం వెలిసింది. "ఇకదయ చేస్తారా ?" అని తలుపు తీసినుంచున్నాడు లక్షాధికారి.

భగవాన్‌కి యీసారి చంద్రుడిమీద కోపం వచ్చింది. ఎందుకంటారేమో - చంద్రుడు అక్కణ్నుంచి తెచ్చిన బంగారుకప్పు పిసినిగొట్టుకి బహుమానంగా యిచ్చాడు। —భగవాన్ ఆయినా ఏమీ అనలేక పొయ్యాడు.

తర్వాత యిద్దరూ నడక సాగించి ఒకరాత్రికి ఒక ధనవంతుడి గృహం చేరుకున్నారు. అక్కడ అతను వాళ్ళని చాలామర్యాదగా చూశాడు.- వెళ్తూవున్నప్పుడు చంద్రుడు చేసిన పని భగవాన్‌కి మరింత కోపం తెప్పించాయి।

ఆ ధనవంతుడికి ఒక్కడే కొడుకు. అతణ్ణి ఎంతో గారాబంగా పెంచుకుంటున్నాడాయన. ఆ కుర్రాడు నిద్రపోతూండగా వెళ్ళి .... చంద్రుడు అతన్ని కత్తితో చంపి బయటకు వచ్చేశాడు.

తర్వాత ఆధనవంతుడు వాళ్ళకి దారి చూపించమని ఒక నౌకర్‌ని పంపేడు. భగవాన్, నౌకర్ ముందు నడుస్తూన్నారు. చంద్రుడు వెనుక వస్తూ, నౌకర్ వంతెన మీదికి రాగానే గభాల్ను వాణ్ని ఆ కాల్వలో తోసివేశాడు।


ఇక భగవాన్ దీనిని భరించలేక ఉగ్రుడయిపోయి, చంద్రుడి మీదకి చెయ్యి ఎత్తాడు। అంతలోనే అదంతా కాంతితో నిండిపోయింది।

"భగవాన్।" అనే పిలుపుతో భగవాన్ పైకి చూశాడు - ఆయువకుడు ఒక చక్కని దేవకన్యగా మారిపోయాడు. పలచటి దుస్తులతో, గాలికి ఎగురుతున్న జుట్టుతో ఆమె యిలా చెప్పింది.

"భగవాన్"। నేను భగవంతుని సేవకురాలుని ...। భగవంతుడు అందర్నీ సమంగా చూస్తున్నాడు ..।। – ఆ ధనవంతుడు డబ్బువుందికదా అని పాత్రఎరుగ కుండా అందరికీ దానం చేస్తున్నాడు. అది గుర్తించేందుకు అలా చేశాను .. — పిసినిగొట్టు ఈ ఎండురొట్టికే యింతవస్తే ఇంకా మంచిదానం చేస్తే ఎంత వస్తుందో అనిదానం చేస్తాడు। అందుకే అలాచేశాను। మూడోవాడు కొడుకు పుట్టగానే, అంతకుముందుచేసే భగవన్నామస్మరణమాని, సంసారంలో పడ్డాడు। అందుకే అలాచేశాను ..। నౌకరు యజమానిని చంపాలని పన్నాగం పన్నేడు। అందుకే వాణ్ని చంపేను .... ।కాబట్టి భగవంతుడు ఎదురుగా వచ్చి కనిపించడు ..। భగవంతుడు అందరికీ న్యాయం చేస్తూవుంటాడు। భగవంతుడు మనలోనేవుండి మనచేతనే ఆయన చేయిస్తాడు ..।"

భగవాన్ ఆమెకి నమస్కరించాడు. ఆమె భగవాన్‌ని దీవించి మాయమయింది.

భగవాన్ తపస్సు చేసుకుంటూ, చివరికి భగవంతుణ్ని చేరాడు.



జీవారంభం

శ్రీ కె. తా. దా. జయంతీదేవి, B.Sc., (Hons.)

జీవము (Life) అనగానేమి? ఎప్పుడు భూమి మీద ప్రారంభము అయినది అని చెప్పుట మనకు అలవికాదు. మనుష్యులు, జంతువులు, వృక్షములు జీవముకలవి. అవి అన్నియు పుట్టుచున్నవి పెరుగుచున్నవి. గాలి పీల్చుచున్నవి. జాత్యభివృద్ధి చేసికొని తుదకు గిట్టుచున్నవి. వీనిలో జంతువులు చలనము గలవి కాని వృక్షములు చలనము లేనివి. కొందరు వైజ్ఞానికులు రాళ్ళను రప్పలను కూడ ప్రాణము కలవిగా నెంచుచున్నారు.

నేడు మనము రక రకములగు మనుష్యులను చూచుచున్నాము. అనేక రకములగు జంతువులను చూచుచున్నాము. ఏనుగులు, సింహములు, ఆవులు, గుఱ్ఱములు, కోతులు మున్నగు చతుష్పాతులు (Quadruped) పాములు మున్నగు సర్పములు (Reptiles) పలురకములగు చేపలు(Pices) పక్షులు (Aves) కీటకములు (Insects) ఇవేకాక ఏక కణ జీవులు.

ఇదేవిధముగ వృక్షములలో కూడ పెద్ద పెద్ద యూకలిప్టసు. (Eucalyptus) సికోయా (Sequoia) వృక్షములు ఫెరనులు (Ferns) నాచులు (Mosses) బూజులు, కుక్కగొడుగులు (Fungi) ఆల్గే (Algae) మొదలగునవి. వృక్ష జాతిలో కూడ ఏక కణ జీవులు కలవు. (Unicellular organisms)

ఈ పై చెప్పబడిన వివిధ రకములగు జంతు వృక్షాదులన్నియు భూమి పుట్టుకతోనే యుద్భవించినవా లేక కాలక్రమేనా వచ్చినవా అను ప్రశ్న మనలను విసిగించుచున్నది.

ఈ ప్రశ్నకు మనకు భూగర్భములోని 'ఫాసిలు' (Fossil) కొంతవరకు సమాధానము చెప్పుచున్నవి. 'ఫాసిలు' అనగా "భూమినుండి త్రవ్వి ఎత్తబడిన శిలారూపమై పోయిన జంతులేక ఉద్భిజ్జ సంబంధమైన వస్తువు" ఈ "ఫాసిలు" ఎట్లేర్పడినవి. ఆయా జంతువులు కాళ్ళ అడుగులు కాలవశమున ఇసుక కరగిపోయి గట్టిపడి యుండవచ్చును. లేదా రష్యాలోని మామత్ (Mammoth) వంటి జంతువులు మంచులో కూరుకొని పోయి మరుగు పరచ బడినవి.

కొన్ని రకములగు ఫాసిలులు శిలాద్రవము (Lava) లో భద్రపరుప బడినవి. పాంపేలో అగ్ని పర్వతము బ్రద్దలయినప్పుడు వచ్చిన శిలాద్రవములో ఆ పట్టణమంతయు అట్లే యుంచబడినది. వంటచేయు స్త్రీలు, ఆడుకొను బాలురు, వంకాయీదు నౌకరు మున్నగువారు ఎట్లుండిరో అట్లే ఫాసిలుగా మారిపోయిరి.

ఈ ఫాసిలులను సమగ్రముగా పరీక్షించగా తేలినది అవిలో నేమున్నట్టి జంతు వృక్షములు లేవనియు. అప్పటి, శీతోష్ణస్థితియే వేరనియు మొట్ట మొదట అమీబా (Amoeba) యుగ్లీనా (Euglena) మొదలగు ఏక కణ జీవు లేర్పడినవి. వీనినే ప్రోటిస్టా (Protista) అని పిలతురు. ఇవి జంతువులకు వృక్షములకు మధ్యగానున్నవి.

వీనినుండి జంతుజాతి, వృక్షజాతి రెండూ బయలుదేరిన వట. కాలక్రమేణా వీనినుండి కొత్త జాతులు పుట్టినవట. ఈ మొదటి జీవులు ఉప్పునీటిలో నివసించు చుండెనట. కాలక్రమేణా సముద్రపు నీటి యొక్క ఉప్పుతగ్గి మంచి నీటి పరిసరములు ఏర్పడెనట. తుదకు ఈ నీరు కూడా ఇగిరి జీవులు భూమిమీద నివసించుట కలవాటు పడినవి. దీనితోపాటు భూమి యొక్క వేడిమి కూడ తగ్గుచు వచ్చినది.

ఈ మార్పులు జరుగుటకు చాలకాల వ్యవధి పట్టెను. ఈకాల పట్టీని మూడు ముఖ్యభాగములుగా చేయవచ్చును.

1. పేలియోజోయిక్. Palaeozoic
2. మీసోజోయిక్. Mesozoic
3. కైనోజోయిక్. Ceinozoic

మొదటిది పేలియోజోయిక్ యుగము : ఈ యుగ మతి ప్రాచీనము. ఈ యుగములో భూమిచాల వేడిగ నుండెను. అంతయు జలజలమయము. జంతుజాతిలో ట్రైలోబేటా (Trilobata) వృక్షజాతిలో సైలోఫైటేల్సు (Psilophytales) ముఖ్యమైనవి. ఈ యుగాంతములో భూమి చల్లబడినది. ఆయాజంతు, వృక్షములు, ఉప్పు నీటిలో నుండి మంచినీటికిని, తరువాత బురదనేలలో కడపట భూమిమీద నివసించుటకు అలవాటు పడినవి.

2. మీసోజోయిక్. (Mesozoic) ఈ కాలములో జీవులకు అనుకూల పరిస్థితు లేర్పడెను. జంతువు లలో రెప్టయిల్సు మున్నగునవి వృక్షములలో సూది ఆకు చెట్లు, జింకోలు (Ginkgo) టెరిడో స్పెర్మములు (Pteridosperms) మున్నగునవి. ఈ యుగాంతములో కీటకములు, ఆంజియో స్పెర్మములు (Angiosperms) పుష్పించువృక్షములు కూడ పుట్టినవి.

3. కైనోజోయిక్ : ఈ యుగములో ఇండియా ఆఫ్రికా, ఆస్ట్రేలియా భూభాగము లేర్పడెను. చతుష్పా దులు, కోతులు, మానవుడు బయలుదేరినవి. వృక్షజాతిలో ఆంజియోస్పెర్మములు (Angiosperms) ఎక్కువభాగము ఆక్రమించు కొన్నవి. ఈ ఆంజియోస్పెర్మములలో ఏక జాతి బీజదళములు (Monocots) ద్విబీజదళములు, (Dicots) అను రెండు వుపశాఖలు కలవు.

ఆదికాలమునుండియు జంతు వృక్షజాతులు సమాంత ముగనే (Parallel) పెంపొందుచున్నవి. రెండునూ ఒకేజాతి ప్రోటిస్టానుండి పుట్టించినవి. అప్పటి నుండి రెండు ఒకదానిమీద మరొకటి ఆధారపడుతూ వచ్చినవి. నేడు జంతు జాతిలో ఉత్కృష్టమైన జీవిమానవుడు. వృక్ష జాతిలో ఆంజియోస్పరము (Angiosperm)

★

వీర కార్మికుని ఆత్మ సమర్పణ

వరాసియా బొగ్గుగనుల ప్రమాదంలో గనులలో ఇరుక్కుపోయిన కార్మికులను రక్షించడానికి పూనుకొని, తన ప్రాణాలు కోల్పోయిన కార్మికుని వీరగాథ తెలియ వచ్చింది. ఈ కార్మికుని పేరు శ్రీ శ్యామ్‌లాల్. ఈయన తన ప్రమాదాన్ని కూడా లెక్కపెట్టక న్యూటన్ చిఖాలీ బొగ్గు గనులలో వరద మూలంగా ఇరుక్కుపోయిన తోటి కార్మికులలో 10 మందిని సురక్షితంగా ఇవతలికి చేర్చాడు. తర్వాత మరి కొందరిని రక్షించ డానికి వెళ్ళాడు. కాని, నీటి వేగం ఎక్కువైంది. ఆ మహావీరుడు తను కూడా ఆ నీటి వడికి ఆగలేక పోయాడు: ప్రాణాలు కోల్పోయాడు. పుట్టుట గిట్టుట కొరకే కాని శ్రీ శ్యామ్‌లాల్ జీవితము ధన్యము. ఆయన ఆత్మకు శాంతి చేకూరుగాక.

మగని మోసము!

ప్రక్కింటి ముసలావిడకు బాగా జబ్బు చేసింది. డాక్టరు గారు ఒక ఔన్సు బ్రాంది గ్లాసులో పోసి త్రాగమని ఇచ్చారు.

ఒక్క చుక్క కష్టంగా చప్పరించి "చిత్రంగా వుందే. మా ఇంటాయన ఇప్పటికి ఇరువై సంవ రాల నుండీ త్రాగేమందు వాసనే వస్తున్నదిది" అన్నది.

పాపము మగని మోసమెరుగదు.

"నీవేమి చేయగలవు?"

డాక్టరు. ఎ౽. హనుమంతరావు. ఎం.ఎ., ఎం.ఎస్..

"నీబిడ్డ అతిగాఏడిస్తే?"

ఎక్కువగా ఏడ్చే బిడ్డ ఆకలిగా వున్నట్టు గుర్తు. దుస్తులు తడిగావుంటే మార్చాలి. భుజంమీద వేసుకొని వీపుమీద నెమ్మదిగా కొడితే లోపలిగాలి పులితేపుల రూపంలో వస్తుంది. అప్పుడు శాంతిస్తాడు. బిడ్డలు రోజులో కొన్నిసార్లు ఏడుస్తూ వుండాలి, ఇది చెడుగు కాదు.

"నీ బిడ్డ ఏడ్చినపుడు ఎక్కువసేపు గుక్కపడితే?"

కొందరు పిల్లలు ఏడ్చినప్పుడు కొన్ని నిముషాలవరకు గుక్క పట్టి వుంటారు. అటువంటి సమయములో కాళ్ళు చేతులు బిగ్గుకొని వుంటవి. అలాంటప్పుడు ప్రశాంతంగా వుండడం మంచిది. చికిత్స లేకుండగనే బిడ్డ యథారీతికి రాగలడు. ఇది ప్రమాదకరంకాదు. కనుక నీ పని పాటలకు యిది ఆటంకం కానియ్యరాదు. కొన్నిసార్లు దీనివిషయమై సానుభూతి చూచేకొలదీ ఈ అలవాటు ఎక్కువవుతుంటుంది. కోపపడగూడదు. ఓపిక పట్టుదల అవసరం. బిడ్డను శిక్షింప ప్రయత్నింపరాదు. యివి దీర్ఘకాలంగా వుంటే వైద్యుని సంప్రదించాలి.

"నీ బిడ్డ కంటిలో ఇసుకపడితే?"

కండ్లు నలుపనివ్వరాదు. గోరువెచ్చటినీటితో వెంటనే కండ్లు కడగాలి. నీరు కంటిలో ఒకప్రక్క నుండి మరొకప్రక్కకు వచ్చునట్లు తలను అటుయిటు త్రిప్పాలి. నీరు విస్తారంగా వాడాలి. కనుగ్రుడ్డుమీదగాని కను రెప్పమీదగాని వున్న ఇసుక రేణువులన్నియు పోవువరకు కంటిని కడుగుతూ వుండాలి. ఎంత ప్రయత్నించినా ఇసుక పూర్తిగా తొలగించ లేనపుడు కండ్లు మూయించి మంచి వైద్యుని సంప్రదింపుము.

"నీ బిడ్డ వేలుకోసుకుంటే?"

గాయము లోతుగావుంటే శుభ్రమైన గుడ్డతో కట్టి వైద్యుని కొరకు కబురు చేయుము. కోత స్వల్పమైనదైతే గోరువెచ్చని నీటితో కడిగి కట్టు కట్టుము.

"నీ బిడ్డ పుట్టువెయ్యి వాడైతే?"

ఎడమచేతి ఉపయోగము అలవడ్డ బిడ్డకు కుడిచేయి ఉపయోగించుటకు నేర్ప ప్రయత్నించ వద్దు. ఈలా ప్రయత్నించడం ఎక్కువ లాభంలేదు — కలిసి వచ్చేది కూడా ఏదీలేదు.

"నీ బిడ్డకు ముక్కునుండి రక్తముపడితే?"

తలపైకి ఎత్తిపట్టి వుంచాలి. మెడచుట్టూ వున్నదుస్తులను వదలుచేసి. మెడవెనుకను ముక్కు వెలుపలను శీతల తడికట్టు వేయాలి. ముక్కుచీదరాదు.

"నీ బిడ్డకు కడుపునొప్పి వచ్చినపుడు?"

చిన్నపిల్లలు సాధారణముగా కడుపు నొప్పితో బాధపడుతుంటారు. దీనికనేక కారణాలు వుండవచ్చును. ఎక్కువ తినడం కావచ్చు లేక ఎక్కువ బలమైనతిండి కావచ్చులేదా అది కోద్రేకం కావచ్చు. వెంటనే పండుకో బెట్టాలి. బిడ్డ వెల్లెకిలా పడుకొని కొంతసేపు నెమ్మదిగా వుండాలి. కొన్ని సార్లు నొప్పి దానంతటదే సర్దుకుంటుంది. లేక వాంతి అయితే దానివెంటనే నొప్పికూడ పోతుంది. నొప్పి త్వరలో సర్దుకొనక పోయినను నొప్పి కడుపు దిగువభాగాన కుడిప్రక్కగా వున్నను ఆపెండిక్సు జబ్బని అనుమాన పడవచ్చును. పొత్తి కడుపులో నొప్పి కల వారికి విరేచన ఔషధాలు యివ్వరాదు. వైద్యుడు రోగిని చూచేవరకు మంచినీరుతప్ప మరేమి యివ్వరాదు.



"డెయిరీ ఫారమ్"

* శ్రీ వేమరాజు భానుమూర్తి *

ఆవేళ ఆదివారం. మధ్యాహ్నం తీరుబాటుగా కూర్చున్నాం. ఇంతలో చక్రవర్తి వచ్చాడు. 'అన్నయ్యా మరి ఐస్‌క్రీమ్' కొనిపెట్టవూ? అంటూ గారం ప్రారంభించాడు.

"ఇంతకీ ఆ కొనేది అంతా మీ తమ్ముడికేనా నాకూ కొనిపెట్టరా? అంది జోగా.

మీరంతా తినే వాళ్ళయితే నేనొక్కర్తేనా మానివేసేది అంది సుభద్ర.

దానికేం భాగ్యం. అందరం అలాగే తిందాంలెండి. అన్నాను.

అవతల వీధిలోంచి 'ఐస్‌క్రీమ్' వేన్‌వాడు అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది అన్నట్టు 'హారన్' కొట్టాడు

పట్టాభివీధిలో వచ్చి " 'డెయిరీవేన్' మన గుమ్మంలో నిలబడివుంది మీరెవ్వరైనా పిలిచారా? ఏమిటి?" అని అడిగాడు.

"చక్రవర్తి పిలిచాడుకాబోలు 'ఐస్‌క్రీమ్' కోసమని" అని సద్దేసింది అమ్మ.

"మరి ఆ 'ఐస్‌క్రీమ్' ఎక్కడినుంచి వస్తోంది?" అంది లక్ష్మి.

"డైరీ ఫారమ్'లో అదనంగా మిగిలిపోయిన పాలతో ఈ 'ఐస్‌క్రీమ్' అవీ తయారుచేసి అమ్ముతారు. ఆ మాత్రం తెలియదంటే" అంది జోగా.

ఇంతలో పాలవాడు వచ్చాడు. వాడు మామూలుగా 'నీళ్ళలో పాలుకలిపి' పోస్తూంటాడు. అందుకని గృహిణి వాడితో దెబ్బలాడింది. "నిన్ను మానిపించివేసి ఇంక హాయిగా డెయిరీ పాలుపోయించుకుంటామమ్మా! చక్కగానూ వుంటాయి. మీటరు కొలతకీ ఆగుతాయి. పేచీ పూచీలుండవు" అని బెదిరించింది.

ఇంతలో పట్టాభి అందరికీ 'ఐస్‌క్రీమ్ పొట్లాలు కొనుక్కు వచ్చాడు. తింటూండగ మొదలెట్టాడు. "అన్నయ్యా, అప్పుడెప్పుడో డెయిరీ ఫారానికి తీసుకు వెడతానన్నావుకదా?" అన్నాడు.

'వాళ్ళని తీసుకువెళ్ళి చూపిద్దాం పాపం" అని హుషారిచ్చింది గృహిణి.

సరే అని 'డెయిరీ ఫారమ్'మేనేజరుగారికి 'టెలిఫోన్' చేశాం. 'సంతోషం' అన్నాడు ఆయన. వెంటనే బయలుదేరుదామనుకున్నాం. నేను వస్తాను. నేనంటేనేనని అందరుబయలుదేరారు.

మామేళం చాలా మంది బయలుదేరాం.

ఆ పాలకేంద్రం ఎటు చూసినా అందమైన పచ్చిక బయళ్ళ మధ్య బ్రహ్మాండంగా నాలుగంతస్థుల మేడగా కట్టబడివుంది. గేటుదగ్గరే 'మేనేజరు'గారు మాకు ఎదురు వచ్చి స్వాగతమిచ్చి తీసుకువెళ్ళారు. నాలుగడుగులు వేసేసరికి పాలవాళ్ళు కాబోలు పెద్ద పెద్ద బొక్కెనలతో బారులు తీరినిలబడ్డారు. అవి బరువుగాకూడా వున్నాయి. ఒక్కొక్కడే వచ్చి అక్కడ గోడలోకి అమర్చబడిన పెద్ద 'గరాట'లోకి దిమ్మరించి వెళ్ళుతున్నారు.

"ఇదేమిటండీ, వాళ్ళు ఈ గోడగరాటీలోకి వంపుతున్నది?" అంది సుభద్ర.

'పాలు' అన్నాడు మేనేజరు భాయి.

"ఇక్కడ పాలు చేత్తోపిదకరని విన్నామే-నిజమేనా?" అంది అమ్మ.

"ఇక్కడ మాత్రం పాలుచేతులతోనే పితుకుతున్నారు కానీండి పాశ్చాత్య దేశాలలో మాత్రం యంత్రాల సాయంతో పితుకుతారు. ఇక్కడకూడా త్వరలోనే యంత్రాలలో పితికే పద్ధతిని ఏర్పాటు చేయించుకుంటున్నాము. ఇంకా అయిదారు మాసాలలో తగిన ఏర్పాట్లు అన్నీ పూర్తిరావచ్చు. ఇప్పుడు ఇప్పుడు ఒక చిన్న కొట్టంలో అయిదారు ఆవులను మాత్రం ఆ పద్ధతిలో పాలు పితుకుతున్నాము. రండి చూద్దాము" అని అక్కడికి తీసుకువెళ్ళారు మేనేజరుగారు.

అక్కడనుంచి గోష్ఠానికి వెళ్ళాము అనేక వేలపశువులు అక్కడవున్నాయి. అన్నీ నవనవలాడుతూ తొనలబట్టి ఎంతో ఆరోగ్యంగా, పుష్టిగా ఉన్నట్టున్నాయి. ఆవిరిమీద శుద్ధి చేయబడిన స్టెయిన్‌లెస్ స్టీల్ బొక్కెనలోనికి

పాలవాళ్ళు పరిశుభ్రంగా చేతులు సబ్బులుతో శుద్ది చేసుకుని పాలు పిండుతున్నారు. యంత్రాలతో పాలు పిండేగదికి వెళ్ళి చూచాము నాలుగు రొమ్ములకు నాలుగు రబ్బరు గొట్టాలు తగిలించారు. ఇక్కడ ఏదో మీట నొక్కారు. ఆవు పొదుగులో సంచలనం కనబడింది. చూస్తుండగా యంత్రం పాలన్నింటినీ పిండి వేసింది.

ఈవిధంగా పిండిన పాలనే ఇందాకా మనం చూసిన పాలవాళ్ళు బొక్కెనలతో గోడ గరాటిలోకి పోస్తున్నారు.

"అక్కడేం చేస్తారే పాలని" అంది జోగా.

"చూద్దుగాని నడు!" అంటూ అవైపుకు తీసుకు వెళ్ళారు. అక్కడ ఒక స్టెయిన్‌లెస్‌స్టీల్ గొట్టంలోంచి ఈ పాలుగదిలోకి పరిశుద్ధం చేయబడిన బొక్కెనలోకి వచ్చి పడుతున్నాయి. అక్కడ ఒక ఉద్యోగి ప్రతి ఆవు ఎంత పాలు యిస్తున్నదీ లెక్కవేస్తున్నాడు.

'ఇదెందుకండి' అన్నారు మా నాన్నగారు. ఇది అంతా ఆయనకు ఆశ్చర్యం కలిగించింది.

"పశువులను బాగా మేపి ఇంకా ఎక్కువ పాలు ఇచ్చేటట్టు చెయ్యడానికి ఈలెక్కలు ఉపకరిస్తాయి అందు కోసమని అన్నాడావుద్యోగి.

"ఓహో:" అనుకున్నారు నాన్నగారు.

"ఇదిగో ఈ ప్రక్క గదిలో ఆయనెవరో 'టెస్ట్ ట్యూబ్‌లో' పాలుపోసి చూస్తున్నాడేమిటో!" అన్నాడు పట్టాభి.

"అదా అది లేబరేటరీ గది. ఇక్కడ 'కెమిస్ట్' ఏ పాలలో ఏ పదార్థాలు ఏపాళ్ళలో వున్నాయో పరీక్షించి లెక్కవేయిస్తాడు. ఆ తరువాత పాలను శుద్ధి యంత్రం లోనికి పంపుతారు ఆ పాలు అన్నింటినీ" అన్నారు మేనేజరు భాయి.

"ఇంక పాలు కాచుకోరా!" అని అడిగింది మా అమ్మ అమాయకంగా.

"కాచుకొనే పని మీలాంటి ఇల్లాళ్ళకి. ఇక్కడ మేము పాలలో ఏవిధమైనరోగ కారకమైన సూక్ష్మజీవులు లేకుండా శుద్ధిచేస్తాము అంతే. ఇదిగో ఈగదిలోవున్న ఆ పెద్ద యంత్రం చూడండి. ఇక్కడ పాలనుతూస్తారు. మచ్చు తీసుకొని ధూళిని వడకట్టే యంత్రంలోనికి పంపు తాము. ఇక్కడ ఈ పాలన్నీ శుభ్రంగా వడకట్టబడ తాయి. ఆపైన విద్యుచ్ఛక్తి యంత్రంలో 107° లకు వేడి చేసి 40° లకు చల్లార్చి వేస్తాము. దానితో సూక్ష్మ క్రిములన్నీ నశించిపోతాయి. ఈ పద్ధతినే ఇంగ్లీషులో 'పాశ్చరైజేషన్' అంటారు. ఇందుకు పదిహేను సెకన్ల కంటె ఎక్కువ పట్టదు.

ఈ ప్రక్క హాలులో ఇంకో పెద్ద యంత్రంవుంది. ఈవిధంగా శుద్ధి చేయబడిన పాలను సీసాలలో నింపి వేస్తుంది ఆ యంత్రం.

అదుగో చూడండి. ఆ క్రింద అదిరితో శుద్ధి చేయ బడిన సీసాలు ఒక్కొక్కటిగా నింపి పైకి వస్తున్నాయి చూడండి" అని ఆ యంత్రాన్ని చూపించారు మేనేజరు గారు. ఈ పాలు నిండిన ఈ సీసాలన్నిటికీ ఒక్క 'ముట్టికాయతో' అల్యూమినియం మూతలు అమరిపోతున్నాయి. అవి అన్నీ సరిగా తొట్టెలోనికి సరిగా అమర్చబడుతున్నాయి. ఈ యంత్రాలన్నీ అమెరికా, ఆఫ్రికా, కెనడా స్విట్జర్లెండునుంచి తెప్పించారు.

ఆ చివర వెటర్నరీసెక్షన్ పశువులకు చికిత్స చేసి వాటి ఆరోగ్యం విషయమై ఎంతో శ్రద్ధగా పనిచేస్తున్నారు. వెళ్దాం పదండి అని మేనేజరుసాబ్ మమ్మల్ని అందర్నీ అక్కడికి తీసుకువెళ్ళారు. ఇంతలో "నాన్నగారూ" మన రంగడు 'ఇక్కడికి ఏలా వచ్చాడండీ' అని చక్రవర్తి ఒక్క కేకవేశాడు. మావూళ్ళో ఆవుదూడకి వాడు పెట్టు కొన్న ముద్దుపేరులెండి. ఈ బుల్లితువ్వాయిలను చూడండి ఎంతబాగున్నాయో!" అంది జోగా.

'నాకు బుల్లితువ్వాయిలంటే బలే ఇష్టం' అన్నాడు పట్టాభి. అక్కడ దూడలు ఎంతో ఉత్సాహంతో చెంగు చెంగున గంతులేస్తున్నాయి.

ఈకేంద్రంలో ఉత్తమ జాతిపశువుల ఉత్పత్తికి, దూడల పెంపకానికీ, శ్రద్ధగా ఏర్పాట్లు చేసి మందలను వృద్ధి చేస్తున్నారని, దూడలనుకొని, పెంచి, తిరిగి రైతులకు, అమ్మేస్తున్నామని మేనేజరు మాకు చెప్పారు.

గోష్ఠం అంతనీ చూసివస్తుంటే అక్కడ ఒక పెద్ద హాలులో 'మిల్క్‌బార్' కనబడింది. అందులో అందరూ పాలు తాగుతున్నారు. వెన్న రొట్టె తింటున్నారు. ఐస్

క్రీమ్ తింటున్నారు. ఇది చూచి చక్రవర్తికి నోరూరింది. ఏదో అడగబోతున్నాడు. అన్నయ్యా! అన్నాడు. ఇంతలో మేనేజరు భాయి "మా ఆతిథ్యం కాస్త రుచి చూడరా?" అని సాదరంగా ఆహ్వానించాడు.

"ఆ ఎందుకులెండి అంటూ మొహమ్మాటము పడుతూనే ఒక్కొక్కరొక్కరే దారితీశారు.

'ఐస్‌క్రీమ్' అన్నయ్యా అన్నాడు చక్రవర్తి అందరికి బిస్కెట్లు ఫలహారం పెట్టి 'రోజ్‌మిల్క్' పోసి చల్లని పానీయంగా యిచ్చారు. 'ఐస్‌క్రీమ్' కూడా తినిపించారు లెండి.

'ఐస్‌క్రీమ్' 'రోజ్‌మిల్క్' మాధుర్యాన్ని తలచుకుంటూ మా మేళం అంతా బయటికి వచ్చేశాం.

"అదండీ సంగతి. ఈవిధంగా పొదుగునుంచి సీసాలలో భద్రపరచేవరకు మా కేంద్రంలో ఇన్ని మార్పులు పొందుతున్నాయి. ఈవిధంగా సీసాలలో భద్రపరచబడిన పాలను ప్రజలందరికీ వారివారి అవసరాలకు తగినంతగా బస్తీలో అన్నిపేటలలోను డిపోలు పెట్టించి సరఫరా చేయిస్తున్నాం. ఆ డిపోలకు పాలబుడ్లను మా స్వొంత లారీలలోనే చేరవేస్తున్నాము. ఆస్పత్రులకూ, కార్పరేషన్ పాఠశాలలకు, కాఫీహోటళ్ళకు మేమే పాలు సరఫరా చేస్తున్నాము. ఇంకా మిగిలిపోయిన పాలను 'ఐస్‌క్రీమ్'గా తయారు చేయించి 'వేన్'లో ఊరంతా త్రిప్పి అమ్మిస్తున్నాము. మా డెయిరీ ఫారమ్ 'ఐస్‌క్రీమ్'ను ఇందాకా రుచి చూశారుకదా ఇదంటే పెద్దాళ్ళకూ, పిల్లలకీ, కూడా బలే ఇష్టం." అంటూ మేనేజరుసాబ్ మమ్మల్ని మళ్ళీ గుమ్మందాకా వచ్చి సాగనంపారు.

'డెయిరీ ఫారమ్' ఎంతో బాగుందికదూ అన్నయ్యా అన్నాడు పట్టాభి.

"నిజమే ఎంతో బాగుంది" అన్నారు సుభద్ర, తోగా.

"ఎంతెంత లేనిపనులు చేస్తున్నారు. బాగున్నాయి ఇక్కడి పద్ధతులన్నీ ఇవి మన పల్లెటూళ్ళకు కూడా పాకితే బాగుంటుందును" అన్నారు నాన్నగారు.

నాకు 'రోజ్‌మిల్క్' బాగుంది అంది సుభద్ర. అన్నిటికంటె 'ఐస్‌క్రీమ్' నాకు బాగా నచ్చింది అన్నాడు చక్రవర్తి.

అందరం 'డెయిరీఫారమ్' గొడవలే చెప్పుకుంటూ ఇంటికి వచ్చేశాం.

స్వాగతమ్

శ్రీ మధురాంతకం రాజారాం

దినకరుని తేజము చల్లనై
దినమంత కంతకు కురుచనై
చలిగాలి రివ్వున వీవగా
నెలవెల్లి గ్రుడ్డిగ దోచగా
పొలమందు ధాన్యపు కుప్పల
తూర్పార బట్టుచు పాడు, నా
నలినాక్షి హృదయాహ్లాదివౌ
సంక్రాంతి! నీ కిదె స్వాగతమ్!
హేమంత ఋతు సీమంతిని
ప్రేమించి తెచ్చిన కానుక
చేమంతి పువ్వులు కొప్పులో
సింగార మొలుకు చునుండగా
క్రొంగొత్త ఓణిని దాలిచి
గొబ్బెమ్మ పూజలు చేయు, మా
చిన్నారి చెల్లికి చెలియవౌ
సంక్రాంతి నీకిదె స్వాగతమ్!

తొలి కోడి కూసెడి వేళకే
జలమందు తానములాడి, మా
సాతాని జియ్యరు వచ్చెను,
ఏతాము ఉరవడి హెచ్చెను!
ఇంటింట ఆటలు పాటలే
అల్లుండ్ర సరసపు మాటలే
హాయ్ హాయి నౌనగే దానవే
సంక్రాంతి నీకిదె స్వాగతమ్!
చవులూర పారము చేసెడి
కోడండ్ర నవ్వుల కల కల,
కవ్వంబు గిర గిర లాగెడి
అత్తయ్య గాజుల గల గల,
తృణ డోలలో ఉయ్యాలలూగే
మను మంచు బిందువు తళ తళ,
నీ రాక పోకలు ఒక కల!
సంక్రాంతి! నీకిదె స్వాగతమ్!

చంద్ర నిర్ణయం

★

'ఇదిగో అమ్మా! ఇంకోసారి ఆమాట చెప్పావంటే నేను వూరుకోను. తిరుగు బండిలోనే మద్రాసు వెళ్ళిపోతా.'

'అదిగాదు చంద్రు. నీకు ఎందుకు అంతకోపం వస్తుందో నాకు తెలియదు! నిన్ను ఏమన్నా చేయరాని పని చేయమన్నానా! పెండ్లి చేసుకోరా అంటే అంత కోపమెందుకూ! ఒక్కగాని ఒక్క కొడుకు. పెండ్లి చేస్తే కోడలు పిల్లలు నీవు మాకళ్ళముందుగా కాపురం చేయడం చూడాలని మీ నాన్న నేను ఎంత అనుకుంటూన్నామో నీకు తెలుసా? ఈ నెలలో నీవు వచ్చినప్పుడు ఏదన్నా కుదుర్చుదామని ఎంతో ఆశ పెట్టుకున్నాను. నీకు నచ్చిన పిల్లని ఏరుకున్నావంటే అంతే మాకు చాలు' అంటూ నిట్టూర్చింది రమణమ్మ.

'అదికాదే అమ్మా ఇప్పుడేమో అలాగే అంటావు. కోడలు అని ఒక ఆవిడ ఇంట్లో కాలుపెట్టగానే ఆవిడకూ నీకూ సరిపోవద్దూ! లేకపోతే ప్రతిరోజూ పోట్లాటలేగా! మీ ఇద్దరి మధ్యా నేను నానా తిప్పలూ పడాలి. ఇలాగే హాయిగా వుండనీవేనన్ను" అంటూ రామచంద్రరావు తన గదిలోకి లేచివెళ్ళాడు.

"అయ్యోరాత! వీడికి ఎక్కడ దొరికారో ఆ స్నేహితులు; వారి ఖర్మం కొద్దీ అటువంటి భార్యలు దొరికితే చంద్రుడు పెండ్లనగానే భయపడతాడు! అందరూ వారిలాగానే వుంటారా! వీడికి ఎన్నటికి బుద్ధి మారుతుందో భగవంతుడా!" అని అనుకుంటూ వంటింటి పనిమీద వెళ్ళిపోయింది.

రామచంద్రరావు ఇంజనీరుగా మద్రాసులో పనిలో చేరి ఇప్పటికి అప్పుడే నాలుగేళ్ళు దాటినై. అక్కడ గది అద్దెకు తీసుకుని వుంటూన్నాడు. ప్రతి సంవత్సరం ఒక నెల సెలవుమీద తలితండ్రులను చూడడానికని ఒంగోలు వచ్చి వెళ్ళేవాడు. పెండ్లి విషయం ప్రస్తావించగానే అక్కడ నుంచె లేచి వెళ్ళిపోయేవాడు. తలి తండ్రులు అతనినీ బలవంతపెట్టి ఒప్పించడాన్కి వెనుదీశారు.

చంద్రు తన స్నేహితులు రాము, మురారిల గృహస్థ జీవితం చూచి తనుకూడా అలాంటి బుద్ధిలేని పని చేయకూడదని అనుకున్నాడు. రాము ఇంట్లో అతని తలిదండ్రులు చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ కలిసే వుంటారు. పెళ్ళయిన కొత్త కదా వారి సరదాకు మనమడ్డు ఎందుకని రాము తల్లి వూరుకోదు. ఒకరోజున చంద్రు వుండగానే రాము తల్లి కొడుకుతో పోట్లాట పెట్టుకుంది. ఇంతకీ అతను చేసిన తప్పు తన భార్య అడిగితే కట్టుకోడాన్కని చీరం, ఏదో బట్టలు తెచ్చాడట! అదీ తను కూతుర్తో "నీ చెల్లెలికి ఒక పరికిణీగుడ్డ తీసుకురారా" అంటే "జీతం రాలే అమ్మా" అన్నాడట! కోడళ్ళు చూస్తే ఇంత ఓర్వరానితనం ఎందుకో ఈ అత్తలకి అని ఆశ్చర్యపోయాడు చంద్రు. రాము పాపం అనలేక అనుభవించలేక బాధపడేవాడు. మురారి ఇంట్లో పరిస్థితి ఇంకొక విధంగా వుండేది. వాని ఇంట్లో అతనూ భార్య ఇద్దరే. ఆ వచ్చే జీతాన్ని భార్య చేతిలో పెట్టేవాడు. ఆవిడా ఇష్టమొచ్చినట్లు ఖర్చు పెట్టేది. ఇరవై రోజుల్లో ముప్పై రోజుల జీతం ఖర్చు పెట్టేసి మిగతా పది రోజులూ చేతిలో డబ్బు లేకపోతే ఎవరినన్నా చేబదులు అడగడం! ఇదీ వారింటి పరిస్థితి. భార్యతో ఖర్చు తగ్గించుమనడాన్కి మురారి కొంచెం వెనుదీసేవాడు. ఆవిడ మనుకు కావాలని అలా చేస్తుందా! అనుభవం చాలక కొత్తచేత అలా చేస్తూందని వూరుకొనేవాడు మురారి. చంద్రుతో 'నన్ను చూచన్నా నీవు బుద్ధి తెచ్చుకోరా! ఇప్పుడప్పుడే పెండ్లి చేసుకోకు నీకు ఇంకా పెద్దజీతమైనాక చూద్దువుగాని' అని తన అనుభవం కొద్దీ చెప్పేవాడు. ఇదంతా చూచిన చంద్రు పెండ్లి వద్దురా బాబూ అనుకున్నాడు.

ఒకరోజున తన గదిలో ఏదో పుస్తకం తిరగవేస్తూ పడుకున్నాడు. అప్పుడే భోజనమైంది. సావిట్లో ఎవరో వచ్చి 'పిన్నిగారూ' అంటూ పిలిచారు. చంద్రు తన చదువులో అంతగా ఆ పిలుపుని పాటించలేదు. రెండు మూడు సార్లు అదే పిలుపు వినగానే అమ్మ వినలేదు గాబోలు అని లేచి సావిట్లోకి వెళ్ళాడు. అక్కడ ఒక

అమ్మాయి వెండి కుంకుమ భరిణె చేతిలో పెట్టుకుని నిల్చున్నది. కొత్త సిల్కుచీర, తలనిండా పూలు, కంటినిండా కౌతుక — 'పిన్నిగారు లేరా?' అన్న ప్రశ్న విని ఉలిక్కిపడ్డాడు చంద్రు. 'ఆ! దొడ్లో వున్నట్టుంది పిలుస్తాను' అంటూ తల్లిని పిలవడానికి వెళ్ళాడు. 'అమ్మా నీకోసం ఎవరో వచ్చారే వెళ్ళిచూడు' అన్నాడు.

రమణమ్మగారి వెనకాలే వచ్చి అక్కడ నిల్చున్న చంద్రుని చూడనట్టుగా ఆ అమ్మాయి రమణమ్మగారితో 'పిన్నిగారూ మా తమ్ముడి పుట్టినరోజు. సాయంత్రం పేరంటానికి తప్పకుండా రండి' అంటూ బొట్టుపెట్టింది." అలాగేనమ్మా, సుశీల బొట్టుపెడుతానుండు' అంటూ రమణమ్మ లోపలికి వెళ్ళగానే అక్కడ తనుండడం భావ్యం కాదని చంద్రు తన గదిలోకి వెళ్ళిపోయాడు.

చదువుతున్న పుస్తకం చదవడానికి మళ్ళీ రాలేదు. అక్షరాలకు ప్రతిగా ఆ అమ్మాయి — సుశీల — కనిపించడం చూచి —ఛీ! ఇదేమిటి ఒక్కసారి చూడగానే నా మనస్సును ఇలా ఆవరించిందే! ఆ అమ్మాయి ఎవరో యేమో! నాకెందుకు ఈ గొడవంతా' అని ఇంకొకసారి పుస్తకం చదవడానికి ప్రయత్నించాడు. ఎంత చేసినా ఆ రూపం, ఆ తియ్యని మాటలు (యెంత కొద్దివైనా) తన నించి దూరం చేయలేకపోయాడు. త్వరలో మద్రాసు వెళ్ళిపోవాలి. ఇక్కడుంటే తనకి మనశ్శాంతి వుండదనుకున్నాడు.

ఒక రోజున పేపరు చదువుతూ అలాగే నిద్రపోయాడు — ఆఫీసునుంచి ఇంటికి వస్తున్నాడు. దారిలో మంచి జాజి పూలు అమ్మడం చూచి 'దానికి' తీసుకెడితే ఎంత బాగుండుననుకుని ఒక బేడ పూలు కొన్నాడు. ఆ పొట్లాన్ని కోటు జేబులో దాచుకుని ఇల్లు చేరాడు. తను ఎదురు చూచినట్లే 'అది' గుమ్మంలో నిల్చుని తన రాకకై ఎదురు చూస్తోంది. తను మెట్లెక్కుతుండగా సిగ్గుతో తలవంచుకుని లోపలికి వెళ్ళింది. కాఫీ ఫలహారం తెచ్చి బల్లమీద పెట్టిన ఆవిడకి ఆ జాజి పూల దండ ఇచ్చాడు. అది తీసుకుని 'ఎక్కడివండి పూలు చాలా వాసనగా వున్నాయి' అన్నది. చంద్రు ఎవరో తనని కొట్టి లేపినట్టు లేచాడు. అవును నిజంగానే అదే కంఠం! 'ఎక్కడివండీ పూలు చాలా వాసనగా వున్నాయి' అంటూంది. మెల్లగా లేచి వెళ్ళి సావిట్లోకి తొంగిచూచాడు.

సుశీల, ఇంకొక ఆవిడ (తల్లి గాబోలు) రమణమ్మగారితో మాట్లాడుతున్నారు. "మా దొడ్లో పూచినవే నమ్మా! పూలు కోయడానికి కూడా నాకు తీరికవుండదు. కొన్నిరోజులు అలాగే రాలిపోతుంటాయి' అన్నది రమణమ్మ.

'ఆ! అది సరేనండి రమణమ్మగారూ! మీ అబ్బాయి వచ్చారటగదా! పెండ్లి సంగతి ఏమన్నా అనుకుంటున్నారా!' అన్నది ఆ వచ్చిన ఆవిడ.

'వచ్చాడమ్మా! మేమెంత అనుకుని ఏం లాభం? పెండ్లి మాటంటే తారామండలానికి ఎగురుతాడు. చేసుకున్న వాళ్ళంతా ఏం సుఖపడుతున్నారు? నాకు ఈ వచ్చే జీతంతో నాకే చాలదే' అంటాడు. ఏం చేయడానికీ తోచటంలేదు మాచమ్మగారూ!'

"దానికేం రమణమ్మగారూ! అందరూ అలాగే అంటూంటారు. మా అన్నయ్యకూడ ఇట్లాగే మాట్లాడ్డం. కావలసినంత ఉన్నది. పెద్దదానికి పెండ్లయింది. ఇక ఇది రెండవది. కట్నం కానుక గూడా ఇవ్వగలరు. మీరు సమ్మతిస్తే పిల్లను ఇక్కడికే పిలుస్తాను. మీరు కాస్త ఆలోచించి చెప్పండి"

("అయితే నీ కూతురికి కాదన్నమాట" అంటూ నిరుత్సాహం చెందాడు చంద్రు)

"ఇంకొకసారి అడిగి చూస్తాను మాచమ్మగారూ. అయినా ఈకాలం పిల్లలకి పెద్దలు చెప్పిన మాటంటే శ్రద్ధేలేదు"

"ఆ మాట ముమ్మాటికి నిజం. చూడండి మా సుశీల కూడా అంతే. చదివినంత వరకూ చాలు అంటే వినదు. బి. ఏ. పూర్తి కావాలి అని పట్టు బట్టింది. ఇంకొక సంవత్సరం వరకూ పెండ్లి మాట మానెయ్యమంటుంది. దాని తండ్రికి ముద్దుల కూతురు. అది చెప్పినట్టే జరిగి తీరాలంటారు."

"కాదండీ పిన్నిగారూ. మీరే చెప్పండి బి. ఏ. పూర్తయినాక పెండ్లి మాటంటే అమ్మకు ఎందుకు అంతకోపం వస్తుందో! ఇంకొక సంవత్సరంలో యేమంత మునిగిపోతుంది, మీరే చెప్పండి?"

("నీకుకూడా నాఅంత పట్టుదల వున్నదే!" అనుకున్నాడు చంద్రు)

చంద్రు నిర్ణయం

ఆదయినాక కొద్దిసేపటికే వాళ్ళిద్దరూ లేచి వెళ్ళారు. "చంద్రా కాఫీ తాగుతావా?" గ్లాసుతో లోపలికి వచ్చిన తల్లినిచూచి 'ఎవరే అమ్మా ఆ వచ్చింది' అని తెలియనట్టుగా అడిగాడు.

"వాళ్ళే, మొన్న పేరంటం పిలువ వచ్చిందే ఆ అమ్మాయి సుశీల. దాని తల్లిను. ఏదో పెండ్లి సంబంధ మట ఆవిడ అన్నకూతురుట మీరు చూచేందుకు ఒప్పుకుంటే ఇక్కడికే పిలిపిస్తానన్నది దీనికి నిన్నడిగి చెపుతానని పంపాను."

"అయితే తనకూతురికి కాదన్నమాట" అన్నాడు తనతల్లివేపు చూసి నవ్వుతూ."

"ఆ అమ్మాయి చాలా మంచిదిరా! పిల్లలంటే అలా వుండాలి. చదువుకున్నందుకు ఎటువంటి పొగరుబోతుతనం లేకుండా ఎంతో అణుకువతో నా దగ్గిర ప్రవర్తిస్తుంది. దానికి బి. ఏ. పూర్తికావాలంటుంది. తల్లికి అంతగా ఇష్టంలేదు. అయినా ఇప్పటికాలంలో చదివితే మటుకూ ఏంతప్పు. సుశీల చెప్పినట్టు చదువు పూర్తయినాకే పెండ్లి కావడం మంచిది."

"అయితే నువ్వు ఆ అమ్మాయి పక్షంగానే మాట్లాడుతున్నావన్నమాట అవునాఅమ్మా"

"అవునురా. అది బుద్ధిమంతురాలు. క్రొత్త సంసారంలో అంతశ్రద్ధగా చదువుకోడం వీల్లేదని తెలుసుకుంది సగంలో ఆపటంకంటే, ఒక సంవత్సరం ఆలస్యమైనా పరీక్ష అయినాక పెండ్లి చేసుకోవడం మంచిది. అన్నిట్లోను చురుకైనపిల్ల. ఇంటిపనులలో, కుట్లు, చదువూ— అన్నీవచ్చు. ఎవరు భాగ్యం చేసారో అటువంటి పెండ్లాం దొరకడానికి!" అన్నది ఎంతో నిరుత్సాహంతో.

"అదికాదే అమ్మా. ఆవిడ అన్నకూతురి కోసం వచ్చి పోతే, నీవుదాన్ని మాని ఆవిడకూతురినే పొగుడుతున్నావు కదే!" అన్నాడు నవ్వుతూ.

"ఆ! ఆ అమ్మాయిని చూచానురా! ఒట్టి పల్లెటూరి రకం. నాకే సరిపోలేదు. అందుకనే నీవిప్పుడు పెండ్లి చేసుకోవని చెప్పాను" అయినా మాణిక్యం వంటి అమ్మాయి ఎదురుగా వుంటే ఆ పల్లెటూరి పిల్ల ఎవరికి నచ్చుతుంది అంటూ తన పనిమీద వెళ్ళి పోయింది రమణమ్మ.

చంద్రుకు సెలవలు అయిపోతూ వున్నాయి. ఇంకొక రెండు రోజుల్లో ప్రయాణం చేయకోవాలి. తన బట్టలన్నీ సర్దుకుంటూ వున్నప్పుడు సావిట్లో ఎవరో చెప్పులు వదులుతున్న చప్పుడువిని లేచివచ్చి చూచాడు. సుశీల అతనిని చూచి అక్కడే నిలబడింది. "పిన్నిగారు లేరా?"



'లేదు ఇప్పుడే ఎవరింటికో వెళ్ళింది. అమ్మతో ఏమన్నా చెప్పాల్సి వచ్చావా? అమ్మరాగానే చెపుతాను"

"ఏమీలేదు మాకు కాలేజీతెరిచారు రేపు గుంటూరికి వెళ్తాను చెప్పిపోదామని వచ్చా" అన్నది.

"అయితే ఇదే ఆఖరి సంవత్సరమన్నమాట. బి. ఏ. కాగానే ఇంకా చదువుతావా?" అంటూ మెల్లగా మాటలకు ప్రారంభించాడు.

"నాకు చదవాలని వున్నా మా నాన్న అమ్మ ఒప్పుకో వద్దూ? ఇంతకీ నేను ఈ సంవత్సరం పూర్తి చేసినాక కదా ఆ ఆలోచన?" అన్నది నవ్వుతూ.

"నీవు పెండ్లికూడా వద్దని ఇంత ఆసక్తితో ఈ సంవత్సరం పూర్తిచేయడం నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. పెండ్లి అయినాక చదవకూడదా?" అన్నాడు.

"నాకు ఆ ఆలోచన అంతగా నచ్చలేదు. ఒక్క ఏడు నిదానిస్తే ఏమంత మునిగిపోతుంది. మీరు పెద్ద జీతం వచ్చేవరకూ పెండ్లి వద్దనడం బాగుందిగానీ నేను చదువు పూర్తయే వరకూ వద్దన్నది ఆశ్చర్యంగా వున్నదా? అన్నది కొంటెగా నవ్వుతూ.

"అపును నాకు వచ్చేజీతం నాకే సరిపోకుంటే పెండ్లి చేసుకుని ఆ వచ్చేమనిషిని కూడా పోషించడం ఎలాగా మరి?"

"అదీ నిజమే ఆవిడ ఏమురారి భార్యలాంటిదో వస్తే అవును మీపని!"

"మురారి భార్య నీకుతెలుసునా? ఎవరు చెప్పారా విషయం?" ఆశ్చర్యంతో అడిగాడు.

"మీ అమ్మగారే! అదీగాక మురారి భార్య ఇంటరులో నాతో చదువుకున్నది. హాస్టలులో మేమంతా వున్నప్పుడు మాకు ఇంటినుంచి పంపిన డబ్బుతో సరిపెట్టుకుంటూంటే ఆవిడ చాలక మళ్ళీ ఒకసారి తెప్పించుకునేది. మేమెంత చెప్పినా దుబారా ఖర్చును తగ్గించేది కాదు."

"అయితే ఆవిడ అలవాటు, అంతేగానీ, నిజంగా మురారి జీతంచాలక కాదు వారింటి పరిస్థితికి అన్నమాట. అంతేనా?"

"అంతే ఎంతపెద్ద జీతమైన ఆవిడ ఖర్చు పెట్టడములో వుంది. పొదుపుగల మనిషైతే కొద్దిలోనే సరిపుచ్చుతుంది. అంతేకాని అందరూ మురారి భార్యలాగ వుండరు" అన్నది నవ్వుతూ.

"అయితేనేను పొరబడ్డాను. కానీ మన అనుభవానికి వచ్చేదాక ఆసంగతి మనకు తెలియదుకదా!"

"క్రొత్త వాళ్ళయితే ఆభయం. కానీ చాలాకాలం నుంచీ ఒక కుటుంబానికి తెలిసిన వాళ్ళయితే ఆ భయం వుండదు"

"ఇప్పుడు నాకువచ్చే జీతంతో సుఖంగా సంసారం గడపవచ్చు నంటావా? అంతేనా" అన్నాడు అర్థగర్భిత నయనాలతో సుశీలవైపు చూస్తూ.

"నాకేం తెలుసు, మీకు ఎటువంటి భార్య రానున్నదో ఆవిడను బట్టి వుంటుంది. అదీగాక మీకు త్వరలోనే ఇంక్రిమెంటు వస్తుందటగా! మీరు ఆతరవాతనే గృహస్థ జీవితం ప్రారంభించ వచ్చుగా!"

"నావిషయాల్లో నీవు చాలా ఆసక్తి చూపావే?"

"అవునుమరి మీరు నావిషయాలను మీ తల్లిగారిని అడిగి తెలుసుకోలేదా! నేను మాత్రం వూరుకుంటానా?"

"ఏమోననుకున్నాను! భలే తెలివిగలదానివే! అయితే నీవు ఏ నిర్ణయానికి వచ్చావు?"

"నేను వక్కతేకాదు మీ తల్లిదండ్రులు, మా తల్లిదండ్రులు కలిసే నిర్ణయానికి వచ్చారు మీకు ఇంక్రిమెంటు, నాకు పరీక్ష కాగానే మాట్లాడుదామని అనుకున్నారు."

"అయితే మీరింతమందిచేరి నన్ను ఒక్కడిని ఒప్పించడాన్కి ప్రయత్నించారన్న మాట. ఆనాడు ఆనాటకం కూడా నాకొఱకే ఆడారన్నమాట. ఇందరిని ఎదిరించడాన్కి నాయందు శక్తి చాలనందున, మీరు నిర్ణయించిన దాన్ని ఒప్పుకున్నట్టుగా అందరికీ నీచేతెలుపు. సరేనా?" అన్నాడు చంద్రు సంతోషం నిండిన హృదయంతో.

అప్పుడే లోపలికి ప్రవేశించిన రమణమ్మ "నేను విన్నానులే! ఈ ఫలితానికని ప్రతిరోజూ ఎదురు చూస్తున్నాను. నేటికి నా మనస్సు నిశ్చింతగా వుంది. ఇన్నేళ్ళనుంచినీవు వినకుండున మంచి భార్యనే పొందావు. సుశీల వంటి భార్య రావడాన్కి నీవు, కోడలుగా పొందడాన్కి మేము, ఎంతో అదృష్టవంతులము." అంటూ అక్కడ వచ్చి ఇద్దరి మధ్యా నిలబడ్డది.

"అమ్మా అంతలో త్వరపడకూ. ఇంకొక ఏడు నీవు ఓపిక పట్టాలే కోడలు రావడానికి. కదు సుశీలా?" అన్నాడు దానివేపు చిలిపిగా చూస్తూ.

"అదేమిట్రా? ఇంకొక ఏడెందుకే? మరీ విడ్డూరం గావుందే?"

"అవునమ్మామరి, సుశీల తన పరీక్ష కొఱకు, నేను ఇంక్రిమెంటు కొరకు చూస్తున్నాము. అది కాగానే నీ కోర్కె చెల్లిస్తాము. అంతే."

"నీ సంసారం ఎవరి సంసారం లాగుండబోతుంది? రాము, మురారి నీ నిర్ణయాన్ని గురించి ఏం చెప్తారో ఆలోచించావా?" అన్నది రమణమ్మ నవ్వుతూ.

"ఎవరిలాగున్నాసరే అమ్మా, అంత అనుకూలాల మధ్యావారు ఎంత సంతోషంగా వున్నారో నాకిప్పుడు కొద్దిగా బోధపడుతున్నది. ఏదో ఎవరి అదృష్టం వారిది. మేము మటుకు ఈ చిన్న ఆటంకాలను లెక్క చేయకండా మా జీవితాలను సంతోష మయంగా చేయ నిశ్చయించాము" ప్రేమ పూరిత నయనాలతో సుశీల వైపు చూస్తూ అన్నాడు చంద్రు.

అదంతా ఎక్కడ?

శ్రీ బాబూ

నలుగురు ఆడపిల్లలం
నవ్వుతూ కూర్చున్నాం
రైలు కదిలింది
రమాదేవి పుస్తకం
రాజకుమారి బొమ్మలు
లక్ష్మీదేవి పత్రిక
దీక్షగా చూస్తున్నారు.

నాకు ఏమీతోచక
నాలుగువైపులా చూశాను.
పురుషులూ, స్త్రీలూ,
పిల్లలూ, తల్లులూ
చాలమంది ఆపెట్టెలో
చోటులేక నిలబడ్డారు.

మేముకొంచెం జరిగి
ముగ్గురికి చోటిచ్చాము
వేగంగా పోతుంది రైలు
సగంమంది నిద్రపోయారు
చల్లగాలి వీస్తోంది
చెవులకు చేతిరుమాలుకట్టి
చెల్లాయి ప్రక్కకు జరిగి
కళ్ళుమూసుకున్నాను.

పైనుండి ఏదో
పడింది కాళ్ళమీద
ఉలిక్కిపడిలేచి
కళ్ళుతెరిచి చూశాను
కాళ్ళమీద పడినది
నల్లఅట్ట పుస్తకం
తీసిచూశాను.
తెల్లకాగితాలు
నీలిరంగు రూళ్ళు
మూడుపేజీల తర్వాత
ముత్యాల్లాంటి అక్షరాలు
చదవకూడదనుకుంటూనే
చదవడం మొదలుపెట్టాను.

"అడిగావు కనుక
అన్నీ చెపుతున్నాను
పూలతోటలో నేను
సిరిపూవును.
చల్లగాలికి ఆడి
పిల్లగాలికి పాడాను.
కాళ్ళక్రిందపడి
నలిగిపోయానుకడకు
రాజభవనంలో నేను
రాకుమారునిగా పుట్టి
యుద్ధాలు చేసి
పెద్దరాజ్యం స్థాపించి
పసిడిసింహాసనంమీద
పాలించాను రాజ్యం
హంసతూలికా తల్పంమీద
హాయిగా నిద్రపోయాను.
రాత్రివేళ ఒకరోజు
మంత్రి బాకుతోపొడిచి
నన్ను చంపివేశాడు.
నా రాజ్యం తీసుకున్నాడు.
తర్వాత నేను తిరిగి
ధనికునియింట పుట్టాను.
చదవుకోడానికి
చెన్నపట్నం వెళ్ళి
కాలేజీలో చేరి
ఖర్చుపెట్టానుడబ్బు
కాని చదువు రాలేదు
కడకు లౌవ్‌లో దిగి
రాధను ప్రేమించాను
రాధలేకపోతే
బాధగా ఉండేది
రాధ నాన్నగారు
పదివేల కట్నంతో
పద్మనాభంగారి కొడుక్కి
రాధమ్మనిచ్చారు.

ప్రియురాలు లేనందున
పెట్టెలు పగలుగొట్టి
పుస్తకాలు చింపాను.
పిచ్చియెక్కిందని
ఆసుపత్రిలో నన్ను
అయిదునెలలుంచారు.

బయటకు వచ్చేసరికి
పైసాలే లేకపోయింది.
పల్లెటూరు చేరి
పకీరునయ్యాను
బికారినయ్యాను
భుజానికున్న సంచితో
భిక్షకై తిరిగాను
పట్టెడన్నమైనా
పొట్టకు దొరకలేదు.
కారడవిలో చేరి
గజదొంగనయ్యాను
దారులుకాచి
దొంగతనాలు చేశాను.

దొరలు పట్టుకొని
నేరం చేశానని
నాలుగుగోడలమధ్య
జైలులో పెట్టారు.
ఆ చీకటి జైలులో
అలసిపోతున్నాను
ఏదోరోజు రాత్రి
ఎవరికీ కనబడకుండా
ప్రహరీ గోడదాటి
పారిపోయివచ్చాను.

ఇదంతా జరిగింది.
ఎక్కడనుకున్నావు?"
అనే ప్రశ్నతో
అవ్రాత ఆగిపోయింది.
ఇంకేమైనా ఉందని

అదంతా ఎక్కడ ?

ఒక్కొక్క పేజీ తిరగేసి
జాగ్రత్తగా చూశాను
ఎక్కడా అందులో
ఒక్కమాటకూడలేదు.
అన్నీ తెల్లకాగితాలు
సన్ననినీలిరూళ్ళు
ఆపుస్తకం మూసివేసి
ఆలోచించాను అరగంట.
అది చదివేటప్పుడు
అతనిగురించి నాకు
జాలివేసింది
కోపమొచ్చింది
భయముకలిగింది
పైకి కనిపిస్తున్న
బంగారు గొలుసు
జాకెట్టులోకి త్రోసి
పవిటచెంగుతీసి
మెడచుట్టూ చుట్టాను.
అయినా నాకెందుకో
అతనిగురించి భయం
అంతకంతకెక్కువయింది
చెంతనున్న పెద్దవారితో
అతనిగురించి చెప్పి
పోలీసువారిని పిలిచి
పట్టిద్దామనుకున్నాను.
అయినా ఒకసారి
అతనిని చూద్దామని
పైకి లేచాను
పైనిపరుపుమీద
నల్లని దుప్పటొకటి
కాళ్ళనుండి తలవరకూ
కప్పుకొని హాయిగా
నిద్రపోతున్నాడు
ముఖం కనబడలేదు
ఇంకా రెండు పుస్తకాలు
క్రింద పడటానికి
సిద్ధంగా ఉన్నాయి
నాదగ్గరున్న పుస్తకం
నలిగిపోకుండా తిరిగి
అతని పరుపులో పెట్టి
కూర్చుందామనుకున్నాను.
ఆడపిల్లను కనుక
ఆపని చేయలేక
అక్కడే కూర్చున్నాను
ఎప్పుడు పట్టిందో నిద్ర
ఎలాగపట్టిందో నిద్ర
నాకు తెలియకుండానే
నేను నిద్రపోయాను
మెలుకువ వచ్చేసరికి
తెల్లవారిపోయింది
విజిలువేసి రైలు
విజయవాడలో ఆగింది.
పైనిపడుకున్నతను
బెడ్డింగు చుట్టి
క్రిందకు దిగివచ్చి
ఎదురుగా కూర్చున్నాడు
దొంగలాగలేడతను
ఉంగరాల జుట్టు
విశాలమైన కళ్ళు
వెడల్పైన నొసలు
సుకుమార శరీరం
సువర్ణఛాయ
కలిగి ఉన్నాడతను.
నల్ల అట్టపుస్తకం
నాదగ్గరే ఉంది
అతనికిచ్చివేయాలని
అనేకసార్లు తీశాను.
పలకరించలేక
పుస్తకం ఇవ్వలేదు.
ఆస్టేషనులోనే
అతను దిగిపోతున్నాడు
ఆ పుస్తకం నేను
అతనికివ్వకపోవటం
అన్యాయమనిపించింది
"ఏమండీ ఈపుస్తకం
తమరిదేమో చూడండి"
అని ధైర్యంగా లేచి
అతనితో అన్నాను.
ఆయన ఆశ్చర్యంగా చూసి
ఆపుస్తకం తీసి
"ఔను నా పుస్తకమే
మీకెలాగ వచ్చింది ?
ఎక్కడ దొరికింది ?"
అడుగుతూనే అతను
ఆరైలుపెట్టెనుండి
క్రిందకు దిగిపోయి
కిటికీదగ్గర నిలబడి
చాల థాంక్సు అన్నాడు.
అయితే అది జరిగింది
ఎక్కడో చెపుతారా ?
అడిగాను నేను.
అతను నవ్వుతూ అన్నాడు
"ఇదంతా ఈరైలులో
అదంతా నాకథలో."
రైలు కదిలింది
మైలు దాటింది
మలుపు తిరిగింది.
మలుపురాక యీసంగతి
మీతోయిప్పుడు చెప్పాను.



సాటిన్ లాంటి శరీరం

"శరీరాన్ని సాటిన్‌లాగ ఉంచుకోవటం సాధ్యమా అంటే": "ఎందుకుకాదు" అన్న సమాధానం సందేహించకుండా ఇయ్యొచ్చు. రాత్రింబగలు సాటిన్‌లాగ మెరిసేట్లు మన శరీరాన్ని చేసుకోవటం మనచేతిలో ఉంది. శరీరసౌకుమార్యాన్ని పొందటానికి చేయాల్సిన ముఖ్య పద్ధతి స్నానము.

ఈస్నానము చేయటంలోని వివిధ విధములు వింత వింత అందాలను ఇస్తాయి. అందులో ముఖ్యమైనవి చూదాము.

స్నానము ప్రతి రోజు ఉదయము చేయటం వంటికి మనసుకికూడ మంచిది. లేవగల్గి చేయగల్గితే ప్రొద్దుట ఆరుగంటలలోపల చేస్తే ఎంతో హాయిగా రోజంతా గడుస్తుంది.

కొంతమంది దృష్టిలో స్నానము చేయటం మడికోసమని. అందుకని అన్నం తినేముందు, లేకపోతే వంట చేసేముందు చెంబుడునీళ్ళు ఆదరాబాదరా పోసుకొని స్నానమయిందని ఎంచుకొంటారు నిజానికి స్నానము ఆచారంకోసముకాదు, శుభ్రతకోసం. మన పూర్వులు పెట్టినదికూడ అదే ఉద్దేశం. ఆచారమనే వంకతో శుభ్రత నేర్పించుదామని వ్యాళనుకొంటే ఆచారంవంక అశుభ్రత జాస్తి అవుతుంది. ఇది మనవాళ్ళ తెలివి లేమి అనాలి. వంటకు ముందు శుభ్రంగా ఉండకపోతే తినేవస్తువులు కూడ శుభ్రంగా ఉండక ఆరోగ్యం చెడిపోతుంది. ఆ శాస్త్రం చెప్పక ఆధారం లేకపోతే పాపం అన్నారు మన పూర్వులు. దానికి వ్యతిరేకంగా మడిబట్టకదా అని తానెడు తడిబట్టను చుట్టుకొని చూసేవాళ్ళకు చికాకు పుట్టిస్తారు.

సరే ఇక దాన్ని వదిలేసి అసలు విషయాన్నికి వద్దాం. స్నానం అంటే రక్తం బాగా పారేట్లు, వంటికి అతికిన మన్ను పోయేట్లు బాగా రుద్దుకొని, బోలెడునీళ్ళు పోసుకొనేది మాత్రమే. వల్లు కొంచెం గట్టిగ సోపుతోనో, సీకాయతోనో, సుండిపిండితోనో కొంచెం గట్టిగ రుద్దుకోవాలి. ఈచలికాలం సోపును తగ్గించివాడటం మంచిది. సీకాయపొడిని, నూనెను, పసుపును కలిపి రుద్దుకోవటం వలన వంటికి మెరుపువస్తుంది. ఇక అదికాకపోతే పెసరపిండి (ఇతర పిండ్లు కలపకుండ) లో గామంచాలు, కస్తూరి పసుపువేసి రుద్దుకొంటే సువాసనతో, చక్కని చాయతో, మెత్తగ మెరుస్తుంది శరీరం.

సోపునుపయోగించేటట్లైతే చేతితోకంటే, స్పాంజితోనో, **Bath Bresh** తోనో రుద్దుకోవటం మంచిది. ఇవేవికాకపోతే సోపును శుభ్రమైన తువ్వాలడు రాసి రుద్దుకోవచ్చు.

ఇక స్నానాన్నికిముందేమి చేయాలో చూదాం. ముఖ్యంగా ఈచలికాలంలో రోజు నూనెరాసుకొని

శ్రీమతి సువేణి కాశ్యప్.

పోసుకోవాలి. నూనె రాసుకొని పెసరిపిండినలుగు పెట్టుకొంటే వంటికి చాల మంచిది. రక్తం గూడుకట్టటం అనేదిలేకుండా రక్తం బాగా పారి చక్కని చాయతో అందర్ని ఆకర్షిస్తూ ఉంటుంది మనశరీరం.

ఇదికాకపోతే మరోపద్ధతి చేయవచ్చు. అది ఉప్పు నూనెతో మసాజ్ చేయటం. ఉప్పును మెత్తగనూరి. లేకపోతే **Table Salt** ను రెండు **Tea Spoones** ఒక కప్పులో వేసి దానిలో కొంచెం నీళ్ళు పోసి బాగా ఉప్పంత కరిగిపోయేంతవరకుంచి అందులో ఉప్పునీళ్ళకు రెట్టింపు కొబ్బరి నూనెవేసి పాల తెలుపు వచ్చేంతవరకు చిలకరించి దానితో **Massage** చేస్తే నిస్సందేహంగా శరీరం సాటిన్ లాగ మెరుస్తుంది. ఇందులో కొబ్బరి నూనెకు బదులు ఆలివ్ నూనె వేస్తే బాగా పని చేస్తుంది. ఇలా **Massage** చేసిన తర్వాత శీకాయతోనో, సున్నిపిండితోనో రుద్దుకోవటం మంచిది.

ఇవి చేసినా చేయకపోయినా రోజు స్నానం చేసే గంగాళము నీళలో ఏడెనిమిది బొట్లు కొబ్బరి నూనెవేసి పోసుకోవటం వలన ఉపయోగం చాల ఉన్నది. ఈపద్ధతి వేసవిలో తప్ప ఇతరకాలాలలో చేయాలి.

ఇంకా అందంగా ఉండాలంటే స్నానం చేసే **Tub** లో ఒక ఔన్సు పాలు కలిపి దానితో స్నానం చేస్తే శరీరం పాలు కారుతున్నంతనున్నగ మెరుస్తు, నీడ కనిపిస్తూంటుంది.

ఇక శరీర సౌరభంకోసం కావాలనుకొంటే స్నానం చేసే నీళ్ళలో పన్నీరుగాని మరువంగాని వేసి నానబెట్టి పోసుకోవచ్చును.

స్నానం అయిపోయాక మంచి తువ్వాలతో దేహన్నంతా శుభ్రంగ తడిలేకుండా తుడుచుకోవాలి. ఇది తెలియని విషయంకాదు. కాని దాని ఉపయోగమెంతో చాలమందికి తెలియకపోవచ్చును తడిలేకుండా తుడుచుకోవటం వలన మనకు తెలియని చిరాకుపోతుంది. అసలు ఇలా కొంచెమెక్కువగ తుడవటంవలన, రుద్దినా, పోని సున్నిపోతుంది. ఇంకా, కొంచెముసేపు తడిలేకపోయినా టవల్‌తో (టర్కీటవల్) తుడిస్తే అదొకరకమైన మెరుపు వస్తుంది,

స్నానము వేన్నీళ్ళతోకంటే చన్నీళ్ళతో చేస్తే ఆరోగ్యంగా ఉంటుంది. ఎప్పుడుపడితే అప్పుడు చేయటంకూడ మంచిదికాదు. ఉదయము సాయంత్రము రెండుపూటలు స్నానం చేసే అలవాటుంటే చేసినందువలన ప్రమాదం లేదు. అలాంటప్పుడు ఉదయము బాగా శాస్త్రోక్తంగా పోసుకొని సాయంత్రమప్పుడు మామూలుగ తొందరగ పోసుకోవటం మంచిది.

సోపులు వాడేటప్పుడు రోజుకొక క్రొత్తరకం వాడటం అంతమంచిదికాదు. ఒకే సోపు వాడటంవలన శరీరస్థితి ఒకేమాదిరి ఉంటుంది. కొన్ని సోపులు దేహాన్ని పెల్లేట్లు చేస్తాయి. అందుకని సోపులు కొనేటప్పుడు జాగ్రత్తగ చూసికోవాలి. మంచి సోపులు, వాడుకలో ఉన్నవి కొనటం మంచిది.

కురుపులు లేచినప్పుడు, ఒల్లు దురదలు ఉన్నప్పుడు వేప నూనె ఒంటికి రాసుకొని మార్గోసోపులాంటివి రుద్దుకోవటం శ్రేయస్కరం. వేపపుల్లలు కాగేనీళ్ళలో వేసి ఆనీళ్ళు పోసుకొన్నా కురుపులు, చీడమొదలైనవి మాని పోతాయి.

ఇలా రోజు శ్రద్ధతో స్నానం చేస్తే శరీరం సాటన్ లాగ మెరవటమే కాకుండ చామంతి పుష్పంలాగ చక్కగ ఉంటుంది.



మనలో మనమాట

కోడి! ఏమంటావు?

శ్రీమతి లక్ష్మీరఘురామ్

అది ఒక నల్లకోడి. రొమ్ము వెడద. పొట్టిగా లావుగా వుంది.

డిసెంబరు రోజులు. ఇంట్లో మంచి తాజావి కోడి గ్రుడ్లున్నవి. పొదగవేస్తే బాగుంటుందని అన్నది తోట వాడి పెళ్ళాము. సరే నన్నాను.

గ్రుడ్లు పొదగవేసిన వారము రోజులకు మెరుపులు, ఉరుములు. మద్రాసులో వాన, కోడి గ్రుడ్లు మురిగి పోతాయి. నీటికోసం ప్రజలంతా అల్లాడి పోతుంటే కోడి గ్రుడ్లు మురిగిపోతే మునిగి పోయిందేమిటి. అనుకున్నట్లే ఇరవై ఒక్క రోజులకు చక్కటి తెల్లపిల్లలు రెండు దిగినవి. మిగిలిన గ్రుడ్లు మురిగిపోయిన వన్నమాట.

రెండు మూడు రోజులు నూకలు వేశాము. కోడి చక్కగా ముక్కుతో పొడిచి తినటం నేర్పించింది, ఆ పిల్లలు చక్కగా నేర్చుకున్నవి. బేడ్మింటను బంతుల వలె కోళ్ళ గంపలో గుడుగుడు మంటు తిరుగు తున్నవి. గంపదగ్గరకు వెళ్ళి నూకలు వెయ్యబోతే తన పిల్లల నేమైనా చేయబోతున్నామనుకొని ముక్కుతో పొడుస్తుంది. ఆ తీక్షణతచూస్తే అదిఒక రాక్షసివలె వుంటుంది. మాతృప్రేమ అంత శక్తి నిస్తుంద కాబోలు తల్లికి !

పిల్లలు దినదినాభి వృద్ధి పొందుతున్నవి. గంపను వదలి చక్కగా బయట తిరుగు చున్నవి. నల్ల పెట్ట చక్కగా పిల్లలను రక్షించు కుంటుంది, ఏదైనా ఆహారము కనబడగానే క్కొ క్కొ క్కొ అని తను తిన కుండా పిల్లలను పిలిచి వాటికి ఆ ఆహారము తినిపించి తాను ఇంకో చోటు ఆహారము వెతుక్కుంటూ పోయేది. కోడి-పిల్లలకు ఇంకా ఒక బారెడు దూరములో నేనుండ గానే రెక్కలు విప్పుకొని రాక్షసివలె వచ్చి మీదపడి ముక్కుతో పొడిచేది. పిల్లలు ఆరు నెలలకల్లా తలంత యినవి, ఇహ తల్లికి పిల్లల బాధ్యతలేదు. దేనిదారి దానిది రెక్కలు వచ్చేవరకంటే ఇదే కాబోలు.

గిర్రున ఏడాది తిరిగొచ్చింది. ఈసారి కోడిని పొద గేద్దామని హెచ్చరించింది తోటవాడి పెండ్లాము. సరే నన్నాను.

చక్కటి తాజా గ్రుడ్లు పదిహేను వేసింది కుంపట్లో. తోటాడి పెళ్ళామూ పిల్లలు గలదే. దాని చెయ్యిరాశే ! ఈసారి వానలేదు వరద లేదు. మద్రాసు పంపుల్లో నీళ్ళుంటేనేమి లేకుంటే నేమి, కోడి గ్రుడ్లు 13 పిల్లలయి నవి. 13 మంచి అంకె కాదన్నాడు ఒక ఛాందసుడు.

కోడి పిల్లలు యధావిధిగా గంపక్రింద వేయ బడ్డవి. నూకలు నీళ్ళు పోస్తున్నారుకాని ఈసారి తల్లిలో మార్పు !!

మునుపటివలె ఆహారము చూపుతుంది పిల్లలకి. పిల్లలన్నీ వచ్చి తింటూన్నప్పుడు వేరే స్థలములో ఆహారము వెతుకుతూ వుంటుంది. దాని వెంటే కొన్ని బయలు దేరుతవి. రెండు మూడుచోట్ల చూపుతుంది. ఆహావేసారి పోతుందేమో బుట్టదగ్గిర నీడలోకి వచ్చి మట్టిలో చక్కగా గురిగెలాకూర్చుంటుంది. సరే ఇంతలో నాలుగైదు పిల్లలు అక్కడికీ తయారే. రెండు వీపుమీద ఎక్కుతవి. ఒకటి ఒక

కాలూ ఇంకొకటి ఇంకొక కాలూ పట్టుకు పీకుతవి. ఇంకొకటి కోడి చుట్టూ తిరుగుతూ తిరుగుతూ ఆడు కుంటూ వుంటుంది. బుట్ట పైనుంచి వేసిన నూకలేమయినా ఇరుక్కొని వుంటే పిల్లలు మూడు ఒక్క నూక కోసము ఎగబడుతవి. పాపము కోడి ఏమి చేస్తుంది. కూర్చున్నది కూర్చున్నట్లే ఉన్నది—కొన్నాళ్ళకు వేళ్ళు రక్తము కారటము ఆరంభించినది. టించరువేసి తెల్లగుడ్డ కట్టు కట్టాము టించరు రంగు చూచో రక్తము చూచో కట్టు గట్టిన గుడ్డను కోడి పిల్లలు గాయాన్ని ముక్కుతో పీకి రసాభాసా చేసినవి. ఎన్నాళ్ళున్నా గాయము నయము కాకపోగా ఇంకా ఎక్కువగా రక్తము కారడము ఆరంభించింది. పిల్లలకి వెతకి ఆహారము చూపించటము లేదు. అవే వెతుక్కో నారంభించినవి. ఎప్పుడో ఒకప్పుడు లేచి (దానికిఓపికున్నప్పుడు కాబోలు) గప్‌చిప్‌గా కాస్త తాను తినేది. పిల్లలను దగ్గరకు పిలిచేది కాదు.

ఏమిటోదాని ఉద్దేశము? పిల్లలు ఆరు నెలలు పెరిగి మునుపటి సారి రెండు పిల్లలు రెండు నెల్లప్పుడు ఎంతున్నవో అంతే వున్నవి. వాటికి తగిన రక్షణలేదు. తల్లెప్పుడో రిసైను చేసినట్లుంది! గద్ద ఒక పిల్లని, కాకి ఒక పిల్లని వంతులు వంతులుగా వేసికొని పోవుచున్నవి. ఇదివరకువలె ఎక్కడ తిరుగుతున్నా పిల్లలకుహాని చేస్తారేమోనని కనిపెట్టుకొని వుండదు. శత్రువులను బెదరటానికి రాక్షసివలె ఎగరదు!

ఈ మార్పుకు కారణము? కోడి నేర్పిన పాఠము మానవులకు వర్తిస్తుందా?

ఏమో! ఎటూ తేల్చి చెప్పలేమేమో

చెప్పదలచు కుంటే చెప్పొచ్చునుగాని. ఎందుకు చెప్పటం. ఎవరికి వారే తోచిన నిర్ణయాలు చేసుకుంటే మంచిది.

ఇకంతా మనలో మనమాటేసుమండీ!

పొడుపు కథలు

శ్రీమతి డి. బదరీ నారాయణమ్మ

1. ఉష్ట్రమస్య సమంవస్తు వస్తునా మత్రియక్ష్యాక్షరం చకారాది. లకారాంతం

2. చాంద్రమానసమాయుక్తం వస్తునామత్రియక్ష్యాక్షరం అకారాది, క్షకారాంతం

3. వృక్షేగ్రవాసీ, నచపక్షిరాజః చర్మాంగధారీ, నచసోమయాజీ త్రినేత్రధారీ, నచశూలపాణిః జలంధరిత్రీ నఘటో నమేఘః

4. ఆకసముననుండు, నది పక్షియునుకాదు. తోకకలిగియుండు మేకకాదు. త్రాడు కలిగియుండు. తలపనెద్దుయు కాదు. దీనిభావమేమి. తిరుమలేశ.

5. దేహమంతదేవేంద్రునికండ్లు తనకు జీవము లేదు. తగు జీవులనుచంపు. దీనిభావమేమి తిరుమలేశ

(జవాబులు :— 76. వ పేజీలో చూడండి)





పండ్లతో పిండి వంటలు

[చాలామంది పాఠకులు పాకశాల శీర్షిక కావలయునని కోరుటచే ఈ శీర్షికను ప్రతినెలా ప్రకటించదలచాము. సం॥]

అరటిపండు ఫ్రిట్టర్లు

6. అరటి పండ్లు
చిక్కని కొబ్బరపాలు.
2. టేబిలు స్పూన్ల మైదాపిండి
నెయ్యి లేక డాల్డా.

అరటిపండ్లు వలచి, మైదాపిండిలో వేసి, కొబ్బరపాలు పోస్తూ బాగా ముద్దగా పిసకవలయును. చిటికెడు మెత్తని వుప్పు వేయవలయును.

బాండీలో సగానికి తక్కువ గాకుండా నెయ్యి పోసి ఈ పై ముద్దను పకోడీలు వేసినట్లుగా కాగే నేతులో వెయ్యవలయును. రెండువైపులా గోధుమ రంగుకు కాలిన తరువాత జల్లి గరిటతో తీసి, పళ్లెములోనికి పెట్టవలయును. మెత్తటి పంచదార (చక్కెర) వేడివేడి వాటిమీదనే చల్లవలయును.

మామిడిపండ్ల పుడ్డింగు.

1. పడిపాలు. (పడు లేక తెలుగు దేశములో 1½ శేరు.)
1. టేబిలుస్పూను మెత్తటి బియ్యపు నూక
1. టీ స్పూను ఏలకాయల పొడి.
20. బాదం పప్పులు (తోలుతీసినవి)
2. గరిటలు తోలు తీసిన పిస్తాపప్పు.
6. తియ్యని బాగా పండిన మామిడి పండ్లు.
కొద్దిగా చక్కెర.

పాలు కాచవలెను. పాలు కాగుతూవున్నప్పుడు చక్కెరను, బియ్యపు నూకను పాలలో వేసి కొద్ది మంట మీద వుంచవలయును. పాలు గట్టిపడబోతూవున్నప్పుడు చెక్కు తీసిన మామిడిపండ్ల ముక్కలను ఆ పాలలో వేయవలయును. ముద్దగా అయినప్పుడు అడుగు మాడకుండా జాగ్రత్త పడి పొయ్యిమీదనుంచి తీసి వేరే గిన్నెలోకి పెట్టవలయును. బాదము పప్పులు పిస్తాలు సన్నగా కోసి వాటిని, ఏలకుపొడిని ఆముద్దమీద సమముగా చల్లవలయును. రిఫ్రిజిరేటరు వున్న దానిలో పెట్టిన బాగుండును. లేనియడల ఆ గిన్నెను చల్లని నీటిలో (బేసినులో నీళ్ళుపోసి) పెట్టవలయును. వేడిగా నున్నప్పుడు రుచిగా నుండదు. చల్లబడిన తరువాతనే తినవలయును.

కె. ల. ర.



గ్రంథ సమీక్ష

శ్రీ శారదామణి

శ్రీ శారదాశత వార్షికోత్సవ ప్రచురణం.

రచన: శ్రీ పి. గణపతిశాస్త్రి. ప్రకాశకులు; శ్రీ రామకృష్ణమఠాధ్యక్షులు, రాజమండ్రి. ముద్రణ: ఆంధ్ర పత్రికా ముద్రణాలయం. వెల: అర్థరూపాయి.

"పూజ్యురాలు, లోకోత్తర చరితా అయిన శ్రీ శారదా మాత జీవితం ఎల్లరకు సులువుగా బోధపడేటట్లు సులభమైన వ్యావహారిక భాషలో వ్రాసి. సరస రచనానిపుణులగు గ్రంథకర్తగారు తెలుగు పాఠకలోకానికి కానుకగా ఇస్తున్నారు. శ్రీ శారదామణి జీవితంలాగే శాస్త్రిగారి రచన అతి సరళమై, రసభరితమైంది. ఇది తెలుగు పాఠకుల హృదయాన్ని ఆకర్షించి, వారిజీవితాల్ని ప్రకాశవంతమూ ధన్యమూ చేస్తుందనడంలో సందేహం లేదు."

మణిదీపిక

రచనా, ప్రకాశకులూ, ముద్రణా పైవారే. ఇది పద్య కావ్యం. ఇతివృత్తం: భక్తిప్రబోధమై శ్రావ్యమైన ముక్తకాలలో "మాతృదేవి" స్మరణ. వెల: 0—8—0

బాలహిత బోధిని

గ్రంథకర్త్రి శ్రీమతి చవలవాడ నాగరత్నము. 78 రత్నాల్లాంటి పద్యాల్లో రత్నాల్లాంటి నీతులిమిడ్చేరు. బాల బాలికలకు హితబోధ నుపకరించే గ్రంథరాజం. ప్రాథమిక పాఠశాలల్లో పాఠ్య గ్రంథంగా నుంచితే కవయిత్రి కృషి సాఫల్య మౌతుంది. వెల: 0-2-6 లభించేచోటు: చవలవాడ కోటి నరసింహము. పరసత్యాఖ్యారు పోస్టు. సత్తెనపల్లితాలూకా--గుంటూరుజిల్లా. కె. సు.

గోపురం మామయ్యా.

(గేయసంపుటి)

ప్రాప్తిస్థానం — బుక్‌మన్స్. మద్రాసు.

అనాదినుంచి ఆంధ్రదేశంలో నయితేనేమి, అఖిలభారతావనిలో నైతేనేమి విద్య, సంస్కారము సాంప్రదాయ సిద్ధంగా వుంటూనేవుంది. నన్నయభట్టుకాలానుంచీ ఆంధ్ర సాహిత్యం గ్రంథస్థమౌతూనూ వచ్చింది. పురాణాలు మొదలుకొని పుక్కిటి గాథలవరకూ ప్రజలలో బహుళ వ్యాప్తమౌతూనే వచ్చింది. అందులో బాలబాలికలకు వుపయోగపడే సాహిత్యం గ్రంథస్థం కాకపోయినా, లేక పోలేదు. పాడేపాటలు ఆడే ఆటలరూపంలోనే కాకుండా చెప్పుకునే కథల రూపంలోకూడా వుంటూనేవుంది. ప్రతి పాటా- ప్రతి పద్యం—ప్రతికథ పిల్లలకు సుబోధకంగానూ వుండడమే కాకుండా శీలవంతులైన భావిపౌరులుగా చేయ గలిగిన సమర్థత దానికి లేకపోలేదు. అయినప్పటికీ యితర దేశీయుల బాలసాహిత్యం మనం యెరువు తెచ్చుకోవలసిన అవసరంలేదని నేననుగాని, యిటీవల బాలబాలికల నిమిత్తం ప్రచురింప బడుచున్న చందమామ బాల యిత్యాది పత్రికలలోని బాలసాహిత్యానికి యీ ప్రకృత గేయసంపుటి యేమంత వన్నె తెచ్చుటలేదు.

అన్యదేశీయుల సాహిత్య మనువదించుటలో అదిమన జాతీయతకు అనుగుణ్యంగా వుండాలి. అటువంటి పదాలు యేరుకోవాలి. ఇతివృత్తం అన్యులదైనా పాత్రసృష్టి మన జాతీయతకు దగ్గరగావుండి తీరాలి. అలా కనపడనప్పుడు మనకి అన్యదేశీయుల సాహిత్యం వుపకారం కన్నా అపకారమే యెక్కువ చేస్తుందేమో!

శ్రీ జగద్గురువు-వేంకటేశ్వర నక్షత్రమాల

(శ్రీ శంకరగురుచరితము రచయిత-కుమారి సుందరి)

బాలకవయిత్రి కుమారి సుందరి పద్యకావ్యముగ రచించిన శ్రీ జగద్గురు శంకరభగవత్పాదుల చరితము శ్రీ వేంకటేశ్వర నక్షత్రమాల రెండును చదివాను, చాలాశ్రావ్యముగ నున్నది. తొలిప్రయత్నంలోనే పెద్దల మన్ననలకు పాత్రురాలైన యీ చిన్న ఆంధ్రకవయిత్రికి మా ఆంధ్ర మహిళ ఆశీస్సులు-చదువుకుంటూవున్న యీ వయస్సులోనే యింత వున్నతాశయముతో కవనము చెప్ప గలిగిన యీ కుమారి సుందరి ప్రౌఢయై ప్రబంధ రచన కూడ సాగించ గలదనుటకు మాకెట్టి సందేహమునులేదు.

జి. సుందరీ శంకరం.

పొడుపు కథలకు జవాబులు:_ 1. చక్కిలం, 2. అప్పడం, 3. టెంకాయ, 4. గాలిపడగ, 5. వల.

"To train women workers and harness their services in the building up of the future of our Nation and Womanhood"

జనవరి 1955

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
30	31	•	•	•	•	1
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29

1. ఇంగ్లీషు సంవత్సరాది. 5. [illegible]. 8. చంద్రగ్రహణం. 13. భోగి. 14. సంక్రాంతి. 15. కనుము. 24. మాఘస్నానారంభం. 26. రిపబ్లిక్ దినోత్సవం. 30. గాంధీజీ నిర్యాణం. 29. [illegible]

ANDHRA MAHILA SABHA

MYLAPORE :: MADRAS 4.

Edited by Mrs. K. Lakshmi Raghuram, B.A.,